



సాధకా!

నిద్రించినది చాలు ....మేలుకో. మగతను వీడు .... మమతయే కీడు. అహంకారవత్తి ఆరిపోనీ. ఆత్మ జ్యోతి వెలగనీ. శాంతి నీలోనే ఉంది. సుఖము నీదై ఉంది. విలువైన బ్రతుకును వృధా చేసుకోకు. నవ్వుతూ జీవించు. జీవిస్తూ ఆనందించు.

సాధన పంచకం

వ్యాఖ్య

జ్ఞానబ్రహ్మ స్వామి సుందర చైతన్యానంద

విషయసూచిక

1.	నిత్యవేదాధ్యయనము	10
2.	కర్మానుష్ఠానము	12
3.	ఈశ్వరార్పణబుద్ధి	15
4.	వాంఛానివృత్తి	16
5.	పాపప్రక్షాళన	18
6.	సంసారదోష దర్శము	20
7.	ఆత్మ విచారణ	22
8.	గృహవిముక్తి	23
9.	సజ్జన సాంగత్యము	25
10.	నిశ్చలభక్తి	28
11.	శాంతిజీవనము	30
12.	కర్మత్యాగము	32
13.	సద్గురు సాన్నిధ్యము	33
14.	గురుపాదుకా సేవనము	35
15.	ప్రణవోపాసన	37
16.	వేదాంత శ్రవణము	39
17.	మహావాక్య విచారణ	41
18.	వేదాంతాశ్రయము	46
19.	దుస్తర్క పరిత్యాగము	47
20.	వేదతర్కాను సరణ	49
21.	నిరంతర బ్రహ్మచింతన	50
22.	అహంకార నివృత్తి	51
23.	దేహభావ విస్మృతి	53

24.	విజ్ఞ విధేయత	54
25.	క్షుద్రోగ నివారణ	57
26.	భిక్షౌషధ సేవనము	60
27.	స్వాద్వన్న అనాసక్తి	62
28.	సంతుష్ట జీవనము	63
29.	ద్వంద్వ సహనము	65
30.	వ్యర్థప్రసంగ విరమణ	66
31.	ఉదాసీన వైఖరి	69
32.	శుభాశుభ పరిత్యాగము	71
33.	ఏకాంత జీవనము	74
34.	బ్రహ్మభావము	76
35.	ఏకత్వానుభూతి	78
36.	జగన్మిథ్య	80
37.	సంచితకర్మ విముక్తి	82
38.	ఆగామికర్మ నివృత్తి	84
39.	ప్రారబ్ధ కర్మానుభవము	85
40.	బ్రాహ్మీస్థితి	87

ఓం తత్ సత్

ఉపోద్ఘాతము

కాలం కదులుతున్నది. క్షణాలు కదలి నిముషాల్ని దొర్లిస్తున్నాయి. నిమిషాలు దొర్లి గంటల్ని నడిపిస్తున్నాయి. గంటలు నడచి రోజుల్ని ఊగిస్తున్నాయి. రోజులు ఊగి మాసాల్ని ఊపుతున్నాయి. మాసాలు కదలి సంవత్సరాల్ని తోస్తున్నాయి. అన్నీ కలసి ఒక క్షణాన మానవుడ్ని మృత్యు ముఖంలో పడదోస్తున్నాయి.

మానవునికి నేడున్నది రేపుంటుందని ఖచ్చితంగా చెప్పలేము. నేటిని వినియోగించుకున్నవాడే మేటిగా నిలుస్తాడు. సాటిలేని వాడనిపించుకుంటాడు. నేటిని పాడుచేసుకుంటే అన్యాయంగా ఏటికి ఆహుతవుతాడు.

ప్రశస్తమైన మానవజన్మ లభించడమే దైవానుగ్రహంగా భావించాలి. పాశవిక ప్రవృత్తితో బ్రతుకును వమ్ముచేసుకోకుండా పవిత్రంగా జీవించి ఆత్మవిదుడుగా నిలిచిపోవాలి. దేశకాల పరిస్థితుల కతీతమై, నిష్కళానందమై భాసిల్లు ఆత్మను అనుభవమునకు తెచ్చుకొని తరించాలి. "తరతిశోక మాత్మవిత్ " ఆత్మవిదుడు దుఃఖమును దాటునని ఛాందోగ్యోపనిషత్ తెలియ జేయుచున్నది. అందులకు సాధనయే మార్గమని శాస్త్రములు ఘోషిస్తున్నవి. అనుభవజ్ఞులైన మహాత్ములు ప్రవచిస్తున్నారు. మరి సాధన అంటే ఏమిటి ?

" సద్ " అను సంస్కృత ధాతువునుండి సాధన యను పదము పుట్టినది. " సద్ " అనగా పొందుటకు ప్రయత్నించుటయని అర్థము.

పొందబడునది సాధ్యమవుతుంది. పొందుటకు ప్రయత్నించువాడు సాధకుడవుతాడు. సాధకుడు తాను సాధించ దలచుకొన్న దానిని పొందినచో తనకు సిద్ధికలిగిందని భావము. సిద్ధికలిగినవాడు సిద్ధపురుషుడు. సాధ్యవస్తువును లేదా సిద్ధత్వమును పొందగోరువాడు సాధనను చక్కగా కొనసాగించాలి. ప్రయత్నశీలునికి ఫలితము సిద్ధిస్తుంది. యత్నశీలునికి ఆ ఫలితమే యాతనతో ప్రాప్తిస్తుంది.

యత్నమునకు ప్రయత్నమునకు చాలా తేడావుంది. చేరదలచుకొన్న గమ్యాన్ని సక్రమ మార్గంలో పయనించి చేరడము ప్రయత్నమనిపించుకుంటుంది. ప్రయత్నము చేయువాని బాట క్షేమకరము. శ్రమ అల్పము. సుఖమనంతము.

అదేగమ్యాన్ని దారితప్పి అనవసర మార్గాల్లో నడక సాగించి చేరడము యత్నమనిపించుకుంటుంది. యత్నము చేయువాని బాట దుఃఖమయము అంత్యములో సుఖము ప్రాప్తించినా శ్రమ మాత్రము అధికము.

తక్కువ పెట్రోలుతో ఎక్కువ దూరము ప్రయాణము చేయు శకటము ఉత్తమమని బుధజనులంటారు. అట్టి ఉత్తమమార్గము జ్ఞానమే గాని కర్మ కానేరదు. జ్ఞానావశ్యకతను తెలియజేయుటకే శాస్త్రముగాని కర్మాచరణకు కాదు.

"కర్మ నిమిత్తం నశాస్త్రకృతం సర్వప్రాణిషు దర్శనాత్ "

కర్మకు ప్రేరణ ప్రాణులయందే చక్కగా గోచరింపబడుచున్నందున కర్మాచరణకు శాస్త్రప్రమాణ మవసరం లేదు " అని శ్రీ శంకరులవారు ఛాందోగ్యోపనిషద్భాష్యంలో తెలియజేశారు.

కనుక ఆత్మ మార్గమున పయనించు సాధకునికి జ్ఞానమార్గమే శ్రేయోదాయకము. జ్ఞానమార్గమున యాత్రసల్పు ముముక్షువు ఏడు భూమికల నధిరోహిస్తాడు. అవియే సప్తజ్ఞాన భూమికలు. అవి 1) శుభేచ్ఛ 2) ఆత్మ

విచారము 3) అసంగభావన (లేక) తను మానసి 4) సత్త్వాపత్తి 5) అసంసక్తి 6) పదార్థ భావన (లేక) తురీయము 7) తుర్యగము (లేక) మోక్షము. వీటిని గురించి కాస్త విపులంగా తెలుసుకుందాము.

1. శుభేచ్ఛ :- ఆధ్యాత్మిక చింతనాభిలాష మనసులో ఏర్పడాలి. ఇదియే శుభేచ్ఛ. ప్రాపంచిక విషయ వాసనా ప్రభావముచే చెదర గొట్టబడిన మనో బుద్ధులు తత్త్వ చింతన చేయలేవు. తత్త్వచింతన చేయలేని అంతఃకరణలో శుభేచ్ఛ కనుపించదు. మహాత్ములను దర్శించుట వలన, వారు బోధించు తాత్త్విక విషయములను శ్రవణము చేయుట వలన, పుణ్యక్షేత్ర సందర్శనము వలన, తీర్థక్షేత్ర పర్యటన వలన మనసులో భగవత్సంబంధిత సంకల్పాలు మొలకెత్తుతాయి. ఆత్మ విషయమై ప్రగాఢమైన ఇచ్ఛ జనిస్తుంది. అట్టి అభీష్టము శుభప్రదమైనదిగాన అది శుభేచ్ఛ యని పిలువబడింది. ఆధ్యాత్మిక సాధకుడు పయనించు జ్ఞాన భూమికలలో ఈ శుభేచ్ఛ మొదటిది.

2. ఆత్మ విచారము :- ఆత్మ విషయమై శుభేచ్ఛ జనించిన పిదప మనసులో విచారణ కొనసాగించాలి. శాస్త్ర పరిశోధన ద్వారా, గురు వాక్యము ననుసరించుటద్వారా బుద్ధిలో ఆత్మానాత్మ వివేకజ్ఞానము వృద్ధి పరచుకోవాలి. తానెవరో విచారణ చేయాలి. దేహముయొక్క అనిత్యత్వాన్ని, మనోబుద్ధుల చంచలత్వాన్ని, ఇంద్రియాల చపలత్వాన్ని గుర్తించాలి. దేహ మనోబుద్ధులకు అధిష్ఠానమై, నిత్యమై భాసించు ఆత్మను గూర్చి విచారణ సాగించాలి. ఇలా నిత్యా నిత్య వస్తు వివేకం ద్వారా ఆత్మ విచారమును కొనసాగించుట రెండవ భూమిక.

3. అసంగభావన (లేక) తను మానసి :- మూడవ భూమికయైన అసంగ భావన స్థితికి చేరిన వ్యక్తి మనసులో సంకల్పాల హోరు తగ్గుతుంది. మనసులో శుభేచ్ఛ ఏర్పడి యున్నందున సంకల్పాలు సక్రమ మార్గంలో నడుస్తాయి. ఆత్మ విచారము కొనసాగించుట వలన నిత్యవస్తు ప్రాప్తికై అభిలషించడము జరుగుతుంది. అందుచేత అనిత్యమైన జగద్విషయములందు అనురక్తి క్షీణిస్తుంది.

జగదీశ్వరుని యందు ఆసక్తి వృద్ధిచెందుతుంది. బహిర్ముఖమయ్యే మనోబుద్ధులు అంతర్ముఖ మవుతాయి. మనసు అంతర్ముఖం కాగానే సంకల్పాలు కదలలేక ఆగిపోతాయి. సంకల్పాలు ఆగడంచేత విషయ సంగత్వము క్షీణిస్తుంది. నిస్సంగత్వ మేర్పడుతుంది. ఈస్థితినే అసంగ భావన లేక తను మానసి అని చెబుతారు. ఇది జ్ఞాన భూమికలలో మూడవది.

4. సత్త్వాపత్తి :- నాల్గవ భూమికయైన సత్త్వాపత్తి స్థితికి చేరిన వ్యక్తికి వాసనలు ప్రక్షాళన మవుతాయి. మనసులో సూక్ష్మరూపంగా యున్న వాసనల యొక్క ప్రభావం చేతనే సంకల్పాలు నడుస్తాయి. సంకల్పాలు మనిషిని ప్రేరేపించి కర్మల నాచరింపచేస్తాయి. శుభేచ్ఛ, ఆత్మ విచారముల ద్వారా పరోక్ష వస్తుతంత్ర జ్ఞానము కలుగుటచేత వాసనలలో మార్పు జనించి సంకల్ప ప్రవాహమును నిరోధించడము జరుగుతుంది. ఇట్టి అసంగభావన అంతఃకరణలో కొనసాగుటవలన వాసనలు నిర్వీర్యమై అదృశ్యమవుతాయి. ఇదియే సత్త్వాపత్తి. జ్ఞాన భూమికలలో నాల్గవది. ఈస్థితికి చేరిన వ్యక్తి మనసులో ప్రశాంతత చోటు చేసుకుంటుంది. ఉద్రేకాలు అంతరించి పోతాయి. ఆవేశాలు అణగారిపోతాయి. ఆవేదన అదృశ్యమవుతుంది. ఆనందం పొడసూపుతుంది. మంగళకర దృష్టి ఏర్పడుతుంది. అందరిలోను ఆత్మను దర్శించే అభ్యాసము కలుగుతుంది.

5. అసంసక్తి :- సత్త్వాపత్తి స్థితిలో సంపూర్ణంగా అంతర్ముఖమైన మనోబుద్ధులు చైతన్యంలో లయించడము వలన కలిగెడి ఆనందానుభూతియే ఈ అసంసక్తి భూమిక. ఈ స్థితిలో జీవుడు ఆనంద స్వరూపమును అనుభవము ద్వారా అందుకొని తృప్తి చెందుతాడు. అసంసక్తి భూమికలో దేహధ్యాస వుండదు. కనుక దేహాభిమానము స్ఫురించదు. దేహాభిమానము నశించడము చేత దేహసంబంధిత వ్యామోహాలు, బాంధవ్యాలు చిగురించవు. శారీరకంగా వచ్చు మార్పుల కతీతుడై, దేహబాధల నధిగమించి, పూర్ణానంద స్వరూపుడై వెల్గొందుతాడు. సత్వరజస్తమోగుణాల కతీతుడై, దేశకాల పరిస్థితుల కందనివాడై, నిర్మలానందముతో భాసిస్తాడు. ఇట్టిస్థితినే ఐదవ భూమికయైన అసంసక్తిగా చెబుతారు.

6. తురీయము (లేక) పదార్థ భావన :- అసంసక్తి ద్వారా ఏర్పడిన ఆనందమునకు జ్ఞానము తోడై భాసించు అనిర్వచనీయ అనుభూతియే పదార్థ భావన (లేక) తురీయము, అను భూమిక. ఇది జ్ఞానసాధనలో ఆరవ భూమిక. ఈ స్థితిలో అజ్ఞానము సమూలంగా దగ్ధమైపోతుంది. నేను, నాది యనే అహంకారమమకారాదులు నశించిపోతాయి. ఏకత్వానుభూతి అనుభవగ్రాహ్యమై యుంటుంది. సత్తును, అసత్తును రెండింటిని ప్రకాశింప చేసే అధిష్ఠానము అనుభూతిగా మిగుల్తుంది. జ్ఞాన స్ఫూర్తితో ఆనందానుభూతి కల్గుతుంది.

7. తుర్యగము :- ఏడవ భూమిక పరమోత్కృష్టమైనది. దీనినే తుర్యగమనియు, శుద్ధతురీయ మనియు, తురీయాతీత మనియు, మోక్షమనియు పిలుస్తారు. ఇదియే నిర్బీజ నిర్వికల్ప సమాధి. ఉపాధి రహిత పరమానందస్థితి. అనిర్వచనీయానుభూతి. నిష్కళంక నిర్మలానందప్రాప్తి. నిష్క్రియత్వ నిరావరణ సమాధి.

మొదటి మూడు భూమికలు జాగ్రదావస్థకు సంబంధించినవి. నాల్గవ భూమిక స్వప్నావస్థకు సంబంధించినది. ఐదవ భూమిక సుషుప్త్యవస్థకు సంబంధించినది. ఆరవ భూమిక తురీయమునకు, ఏడవ భూమిక తురీయాతీత స్థితికి సంబంధించినవి.

ఈ సప్తజ్ఞాన భూమికల ద్వారా నడక సాగించినమానవుడు మోక్షమును పొంది తరించును. ఇదియే సాధన. ఈ సాధనను తెలియజేయుచు శ్రీ ఆదిశంకరులు 'సాధనపంచకమ'ను దానిని రచించారు. ఇందులో ఐదు శ్లోకాలుంటాయి. ప్రతి శ్లోకంలోను సాధకుడు ఆచరించ వలసిన విషయాలు ఎనిమిది తెలియజేయబడ్డాయి. అయిదు శ్లోకాలలో కలిపి నలభై సూచనలు చక్కగా అందించబడ్డాయి. ఈ నలభై సాధన విషయములపై చేసిన విపుల వ్యాఖ్యానమే ప్రస్తుతము మనము పఠించు " సాధన పంచకము."

గతంలో శ్రీ శంకరుల భజగోవిందమునకు వ్యాఖ్య వ్రాసి భక్తుల అమృత హస్తముల యందుంచడము జరిగినది. ప్రస్తుతము సాధన పంచకముపై

వ్యాఖ్యానము తయారుచేసి సాధకుల ముందుంచడము జరుగుచున్నది. శంకరకృప నాపై ప్రసరిస్తున్నంత కాలము వారి గ్రంథాలకు వ్యాఖ్యానము వ్రాయుటద్వారా భక్తులకు సేవచేయగలవాడను. " భక్తుల సేవయే భగవంతుని సేవ " యని నా ప్రగాఢ విశ్వాసము.

శంకర వాఙ్మయ ప్రియులారా ! జ్ఞాన మార్గమున నడకసాగించు ముముక్షువులారా ! నా నమస్కారములతో పాటు ఈ గ్రంథము నందుకోండి. ఇందులో జ్ఞాన స్ఫూర్తిని కల్గించు ఏ ఒక్క వాక్యమైనను అది శంకర కృపయే. అజ్ఞానమునకు సంబంధించిన చెత్తను గూర్చి వేరుగా చెప్పాలా ? అదంతా నా సొత్తేనని గ్రహించండి.

బుధ జనులారా 1982వ సంవత్సరము జూలై మాసములో ఈ 'సాధన పంచకము' గ్రంథాన్ని ముద్రించడము జరిగినది. ఇప్పటికి ఐదు ముద్రణలు జరిగాయి. ఇది ఆరవ ముద్రణము. మీరు చదవండి. సాధనను కొనసాగించండి. సాధ్యవస్తువును చేజిక్కించుకోండి.

– (శుభమస్తు) –

ప్రణవ ప్రేమలతో,

స్వామి సుందర చైతన్యానంద

ॐ

ఆదిశంకరుల

సాధన పంచకము

వేదో నిత్య మధీయతాం
తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం
తేనేశస్య విధీయతాం
అపచితిః కామ్యేమతి స్త్యజ్యతాం
పాపౌఘః పరిధూయతాం
భవసుఖేదోషోఽను సంధీయతాం
ఆత్మేచ్ఛా వ్యవసీయతాం
నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్ ‖ 1

తాత్పర్యము :–

1. నిత్యము వేదాధ్యయనము చేయాలి.
2. వేదమునందు తెలియజేయబడిన కర్మలనుదీక్షతోఆచరించాలి.
3. మనముచేయు కర్మలన్నీ ఈశ్వరునికి సమర్పించాలి.
4. మనస్సులోని కోరికల సమూహము విడచిపెట్టాలి.
5. పాపాలను ప్రక్షాళనం చేసుకోవాలి.
6. సంసారమునందలి సుఖము శోకతప్తమైనదని తెలుసుకోవాలి.
7. ఉత్తమ శ్రద్ధతో ఆత్మవిచారణ జరుపుకోవాలి.
8. గృహ శృంఖలాలనుండి విముక్తుడివి కావాలి.

వ్యాఖ్య

1. నిత్య వేదాధ్యయనము (Study the Vedas daily) :-

నిత్యము వేదాధ్యయనము చేయాలి. సనాతన ధర్మ జీవనానికి ప్రామాణిక గ్రంథము వేదము. " విద్ " అను సంస్కృతధాతువు నుండి వేదమను పదము ఆవిర్భవించినది. "విద్" అనగా తెలుసు కొనుట యని భావము. " వేదము " యనగా తెలుసుకొనదగినది, జ్ఞానరూపమని అర్థము. మరి తెలుసుకొనదగినది ఏది ? ఈ ప్రపంచములో మనము సర్వమును తెలుసుకొనుచున్నాము. అన్నింటిని తెలుసుకొనే తెలివిని గూర్చి తెలుసుకొనే ప్రయత్నము చేయలేక పోతున్నాము. ప్రాపంచిక వస్తు ప్రపంచ స్థితిని ఎంతగా ఆకళింపు చేసుకున్నను మానవునికి దుఃఖం తప్పడం లేదు. శోకం అంతం కావడంలేదు. ఏది తెలుసుకొంటే సర్వము తెలియబడుతుందో దానిని తెలుసుకోవడం చేత సమస్త క్లేశములు హరింపబడతాయి. తెలియబడే వస్తు ప్రపంచ సంఘాతమునంతా ఒకే శక్తి గ్రహించినపుడు అట్టి శక్తిని తెలుసుకొంటే సమస్తము అందులో అంతర్భూతమయ్యే యున్నది. అన్నిటిని గ్రహించు అమరజ్యోతియే ఆత్మ. ఆత్మను గూర్చి తెలియచేయు అమృత సందేశమే వేదము.

వేదము అపౌరుషేయము. వేదమునకు ఇతర మత గ్రంథములకు వలె కర్త లేదు. వేదము మనిషిచే రచింపబడినదికాదు. భగవంతుడే వేదమునకు కర్త. సృష్టి స్థితి లయాలకు ఆధారము వేదము. వేదవిజ్ఞానము ననుసరించియే ఈ సృష్టి క్రమమంతయు జరుగుచున్నది. వేదమొక నాదము. అది వాదములకు చిక్కదు. భేదములకు దక్కదు. అది అనాహత నాదామృతము. అంతఃకరణ శుద్ధి కలిగి, నిరంతర తపోనిష్ఠా గరిష్ఠులైన మహర్షులు ధ్యాన చిత్తులై యున్న ప్రశాంత మానసిక వాతావరణంలో అంతర్యంనుండి వేదము వారికి వినిపించింది. వినపడింది. కనుక "శృతి" అయింది. మహర్షులు తాము విన్న విషయాన్ని

తమ శిష్యులకు తెలియజేశారు. శిష్యులు గురువులై వారి శిష్యులకు బోధించారు. ఇలా గురు శిష్య పరంపరగా వేదము వల్లించబడుతూ ఈనాటివరకు నడక సాగించింది. సాగిస్తున్నది. భవిష్యత్తులో కూడా సాగుతూనే యుంటుంది. గురు శిష్యులు కలసి మౌఖికముగా వల్లె వేయుచూ ఈ సనాతన జ్ఞాన భాండాగారమును ఈనాటివరకు భద్రపరచారు. ముద్రణ సౌకర్యాలు ఆనాడు లేనందువలన వేద విజ్ఞానమంతయు తపోధనులైన మహర్షుల పవిత్ర మస్తిష్కములలోనే నింపబడి, చెదరకుండా నడక సాగించింది. చెవినుండి చెవికి పయనిస్తూ రావడంచేత వేదవిద్యను " కర్ణపరంపర " యని కూడా అంటారు.

వేదము ఎన్నో విషయాలు చెబుతుంది. అన్నిటిని గ్రహించడానికి అనువైన మనసుండాలి. అంతఃకరణ శుద్ధి కావాలి.చిత్త శాంతిని కలిగి యుండాలి. మనోఫలకము శుద్ధ దర్పణమువలె పరిశుద్ధమై నిర్మలమై భాసిస్తుండాలి. అది ఎలా సాధ్యం? వేదాధ్యయనము చేయుటచేతనే. నీళ్ళకుండలో నీటిని నింపునపుడు ముందుగా ఆ నీటితోనే కుండను కడుగునట్లు, వేదమును గ్రహించు ప్రశాంత చిత్తము వేదాధ్యయనము చేయుటచేతనే కలగాలి. వేదమును అధ్యయనము చేయు వ్యక్తికి జీవిత నిత్య సత్యాలు బోధపడుతాయి.

" శాస్త్ర హేతుత్వాత్ ధర్మాధర్మ విజ్ఞానస్య "

" ధర్మాధర్మములను గ్రహించు మన జ్ఞానమునకు వేదమే ప్రమాణమై యున్నదని", శ్రీ శంకరులు బ్రహ్మ సూత్ర భాష్యంలో తెలియజేసియున్నారు.

సత్యావగాహన బీడువారిన తన హృదయంలో అమృతజల్లులు కురిపించి, ఆచరణకు ప్రోత్సహించి అంతర్ముఖం చేస్తుంది. కనుక భ్రాంతిమయ సంసారిక అజ్ఞానాంధకారములో దిక్కుతోచక పరిభ్రమించు మానవుడు వేదాధ్యయన జ్యోతిని వెలిగించుకొని తద్వారా తన మార్గమును తెలుసుకొని యాత్రను సుఖవంతం చేసుకోమని శ్రీ శంకరాచార్యులవారు ఈ సాధన పంచక ఆలయ నిర్మాణంలో ప్రథమసోపానం తయారు చేశారు.

2. కర్మానుష్ఠానము (Carry out the injunctions of the Vedas) :-

వేదమునందు తెలియజేయబడిన కర్మలను శ్రద్ధతో ఆచరించమంటున్నారు శ్రీ శంకరులు. నిత్య వేదాధ్యయనము కొనసాగించవలయునని ప్రారంభములోనే తెలియజేశారు. వేదాధ్యయనము ద్వారా వేదాంతర్గత సత్యాలు బోధపడుతాయి. సత్యము తెలియడము వేరు. తెలిసిన సత్యమును ఆచరించడము వేరు. అధ్యయనము ఆచరణ కుపయుక్తం కావాలి. ఆచరణలేని అధ్యయనము అజ్ఞానాభ్యాసమేగాని ఆత్మైక్యానందము కానేరదు. ఒక్కనాటి ఆచరణ కొన్ని సంవత్సరముల అధ్యయనముకన్నా ఉత్కృష్టము. **An ounce of practice is better than tons of theory, study and talk.** కనుక వేదమును చిలుకవలె వల్లించి బావిగిలకవలె పరిభ్రమించక వేదసత్యాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. మొదట అర్థం చేసుకోవాలి. ఆ తరువాత ఆచరణ సాధ్యపడుతుంది. ఇలా అర్థం కాబడిన విషయాలను, వేద ప్రతిపాదిత కర్మలను ఆచరణలో యుంచడానికి ప్రయత్నించాలి. కర్మాచరణ అంత సులభంకాదు. మధ్యలో ఎన్నో అడ్డంకులు రావచ్చు. అవరోధములు కలుగవచ్చు. అయినను దృఢ దీక్షతో ఆచరణకు పూనుకోవాలి. కర్మాచరణమునందు అచంచల ఆత్మ నిశ్చయము కలిగియుండాలి. కర్మచేత మోక్షము సిద్ధిస్తుందా ? సిద్ధించదు.

" నకర్మణోస్తి నిశ్రేయసః సాధనత్వమ్ "

" పరామృతానందమునకు కర్మలు మార్గము కానేరవు " అని శ్రీ శంకర భగవత్పాదులు తన గీతాభాష్యంలో తెలిపియున్నారు.

కర్మ అజ్ఞాన జనితము గనుక జ్ఞానమునకు సోపానము కానేరదు. మన మాచరించు కర్మలు మూడు విధాలుగా ఉంటాయి. 1) లౌకిక కర్మలు 2) శ్రౌత కర్మలు 3) స్మార్త కర్మలు. లౌకిక కర్మలు ప్రాపంచికమైనవి. మనోపరిధిలో కలుగు ఆవేశమునకు బాహ్యజగత్తులో ఆకృతిని ఏర్పరచునవి. లౌకిక కర్మల కాక ప్రమాణముండదు. ప్రబోధముండదు. లౌకిక కర్మలు శాశ్వతానందము

నివ్వలేవు. కర్మద్వారా అనుభూతి పొందడము మూడు విషయాలపై ఆధారపడి యుంటుంది. కర్మ చేయాలని సంకల్పించే మనసు 1) ఇంద్రియాలద్వారా 2) వస్తువులు 3) వ్యక్తుల చెంతకు పయనించి అనుభవాలు గడిస్తుంటుంది. మనసు, ఇంద్రియాలు, వస్తువులు ఒకే అనుభూతిని పొందుటకు అనుకూలంగా నున్నప్పుడే అనుభవం చక్కగా ఏర్పడుతుంది. కానీ సాధారణంగా మనోసంకల్పాదులతో ఇంద్రియాలు సహకరించవు. ఒక వేళ మనసు, ఇంద్రియాలు ఒకే బాటలో నడిచినా వస్తువులు భిన్న మార్గంలో కదలి బాధపెడతాయి. కనుక లౌకిక కర్మాచరణ మానవునికి నిర్మలానందమును ప్రసాదించలేదు.

రెండవది శ్రౌతకర్మలు. ఇవి వేదమునందలి కర్మకాండయందు ప్రతిపాదించబడియున్నవి. ఇవికూడా జీవికి పరిపూర్ణానందమును ప్రసాదించలేవు.

" నహికర్మ కాణ్డేన పరఆత్మా ప్రకాశ్యతే "

" వేదమునందలి కర్మకాండ ఆత్మజ్ఞానమును ఎరుకపరచలేదని " శ్రీ శంకరులు బృహదారణ్యకోపనిషద్భాష్యంలో తెలియజేశారు. యజ్ఞయాగాది కర్మలన్నియు ఒక ఫలితము నాశించియే నిర్వహించ బడుచున్నవి. లేనిదానిని పొందుటకై చేయు ప్రయత్నమైయున్నది. కానీ జీవుడాశించు ఆనందము ఉన్నదానిని తెలుసుకొనుటచే పొందబడునదియేగాని లేనిదానిని అన్వేషించి అనుభవించేది గాదు. అదియును గాక ఈ శ్రౌతకర్మాచరణలో దోషములు కదిలినా, లోపములు కలిగినా దానివలన ఇక్కట్లు సంభవించే ప్రమాదము కూడా కలదు. అట్టి కర్మల పరిహారార్థం వేదమే ప్రాయశ్చిత్త కర్మలను కూడా సూచించి తెలియజేసింది. కర్మాచరణ సరిగా నిర్వహించబడక పోయినందున తద్వారా కలుగు ప్రమాదములను నివారించుటకు ఆచరించవలసిన కర్మలే ప్రాయశ్చిత్త కర్మలు. ఉ॥ "పెన్సిలిన్ ఇంజక్షన్" వలన వచ్చు రియాక్షన్ నుండి కాపాడుటకు ' అవిల్ ' ఇంజక్షన్ చేసినట్లు.

మూడవది స్మార్తకర్మలు. అనగా స్మృతులచే ప్రతిపాదించబడినవి. మనుధర్మ, పరాశర, యాజ్ఞవల్క్య ధర్మస్మృతులలో స్మార్తకర్మలు తెలియజేయబడినవి. ఇవి ధర్మమార్గమున యాత్ర చేయుటకు ఉపకరిస్తాయి. ధర్మాచరణము చేత పుణ్యం లభిస్తుందేగాని మోక్షము సిద్ధించదు. పుణ్యఫల విశేషముచేత ఇంద్రాది పదవులు సంక్రమిస్తాయి. కాలములో కలిసొచ్చిన పదవులు కాలంలోనే నశిస్తాయి. " క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి " పుణ్యముతరిగిపోగానే మళ్ళీ భూలోకాని కరుదెంచవలసి వస్తుంది. గర్భదరిద్రుడైన వాడు కొంతకాలము నిద్రలో చక్రవర్తియై సాధించే దేముంటుంది ? కనుక స్మార్తకర్మలు కూడా అపరిపూర్ణమై మానవుని కర్మ సముద్రములో పడదోస్తాయి.

"అనిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్ "

"కర్మకు, అజ్ఞానమునకు పరస్పర విరోధములేదుగాన కర్మానుష్ఠానము అవిద్యను తొలగించలేదు " యని శంకరాచార్యులవారే ఆత్మబోధ యందు తెలియజేసి యున్నారు.

" యదేవ ప్రవృత్తి కారణం తదేవ నివృత్తికారణం న భవతి "

"బంధమునకు కారణమైన కర్మ బంధ విముక్తికి కారణం కానేరదు " యని బృహదారణ్యకోపనిషద్భాష్యంలో ఆచార్యులు తెలియజేసియున్నారు.

" నహి తమ స్తమసో నివర్తకమ్ "

" చీకటిని చీకటిచే నిర్మూలించలేనట్లు కర్మ అజ్ఞానమును పోగొట్టలేదు" యని భగవత్పాదులు తన గీతాభాష్యంలో తెలియజేసియున్నారు.

మరి అవిద్య ఎలా తొలగుతుంది? కర్మచేత తొలగదు. అలాగని మనిషి కర్మలాచరించకుండా యుండగలడా?

"నహికశ్చిత్ క్షణమపి జాతుతిష్ఠ త్యకర్మకృత్ "

కర్మాచరణ లేకుండా మనిషి క్షణకాలం కూడా మనుగడను సాగించలేడు. మరి కర్మ అజ్ఞాన జనితం గనుక కర్మాచరణ అజ్ఞానము నెలా నిర్మూలిస్తుంది? అలాగని కర్మలాచరించకుండా మనిషి జీవించగలడా? కర్మలాచరింపబడాలి. అయితే అవి బంధహేతువులు గాకుండా యుండాలి. అది ఎలా సాధ్యం? ఈ విషయమును తరువాత సోపానములో తెలియజేయుచున్నారు.

3. ఈశ్వరార్పణ బుద్ధి (Offer the fruits of actions to the Almighty) :-

మనము చేయు కర్మలన్నీ ఈశ్వరునికి సమర్పించాలి. కర్మలు ఈశ్వరునికి సమర్పించడమెలా ? కర్మలనెందుకు సమర్పించాలి? కర్మలు అసంపూర్ణతకు చిహ్నములు. కర్మలు అజ్ఞాన జనితములు. మరి అజ్ఞానమనునది కర్మ యందున్నదా? కర్మచేయువాని భావము నందున్నదా? కర్మజడము గనుక కర్మ చేయువాని మనోభావమందే యున్నది. కనుక కర్మచేయువాని అంతర్యములో యున్న అజ్ఞానబీజము అహంకారమను వృక్షాన్ని తయారుచేసి శాఖోపశాఖలుగా విస్తరింప చేసింది. అహంకారమే సర్వ కర్మలకు మూలవస్తువై యున్నది. బీజస్థానమై యున్నది. కనుక అహంకారమును భగవానునికి సమర్పించాలి. మనము చేయు కర్మలన్నీ ఈశ్వరునికి సమర్పించుట యనగా అహంకారమును స్వామి పాదాల చెంత సమర్పించుట యని భావము.

మనసులో అహంకారము తొలగినచో ఆత్మానందము కరతలామలకము. గళమునందలి కంటకము ఆహారమును భుజింపనీయక నిరోధించునటుల అహంకారము ఆత్మానందమును అనుభవించనీయక బాధపెట్టుచున్నదని ఆదిశంకరాచార్యుల వారు ప్రబోధించారు. కంఠమున చేరినముల్లు మహా ప్రమాదకరము. రుచికరమైన పదార్థములు వడ్డించబడ్డాయి. తినవలయుననెడి కుతూహలం మనస్సులో యున్నది. అయినను కంఠమున ముల్లువుండుటచేత భుజించను వీలు లేకుండాయున్నది. ముల్లును తొలగించినచో భుజించి ఆనందించవచ్చును. అలాగే మనస్సను గళమున కంటకమను అహంకారము చేరి ఆత్మానంద భోజనమును భుజింపనీయక అడ్డుపెట్టుచున్నది. అహంకారమును తొలగించినచో ఆత్మానుభూతిని పొంది తరించవచ్చును.

అహంకారమును తొలగించవలయునన్నచో మన మనసులో కదులు సంకల్పాలను శ్రీకృష్ణ పద పంకజముల చెంతకు నడుప గలగాలి. ఈశ్వర సంకల్పాలతో మది నిండగానే అహంకారము అదృశ్యమై ఆనందము తాండవిస్తుంది. మనస్సులో కదిలే కామ సంగీతానికి అనువుగా అహంకార నర్తకి అభిమాన పాదానికి రాగద్వేషాలనే గజ్జె కట్టి భ్రాంతి నృత్యము చేయడానికి ప్రారంభిస్తుంది. వెంటనే అహంకార నర్తకి మాయా ప్రదర్శనను పసిగట్టి " కృష్ణా ! వాసుదేవా ! " యని ఆర్తితో, భక్తితో, భగవానుని పిలవాలి. అంతే అహంకారము అదృశ్యమైపోతుంది.

అహంకారము కొంతకాలము కనుపించక పోవచ్చును. అంతమాత్రము చేత అది సమూలంగా నశించిందని భావింపరాదు. అహంకార వృక్షాన్ని కూకటి వ్రేళ్ళతో కూడా పెకలించాలి. అలా కానిచో ఏ క్షణమైనను అహంకార శేషాంకురము సజీవమై చిత్ర విచిత్ర పంథాలో వృద్ధి చెంది మానవ స్వరూపమునే మార్చి వేయవచ్చును. కనుక అహంకారమును నిర్విశేషంగా మార్చాలి. నిరంతరము మన ఆంతర్యములో కదిలే సంకల్పాలను భగవానునిపైకి మరల్చడము చేతనే అహంకారము నిర్మూలించబడుతుంది. భగవత్స్మరణతో సదా జీవించి అహంకారమును రూపుమాపుటయే కర్మలను భగవంతునికి సమర్పించుట యని భావము.

4. వాంఛానివృత్తి (Abandon the band of desires in toto) :-

మనసు లోని కోరికల సమూహమును విడిచిపెట్ట మంటున్నారు శ్రీ శంకరులు. చెఱువు నీటితో నిండియున్నట్లు మానవుని మనస్సు కోరికలతో నిండి యుంటుంది. కోరికలను తీర్చడమనేది అగ్నిలో నేయిపోసి ఆర్పడానికి చేసే ప్రయత్నమే అవుతుంది. కోరికల వలననే కర్మ జరుగుచున్నది.

" కామాయమానశ్చ కరోతి కర్మాణి "

కోరిక చేతనే కర్మాచరణ జరుగుచున్నదని తైత్తిరీయోపనిషద్భాష్యంలో శ్రీ శంకరాచార్యులవారు తెలియజేసియున్నారు.

కోరికలకు అంతమనేది ఉండదు. తీర్చుతున్న కొద్ది వేయినాల్కలను చాచి ఆక్రోశిస్తూనే యుంటుంది. కారాగారంలో యున్నవాడు శారీరకంగా ఖైది. కోరికలమధ్య నున్నవాడు మానసిక ఖైది. కోరికలు మానవుని పిచ్చివాణ్ణిగా చేసి వస్తు ప్రపంచము చుట్టూ పరిభ్రమించేలా చేస్తాయి. కోరికలకు బానిసయైన మానవుడు రాగద్వేషాలకు లొంగియుంటాడు. పాపపుణ్యాలమధ్య నలిగిపోతుంటాడు. మంచి చెడుల మధ్య సతమత మవుతుంటాడు. మానావమానాల మధ్య కలతచెందుతుంటాడు. నిరాశతో, నిస్పృహతో జీవితాన్నొక బండ బ్రతుకుగా మార్చుకొని చావు బ్రతుకుల తారతమ్యం గ్రహించలేక పోతపోసిన శోకమూర్తిలా మిగిలిపోతాడు.

తీరిన కోర్కెలు నూతనానుభవాన్ని వాంఛిస్తుంటాయి. తీరని వాంఛలు హృదయంలో నిరాశాగాలుల్ని తోలుతుంటాయి. కోరికలు తీరినా దుఃఖమే తీరకపోయినా శోకమే. ఎటు చూచినా శోక సముద్రంలో మనలను పడదోయు కోరికలను విషతుల్యంగా భావించి విసర్జించాలి. కోరికల వలన మనస్సు కలత చెందుతుంది. కలత చెందిన మనస్సులో ఆందోళన కదులుతుంది. ఆందోళనా పూరిత మనస్సులో ఆవేదన చెలరేగుతుంది. ఆవేదన ననుభవించు మనస్సులో అవగాహన అంతరిస్తుంది. అవగాహన లేనిదే ఆధ్యాత్మిక మార్గంలో చరించడము కష్టము.

నిర్వికల్పానందమును పొందుటకు నిర్మల అంతఃకరణ అవసరము. కోరికలచేత మనోనైర్మల్యము కుంటుపడుతుంది. కనుక కోరికలను విడనాడాలి. దానికి మార్గమేమిటి? ఒక్క కోర్కెను పట్టుకొని మిగతా కోర్కెలన్నిటినీ విడచి పెట్టాలి. పట్టుకోవలసిన ఒక్క కోర్కె ఏమిటి? ఏ కోరిక ఉండకూడదనే కోరిక. ఆ ఒక్క కోర్కెను గట్టిగా కౌగిలించుకుంటేచాలు. మిగతా కోర్కెలన్నీ వాటంతటవే పలాయనం చిత్తగిస్తాయి. కోరికలన్నిటిని నశింపచేయు కోరికగాని ఆ కోరికను ఎలా అలవరుచుకోవాలి? దానికి సూటియైన మార్గం సదా భగవానుని అనంత చైతన్యమును గురించి స్మరించుటయే. తద్వారా కలుగు అమృత ఫలమును గూర్చి మననం చేయుటయే. సదా భగవానుని గూర్చి

చింతించుట వలన, ఆత్మైక్యాను సంధానము చేయుటవలన భగవంతునిపై గాఢానురక్తి కలిగి ప్రాపంచిక విషయాలపై విరక్తి జనిస్తుంది. విషయ ప్రపంచము విషపూరితమనే జ్ఞానం కలుగుతుంది. అట్టి ఆత్మానాత్మ వివేక జ్ఞానంతో కోరికలు అంతరించిపోతాయి. కోరికలవలన ఏర్పడిన కల్మషములన్నీ కరిగిపోతాయి.

5. పాప ప్రక్షాళన (Wash off all sins) :-

మనలోని నిగూఢమైన కోరికలే కర్మాచరణమునకు కారణమగుచున్నవి. ప్రతివ్యక్తి అసంఖ్యాకమైన కోరికలతో కరుడుగట్టి యుంటాడు. కోరికలను తృప్తిపరచుకొనుటకు కర్మల నాచరిస్తుంటాడు.

శరీరముద్వారా మనము కర్మల నాచరిస్తాము. అలా కర్మాచరణకు ఆంతర్యంలో మనము జరుపు చింతనమే కారణము. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క విధమైన విషయాను చింతన జరుగుతుంటుంది. అలా వ్యక్తులలో భిన్న విషయాను చింతన జరుగుటకు వారిలో సూక్ష్మంగా యున్న అభిరుచులే కారణము. ఈ అభిరుచులు మనసులో ఎలా చోటుచేసుకున్నవి ? ఎక్కడ నుండి కల్గినవి ? ఇక్కడ కొద్దిగా విచారణ సాగించాలి.

ఆసక్తితో మనం కర్మల నాచరిస్తాము. కర్మలాచరింపబడగానే ఫలితాలు కాలంలో నిర్ణయింపబడతాయి. కర్మలకు వెంటనే ఫలితాలొస్తాయి. ఉదా ‖ దాహంగా వుంది, నీళ్ళు త్రాగాము. వెంటనే దాహం తీరింది. మరికొన్ని కర్మలకు కాలవ్యవధి వుంటుంది. ఉదా ‖ ఈరోజు భూమిలో విత్తనము వేశాము. అది ఎంతో కాలమునకు చెట్టుగామారి ఫలితాన్నిస్తుంది. ఆయా కర్మల స్థితిగతుల్ని బట్టి ఫలితాలు నిర్ణయింపబడుతుంటాయి. ఏది ఎట్లున్నను కర్మంటూ జరిగితే ఫలితము నిర్ణయింపబడుతుంది. అందుతుంది. అనుభవించిన కర్మఫలము అంతటితో అదృశ్యము కాదు. మనస్సులో అనుభూతిగా నిలిచియుంటుంది. సూక్ష్మాతి సూక్ష్మంగా మనస్సులో చోటుచేసుకొనియుండి, అనుకూల మానసిక వాతావరణంలో మనిషిని

ప్రేరేపిస్తుంటాయి. వీటినే “ వాసనలు ” అంటారు. వాసనా ప్రేరిత ఆవేశముతో వ్యక్తి కర్మ లాచరిస్తుంటాడు. అవి నూతన ఫలితాల నిస్తుంటాయి. తద్వారా నూతన వాసనలు తయారవుతుంటాయి. ఆంతర్యంలో నిలిచియున్న ఈ వాసనలనే వేదాంత పరిభాషలో “ పాపములు ” అంటారు.

వ్యక్తి పాపజీవనమును గడుపుటకు అతనిలో తిష్టవేసియున్న పాపాలే కారణము. పాపాంకురమే పాపజీవన వృక్షానికి పునాది. వాసనలనే నల్లత్రాచును మనలో నుంచుకొని విషయాను చింతనమును పాలుపోసి పెంచుతున్నాము. అది ఏదో ఒకనాడు తీవ్రంగా కాటువేయక మానదు. మన జీవితం అంతరించక పోదు. పాపములను ప్రక్షాళనం చేయమంటున్నారు ఆచార్యులవారు. అందుకనే పూర్వము బ్రహ్మచారులు సమిధలను చేతపట్టుకొని గురుసాన్నిధ్యమునకు వెళ్ళేవారు. “ ఓ గురుదేవా! నా పాపపు మూటలన్నీ నీ యనుగ్రహముచే జ్ఞానాగ్నిలో పడి దగ్ధం గానిమ్ము ! ” అనుటయే సమిధలు తీసుకెళ్ళుటలోని భావము. మనసులో చోటుచేసికొని యున్న పాపాలు లేదా వాసనలు ఎలా పోతాయి? అవి పోవు. చెలరేగుతూనే వుంటాయి. వాటి క్రియాశీలత్వాన్ని అరికడితేచాలు. వాసనలు విజృంభించగానే వాటిని ఆచరణవైపు మలుపు త్రిప్పితే కర్మాచరణ జరిగి, తద్వారా లభించిన ఫలితాలు నూతన వాసనల నందిస్తాయి. అలా గాకుండా ఆచరణను ఆపినచో ఆ వాసన నిర్వీర్యమై అంతరించిపోతుంది. ఇలా వాసనలను అంతం చేయాలి.

మనోఫలకంపై ఉద్భృతంగా వాసనలు చెలరేగునపుడు వాటిని ఆచరణలో పెట్టకుండా అరికట్టడము మనకు సాధ్యపడుతుందా? ఇలా వాసనలను అడ్డగించి అరికట్టి, అంతమొందించవలయునని దానికి ఒక్కటే మార్గము. మనలో నడిచే వాసనలు విషయ ప్రపంచమునకు సంబంధించినవి. వాటినే అసద్వాసనలు అంటారు. అనగా అసత్తుకు సంబంధించినవని భావము. వాటిని రూపుమాపాలంటే సద్వాసనా ప్రభావం ఏర్పడాలి. అనగా సత్పదార్థమునకు సంబంధించిన ఆలోచనలు నడుస్తుండాలి. విషయ చింతన కదిలినప్పుడల్లా విశ్వనాథుని స్మరణ జరగడం ప్రారంభంకావాలి. అప్పుడు అసద్వాసనలు అంతరిస్తాయి.

మరి ఇక ప్రస్తుతం ఆచరించే కర్మలసంగతి. వర్తమానానికి సంబంధించిన విషయం. గతంలో మనం ఎన్నో కర్మల నాచరించియున్నాము. వాటి ఫలితాలు కూడా ప్రస్తుతము కల్గుతూనే ఉంటాయి. వాటి విషయంలో ఎలా ప్రవర్తించాలి? కర్మఫలితాలను ఈశ్వర ప్రసాదంగా స్వీకరించి అనుభవించడమే దానికి మార్గం. ప్రసాద మనస్తత్వము చేత మనసులో ప్రశాంతత కల్గుతుంది.

ఇలా మనస్సులోని వాసనలను క్షాళనం చేయడమే పాపప్రక్షాళనం జరపడమని గ్రహించాలి.

6. సంసార దోష దర్శనం (Reflect over the evil of Samsara) :-

సంసారము నందలి సుఖము శోకతప్తమైనదని గ్రహించమంటున్నారు పూజ్యపాదులు. విషయ సంగత్వముగల వారికి సంసారిక జీవనము సారవంతమైనదిగా గోచరిస్తుంది. విచక్షణారహిత జీవనమే ఈ అయోమయ అవగాహనకు కారణము. ప్రాపంచిక భోగములందలి సుఖము శోకతప్తమైనదని ఋషులు గుర్తించి ఉపనిషత్తులలో తెలియజేసి యున్నారు. వారు విషయభోగానుభవము ననుభవించుటకు అశక్తులై నిరాశావాదంతో ఈ సిద్ధాంతము చేయలేదు. వారు గృహస్థులుగానే యుండి, ఈ ప్రాపంచిక విషయ సుఖానుభవమునుపొంది, ఆ యనుభూతి దుఃఖమిశ్రితమని, అల్పసుఖము, బహు క్లేశముతో కూడుకొని యున్నదనియు సెలవిచ్చారు.

సంసారిక విషయ సుఖాలు క్షణ భంగురములు. కాలంలో కదిలి కాలంలో అంతరిస్తాయి. కనుక అశాశ్వతమైనవి. అనిత్యసుఖాలు శాశ్వతానందాన్నెలా ప్రసాదించగలవు? నీటిబుడగ అస్తిత్వంగల సుఖాలతో మన మెంతవరకు తృప్తి చెందగలము? పైగా మోసపూరితమై యుంటాయి. వంచన అండజూసుకొని భ్రాంతిపంచిన తలదాచుకొని వుంటాయి. ఊహాపూరితమై యుంటాయి. అందుచేత స్థిరప్రమాణముగా భాసించవు. మంచి ఏదో నిర్ణయించుటకు వీలుకాని రీతుల్లో అయోమయంగా ఉంటాయి. అన్ని సమయాల్లో అందరికి ఆనందాన్నందించే స్థితిలో ఉండవు. నిజానిజాలు వ్యక్తిగత అభిప్రాయంపై

ఆధారపడియుండుట వలన మనమిచ్చే అసత్యపు విలువలే వాటికి లేని అందాన్ని అందిస్తున్నాయి.

" పురుషాభి ప్రాయతంత్రే అర్ధానర్ధా "

మంచి చెడులు పురుషాభిప్రాయంపై ఆధారపడి యుంటాయని శంకరాచార్యుల వారు తెలియజేసియున్నారు.

కనుక విషయసుఖాలు దుఃఖ మిశ్రితాలు. గోరంత సుఖములో కొండంత దుఃఖము నిండి యుంటుంది. విషయానుభవము ఆనందము నివ్వదు. పైపెచ్చు అశాంతి నందిస్తుంది. తామర గోకుతున్నంతవరకు ఆనందముగానే యుంటుంది. ఎంతసేపు గోకగలడు? గోళ్ళుకూడా అలసిపోతాయి. వ్రేళ్ళు కదలనంటాయి. గోకడం ఆపితేచాలు. ఘోరనరకం ప్రారంభమవుతుంది. సంసారిక సుఖాలు అంతే. అనుభవించినంతవరకు ఆనందంగానే యుంటుంది. అనుభవించడము కాగానే అశాంతి అలుముకుంటుంది. ఈవిషయ సుఖానుభవమే జన్మకు కూడా కారణమగుచున్నది.

విషయసుఖాలయందు నిజంగా ఆనందమున్నచో అవి అనుభవించగానే తద్వారా కలిగే ఆనందం శాశ్వతంగా మనస్సులో నిలిచిపోవాలి. గత అర్వై సంవత్సరాలుగా అనుభవించినను తృప్తి తీరలేదంటే ఆ వాతాపి జీర్ణం ఎలాంటిదో మనం ఊహించుకోవచ్చు. ఇదొక మహామారి రోగము. చికిత్సలేని వ్యాధి.

విషయానురక్తిగల వ్యక్తికి వస్తుసేకరణయందు పరిశ్రమ. వాటిని రక్షించడములో శ్రమ, అనుభవించడములో భ్రమ, ఆ తరువాత కనుపించేది లార్డ్ యమ.

పరిణామ శీలమైన ప్రపంచ మనుగడలో వ్యక్తులతోగానీ లేదా వస్తువులతో గాని నీవు ఏర్పరచుకొనే సంబంధమువలన నీకు ఆనందము కలుగదు. ఆనందము ఆత్మకు సంబంధించినది. సంసారిక విషయాలు దుఃఖమిశ్రితములు. కనుక ఆత్మానందమునకు ప్రయత్నించాలి. విషయసుఖాలయందు సంగత్వము లేక తటస్థ చింతన విధానంద్వారా సంతృప్తికర జీవనం గడపాలి.

పూలు ఉదయాన విరబూస్తాయి. సాయంత్రము వాడిపోతాయి. విరబూయగానే స్తుతించ నవసరములేదు. వాడిపోగానే నిందించపనిలేదు. ప్రాపంచిక విషయాలయందు జరుగుచున్న దానిని సంగత్వములేక వీక్షించడము లోనే శాంతియున్నది. అందుచేతనేనేమో భగవాన్ రమణ మహర్షి " జరిగేది చూస్తూవుండు " మని తరచుగా సెలవిచ్చేవారు. చూడదలచుకున్నది జరగాలని భావించడంకన్నా జరిగేది చూడటంలోనే ఆనందము నిండియున్నది.

7. ఆత్మ విచారణ (Do Atmic Enquiry) :-

ఆత్మానందము పొందుటకు విచారణ యొక్కటే మార్గమని శ్రీ శంకరులు తెలియజేస్తున్నారు. విచారణ ద్వారా అజ్ఞానము పలాయంచశై జ్ఞానము భాసిస్తుంది. మోక్షమునకు జ్ఞానమొక్కటే సూటియైన మార్గము.

" జ్ఞానాత్ మోక్షాఇతి చ సర్వోపనిషదాం సిద్ధాన్తః "

"జ్ఞానము ద్వారానే మోక్షము లభిస్తుందని సర్వోపనిషత్తుల యందు చేయబడిన సిద్ధాంత నిర్ణయ" మని శ్రీ శంకరులు ఛాందోగ్యోపనిషద్భాష్యంలో తెలియజేశారు.

జ్ఞానము విచారణ ద్వారానే కలగాలి. " నేతి నేతి " యనెడి ఉపనిషత్ప్రతిపాదిత నిషేధమార్గము నవలంబించినను విచారణ కొన సాగించవచ్చును. " జనన మరణాదులు గల శరీరమును నేను కాను, జ్ఞాన రహితమైన ఇంద్రియాలు నేనుగాను, చంచలమైన మనస్సు నేనుగాను, పరిణామ శీలమైన బుద్ధిని నేను గాను. " అని నిషేధిస్తూ అన్వేషణ కొనసాగించినచో ఇలా నిషేధించు వాడెవరో అవగత మవుతుంది. నిషేధించు వానిని నిరాకరించి నిర్మూలించే అవకాశంలేదు గనుక నిర్వికల్పమని నిర్ణయించడం జరుగుతుంది. అదియే ఆత్మ. కేవల చిన్మాత్ర చైతన్యము.

ప్రతి ఒక్కరిలో పరిశీలిస్తే అయిదు విషయాలు ప్రస్ఫుటంగా తెలుస్తాయి. అవియే నామ, రూప, అస్తి, భాతి, ప్రియాలు. నామరూపములనెడి మొదటి

రెండును అనిత్యములు. మాయకు సంబంధించినవి. ఇవి దృశ్యములై యున్నవి. అస్తి, భాతి, ప్రియములనెడి చివరి మూడు ఆత్మకు సంబంధించినవి. ఇవి శాశ్వతానందమునకు సంబంధించినవి. దృక్చైతన్యమై యున్నది.

" దృక్ బ్రహ్మ, " దృశ్యం " మాయ

అని శంకరులు వేదాంత డిండిమములో తెలియచేసియున్నారు. కనుక మాయయైన నామరూపాదులను త్యజించి అస్తి, భాతి, ప్రియములనెడి సచ్చిదానంద స్వరూపమును అనుభవమునకు తెచ్చుకొని తరించాలి.

నామరూపాదులు మారుతుంటాయి. అస్తి,భాతి, ప్రియములు స్థిరంగా వుంటాయి. నామరూపాలు వ్యతిరేకస్థితిలో నుండ అస్తి,భాతి, ప్రియాలు అన్వయస్థితిలో నున్నవి. వ్యతిరేక పరిధిలోని నామరూపాదులను విసర్జించి అన్వయస్థితిలోని అస్తి,భాతి, ప్రియాలతో సంయోగం చెంది యుండాలి. దీనినే " అన్వయ వ్యతిరేక " మార్గమంటారు. జ్ఞానమార్గమునందు ఇది కూడా సూటియైన దారియేనని గ్రహించాలి.

నిషేధమార్గము ద్వారాగాని, లేదా అన్వయ వ్యతిరేక యుక్తిద్వారా గాని, లేదా ప్రణవధ్యానం వలన గాని శ్రద్ధతో విచారణ కొనసాగించి ఆత్మా నందమును పొందవలయునని శ్రీ శంకరులు సప్తమ సోపానమునందు తెలియజేయుచున్నారు.

8. గృహవిముక్తి (Free yourself from the trammels of birth and death) :-

గృహఛిద్రాలనుండి విముక్తుడివి కమ్మని ఆచార్యుల వారు అష్టమ సోపానంలో తెలియచేస్తున్నారు. పక్షికి గూడు అవసరం. మనిషికి గృహం అవసరం. గూడు ఒకనాటికి చెదిరిపోతుంది. గృహం ఒకనాటికి కదిలిపోతుంది. మనము గృహములో ఉంటామేగాని, గృహం మనతో ఉండలేదు. అందుచేతనే ఆధ్యాత్మిక సాధకుని లక్షణాలు భగవద్గీత భక్తియోగంలో తెలియజేస్తూ "అనికేతః" అనికూడా కృష్ణ పరమాత్మ తెలియచేశారు. " అనికేతః ", అనగా ఇల్లు లేనివాడని భావము. అంటే ఇల్లు ఉండకూడదని కాదు. మరి గృహమనేది శాశ్వతము

కాదని అర్థము. అలాంటప్పుడు గృహము సర్వాంగ సుందరముగా చిత్రించుకొని, మనమందులో నివసించుటకు బదులు ఆ గృహాన్నే మనలో ఉంచుకొని, మోయలేని భారాన్ని మోస్తూ, జీవించడమనేదొక అయోమయస్థితి.

మరి ఈ గృహమెందుకు ? సంసార జీవన యాత్రార్థం.మరి ఆ సంసారమెంత శాశ్వతం? దానిపై ఏర్పరచుకొన్న మమకారానికి అంతిమగతి ఏమిటి? ఆలోచిస్తే సంసారము కూడా అనిత్యమే. భ్రాంతియే. గృహమెలా అనిత్యమో ఈ గృహనిర్మాణము చేయించిన సంసారము కూడా అనిత్యమే।

మరి ఈ సంసారమెలా ఆవిర్భవించింది ? దేహాభిమాన పాశబద్ధులైయున్నందున దేహముతో తాదాత్మ్యం చెంది సంసారమును, సంసారముతో పెనవేసుకొని గృహమును తయారుచేసుకుంటున్నాము. దేహము వసించుటకు గృహమెలా నివాసస్థానమై యున్నదో, అలాగే నేను వసించుటకు దేహము కూడా నివాసస్థానమై యున్నది. గృహమెలా అశాశ్వతమో ఈ దేహము కూడా అంతే. గృహమూ, దేహమూ రెండూ మృత్తికా నిర్మితములే.

దేహభ్రాంతి ద్వారానే సకల అనర్థములు సంప్రాప్తించు చున్నవి. అందుచేతనే గృహ శృంఖలాలనుండి విముక్తుడివి కమ్మని శ్రీ ఆచార్యులవారు ఈ ప్రథమ శ్లోకంలో చివరి సోపానంగా తెలియచేస్తున్నారు. గృహ శృంఖలాలంటే దేహ భ్రాంతులని భావము. మోహజీవనమని అర్థము.

జిహ్వేంద్రియ, గుహ్యేంద్రియాలకు బానిసయై మానవుడు దేహమనే గృహాన్ని కుక్కలా కాపలా కాస్తున్నాడని మానవుని ప్రవర్తనను భాగవతం నిశితంగా విమర్శించి ఖండించింది. కనుక దేహియైన తాను దేహముకన్నా అన్యమైన వాడని గ్రహించి, దేహధ్యాస నుండి విడిపడి ఆత్మైక్యం చెంది తరించాలి.

సంగం సత్సు విధీయతాం
భగవతో భక్తిర్దృఢా ధీయతాం
శాంత్యాదిః పరిచీయతాం
దృఢతరం కర్మాశు సంత్యజ్యతాం
సద్విద్వానుప సృప్యతాం
ప్రతిదినం తత్పాదు కాసేవ్యతాం
బ్రహ్మైకాక్షర మర్థ్యతాం
శృతి శిరోవాక్యం సమాకర్ణ్యతాం ॥ 2

తాత్పర్యముః–

9. సత్పురుషులతో సహవాసం చేయాలి.

10. నిశ్చలమైన భగవద్భక్తిని పెంపొందించుకోవాలి.

11. శాంత్యాది సద్గుణములను కలిగియుండాలి.

12. కామ్యకర్మల్ని వెంటనే త్యజించాలి.

13. సద్గురువు నాశ్రయించాలి.

14. గురుపాదుకలను నిత్యం సేవించాలి.

15. ఏకాక్షర స్వరూపమైన బ్రహ్మజ్ఞానమునకై ప్రార్థించాలి.

16. వేదాంత వాక్యాలను శ్రవణం చేయాలి.

వ్యాఖ్య

9. సజ్జన సాంగత్యము **(Seek the company of the wise) :-**

ఆధ్యాత్మిక సాధకుడు సత్పురుషులతో సహవాసం చేయాలి. "సత్" పదార్థము నెరింగిన వారు సత్పురుషులు. వారి సాన్నిధ్యంలో అజ్ఞానము పటాపంచలవుతుంది. మోక్షధామమును చేరుటకు సాధుపురుషులు ముఖద్వారములై యున్నారు.

ప్రాపంచిక విషయ చింతనా ప్రభావంతో చెదరగొట్టబడిన మానవ సమాజంలో నిరంతరము భగవంతుని హృదయమున ప్రతిష్ఠించుకొని చరించు సత్పురుషులు అరుదుగా కనుపిస్తారు. కనుకనే సత్పురుషుల సాంగత్యము దుర్లభమని శాస్త్రము తెలియచేసింది.

ఒకవేళ సత్పురుషుల సాంగత్యము లభించినను వారి స్థితిని అర్థము చేసుకొనుట బహుకష్టము. అగమ్యము. త్రిగుణాతీతులై నిర్వికల్పానందములో ఓలలాడు మహాత్ముల దివ్యస్థితిని అందుకొని, అనుభవించి ఆనందించు స్థితి సామాన్య మానవులకు ఉండదు. "నేను మహాత్ముని గుర్తించ గలిగానని ఎవరైనా పలికినచో వెంటనే నేను చెవులు మూసుకొనెడివాడను" అని తులసీదాసు మహాశయుడు తెలియచేశాడు. పూర్వ పుణ్య విశేషము చేతనే సద్గురు సహచర్యం లభిస్తుందని శిక్కుమత గ్రంథమైన జండ్ అవస్థ తెలియచేసింది.

సంస్కారము సరిపడి మహాత్ముని సహచర్యం లభించినచో మనజన్మ సార్థకమైనదని భావము. సత్సంగ ప్రభావము వర్ణించుటకు వీలులేనిది. మానవుని ఉత్తేజ పరుస్తుంది. ప్రభావితం చేస్తుంది. సంతోష పరుస్తుంది. మనోబుద్ధులను శాంతింప చేస్తుంది.

సత్పురుషుల సాంగత్యము వలన మనసులో సద్భావబీజాలు అంకురిస్తాయి. వివేకవృక్షము వృద్ధిచెందుతుంది. విజ్ఞానపూత పెడుతుంది. వైరాగ్యకాయలు పక్వమై మోక్ష ఫలాన్నందిస్తాయి.

సత్పురుషులను ఆశ్రయించినంత మాత్రాన జ్ఞానముదయించదు. అంధునికి సూర్య దర్శన మవుతుందా? మహాత్ముల సన్నిధిలో తరించాలంటే నీలో శ్రద్ధ, భక్తి , వైరాగ్యము లుండాలి. ఒక సాధుపురుషుని ఉపన్యాసము వినాలని ఒక భక్తుడు రిక్షాలో వస్తాడు. ఉపన్యాసము పూర్తగునంతవరకు రిక్షా వానిని ఉండమని చెబుతాడు. ఉపన్యాసము జరుగుతూ వుంటుంది. భక్తుడూ వింటాడు. రిక్షావాడూ వింటాడు. రిక్షావానికి అర్థమవుతుందా ? కాదు. కారణమేమిటి ? రిక్షావాని దృష్టంతా కిరాయిమీదనే యుంటుంది. ప్రబోధకుడు

అందించే నిప్పు కణాల్లాంటి ఆధ్యాత్మిక సత్యాలు రిక్షావాని కాగితములాంటి మనసులో నిలువలేక జారిపోతాయి. ఆధ్యాత్మికంగా అనువైన అంతఃకరణ లేకపోవటమే దానికి కారణము.

నీకు నేత్రాలుంటే ప్రకృతిశోభ గోచరిస్తుంది. నీలో సాధన చతుష్టయ సంపత్తి ఉంటేనే మహాత్ముల వైభవం గోచరమవుతుంది. అట్టి సంస్కారములేని వ్యక్తులు గురువుల నాశ్రయించి వారికి కూడా సమస్యగా తయారవుతారు.

మహాత్ముల వద్ద జీవించాలని అభిలషిస్తే చాలదు. వారిచెంత జీవించేందుకు అనుగుణ్యమైన మనసును ఏర్పరచుకొని వెళ్ళాలి. సాధువులు చమత్కరించి మాట్లాడవచ్చు. నీవలా మాట్లాడకూడదు. మహాత్ములు హాస్యమును చిందించవచ్చు. వారి పవిత్ర సన్నిధానంలో నీవు హాస్యపాత్ర నభినయించ కూడదు. మహాత్ములు ప్రదర్శించే హాస్యము విజ్ఞానంద విలాసము. నీవు అనుకరించి ప్రకటించే హాస్యము అజ్ఞాన అపహాస్యము. దేనికొరకు సత్పురుషుల మధ్య కెళ్ళావో మరచిపోకు. పట్టుతప్పి ప్రవర్తించకు. క్షణిక భావోద్రేకంలో శాశ్వతానందమునకు దూరంగాకు. నీబాగుకొరకు సాధువులను సమీపించావు. అంతవరకేచూసుకో. మహాపురుషులని భావించి, వారిని సమీపించి, నీ అల్పజ్ఞానంతో ఆధిపత్యాన్ని చెలాయించాలని చూడకు. అహంకారాన్ని అంతమొందించుకో. మహాత్ములు చెప్పిన విషయము నీకు కష్టమైనా ఆచరించుటకు ప్రయత్నించు. అంతేగాని అనవసర తర్కంతో అధిక ప్రసంగం చేయకు. సత్సంగము లభించినను దానిని పాడుచేసుకొనువాడు దురదృష్టవంతుడు.

ఒకవేళ సత్పురుషుల సాంగత్యము లభించనిచో సద్గ్రంథ పఠనమే సత్సంగమని భావించాలి. సద్గ్రంథములను చదివి, అర్థం చేసుకొనుట వలన కూడా ఆంతర్యంలో ఆధ్యాత్మిక పరిణామం రాగలదు. సత్సంగము వలన సద్భక్తిని పెంపొందించుకోవాలి. ఈ విషయమునే రాబోవు దశమ సోపానములో ఆచార్యుల వారు తెలియచేస్తున్నారు.

10. నిశ్చలభక్తి (Develop unflinching devotion to the Lord) :-

నిశ్చలమైన భగవద్భక్తిని పెంపొందించుకోవాలి. "ముక్తిసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసి" మోక్ష సామ్రాజ్యమును చేరుటకు భక్తియే శ్రేష్ఠమైనదని ప్రతీతి.

"మద్భక్తా యాంతి మామపి"

"నా భక్తులు నన్నే పొందుదురు" అని భగవద్గీత–విజ్ఞాన యోగములో శ్రీ కృష్ణ పరమాత్మ తెలియచేశారు.

"యేభజంతి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహం"

"ఎవరు భక్తితో నన్ను ఉపాసింతురో వారు నాయందుందురు. నేను వారియందుందును" అని భగవద్గీత – రాజవిద్యా రాజగుహ్య యోగమునందు తెలియచేయబడింది.

భక్తియొక దివ్యపారవశ్యస్థితి.అవగాహనతో నిండిన ఆనందానుభూతి. అన్యరాగ విస్మారణముచే ప్రాప్తించిన ఆత్మ సుఖానుభూతి. భక్తి ప్రేమమయము. అందుచేతనే

"సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా"

"భగవంతుని యందలి ఆ భక్తి పరమ ప్రేమరూపమై యున్నది" అని నారద భక్తి సూత్రాలలో తెలియచేయబడింది.

భగవంతుడు ప్రేమమయుడు. భగవంతుని కొరకు చేయు భక్తి ప్రేమ స్వరూపము. అట్టి భక్తి చేయు భక్తుడును ప్రేమమూర్తియే గనుక

"తస్మిం స్తజ్జనే భేదా భావాత్"

"భగవంతునికి , భక్తునికి భేదములేదని" నారద భక్తి సూత్రములలో 41వ సూత్రము అభేద జ్ఞానమును బోధించుచున్నది.

భక్తిని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. భక్తియనేది యాచన కాదు. యాతన అంతకంటేకాదు బిచ్చగానివలె, దేవాలయాల్లో నిలబడి

ప్రాధేయపడటంకాదు. పిల్లవానివలె వస్తువులు కొనిపెట్టమని మొండి కేయడముకాదు. భగవదనుగ్రహమును మాటను ఏకరువు పెడుతూ కర్తవ్య విముఖులై కూర్చోవడము అంతకన్నాకాదు. భగవానుడు ఆకాశాన కూర్చుని అనుగ్రహ పొట్లాలు విసురుతుంటాడా ? ఎవరిమీద విసురుతాడు ? తన కిష్టులపైననే. అయితే భగవానునికి కూడా రాగద్వేషాలు అంటగట్టావన్నమాట. పక్షపాత స్థితిలో భగవంతుని కూడా దింపావన్నమాట. అలాగాక మనము చేయు భక్తియే భగవదనుగ్రహమునకు కారణమని భావిస్తామా? సరిపోతుంది. అయితే ముందుగా భక్తిచేయి. " సర్వులకు అగ్నిసమమే అయినను ఎవరు ఎక్కువ సమీపమునకు చేరగలరో వారి చలినే అగ్ని పోగొట్టును" అనిన శంకరుల దివ్యభావాన్ని అర్థం చేసుకోండి.

అందుచేతనే భక్తి మార్గములో పయనించి పరాకాష్ట నందుకున్న నారదమహర్షి కూడాను అనేక మార్గాలు తెలియచేసినప్పటికి, భక్తి సూత్రాలలో అభేద జ్ఞానాన్నే గమ్యంగా సూచించారు.

"ఆత్మరత్య విరోధేనేతి శాండిల్యః"

"ఆత్మక్రీడకు విరోధములేని భగవత్కార్యములచేత పొందవలయునని శాండిల్య మహర్షి అభిప్రాయము" అని నారద భక్తి సూత్రములలో తెలియజేయబడింది.

కనుక మానవుని అయోమయ అంతఃకరణ భక్తి తత్త్వాన్ని గ్రహించలేదని తలంచి భక్తిపేరిట చెలామణి అయ్యే ఉన్మాద్యవస్థలను తొలగించు నుద్దేశ్యములో అపర శివావతారమూర్తియైన ఆది శంకరులు తన వివేకచూడామణిలో విప్లవాత్మక నిర్వచనం చేశారు.

మోక్ష కారణ సామగ్రయాం భక్తి రేవగరీయసీ
స్వస్వరూపాను సంధానం భక్తి రిత్యభిధీయతే

"మోక్ష ధామము చేరుటకు ఉపకరించు సాధనములలో భక్తియే శ్రేష్ఠమైనదనియు, స్వస్వరూపాను సంధానము చేయుటయే భక్తి యనియు" తెలియజేశారు.

కనుక "పరానురక్తి యే భక్తియని" నారద మహర్షి ప్రవచనము. సాధన చతుష్టయ సంపత్తిద్వారా అంతఃకరణ శుద్ధిగల్గి, నిరంతర తపోధ్యానాదులద్వారా త్యాగనిరతుడై ఆత్మ జ్ఞానమును పొంది తరించడమే భక్తి. పిరికితనంతో ప్రపంచానికి దూరం కావడము కాదు. ప్రాపంచిక విషయాలు సుఖప్రదములని భావించి వాటి వెంట పరుగెత్తడముకాదు. మానసిక ప్రశాంతతతో నిరంతరము ఆత్మవైపు చూస్తుండటమే భక్తి. పరిణామముతో కదులుచున్న సమస్తమును సాక్షియై వీక్షించడమే భక్తి. దుఃఖచ్ఛాయలు జీవితము నంటకుండా ప్రశాంత మనుగడను భక్తుడు సాగిస్తుండాలి. ఇదియే అనన్యభక్తి. దానికి వ్యతిరిక్తమైన ప్రాపంచిక విషయ లంపటత్వము నందు భక్తుడు ఉదాసీనంగా వ్యవహరించాలి. అన్యవిషయములను నిరోధిస్తూ అనన్య భక్తి నలవరుచుకోవాలి.

నూతన దంపతులు ఎవరి సాన్నిధ్యాన్ని కూడా భరించలేరు. ఎవరితో మాట్లాడలన్నా విసుగే. తమ ఏకాంతానికి క్షణకాలము భంగము వాటిల్లినా భరించలేరు. భక్తుడు కూడా అంతే. తనకు భగవానుని మధ్య ఎలాంటి అడ్డంకులొచ్చినను సహించలేడు. తన శరీరాలయము నందు హృదయ గర్భగుడిలో భగవానుని ప్రతిష్ఠించుకొని, నిరంతర భగవదారాధనలో బ్రతుకును ధన్యత చేసుకుంటాడు. తల్లి బిడ్డకు "ఇతడే నీ తండ్రి" యని తండ్రిని తెలిపినట్లు "భగవంతు డీతడేనని – నీవే అతడివని" భక్తి తెలియజేయును.

తాను భక్తుడు కాగానే అతనిలో సుగుణ సంపద నిండియుంటుంది. సద్గుణ సంపన్నుడై సదాచార జీవంతో భక్తుడు విలసిల్లుతుంటాడు. ఈ విషయమును రాబోవు సోపానంలో పూజ్యపాదులు వివరిస్తున్నారు.

11.శాంతి జీవనము **(Cultivate virtues such as serentiy, tranquility etc) :-**

శాంత్యాది సద్గుణములన్ను కలిగియుండాలి. శాంతి యనినది దైవసంపద. శాంతము గలవాడే సుఖించును. శాంతి యనునది ఆత్మలక్షణము. కామక్రోధాది అరిషడ్వర్గములకు లోనై చరించు వ్యక్తుల హృదయము లందు శాంతి మాయమగును. ఆత్మస్థితుడగు వాడే శాంతి ననుభవించ గలడు.

మనసును అంతర్ముఖం చేసినచో ఆత్మానందము కలుగును. తద్వారా శాంతి లభిస్తుంది. శాంత్యాది సద్గుణములు మోక్షానికి మార్గాములై యున్నవి.

భూమిని దున్ని, ఎరువు వేసి, కలుపుతీసి, నీరుపోసి, మొక్కలను పెంచి తద్వారా వచ్చు పుష్పములను అనుభవించులాగున, మన మనో క్షేత్రంలో శాస్త్రాధ్యయన మనెడి దున్నడము ప్రారంభించి, సత్సంగమను ఎరువువేసి, అరిషడ్వర్గములనెడి కలుపుమొక్కలను తొలగించి, భక్తియనే నీరుపోసి, జీవన వృక్షమును పెంచి, తద్వారా లభించు శాంతి పుష్పమును అనుభవించి సుఖించాలి.

శాంతి యనునదొక అద్భుతమైన శక్తి. శాంతిగలవానికి సహన శక్తి మెండుగా నుండును. భగవంతునికి నీవెంత శరణాగతుడవై జీవిస్తావో, అంతగా శాంతికి సన్నిహితుడవై జీవిస్తావు. ఇంద్రియాల హెూరుతగ్గి, మనోచంచలత్వము క్షీణించగానే నీవు శాంతి గుహలో ప్రవేశించగలవు. అదే హృదయ మందిరము. ఆనందదేవుని సుందర మందిరము. నేత్రాలు మూసి మనస్సును హృదయ మందిరము వైపు నడిపించు శ్రావ్యమైన దివ్యవాణిని ఆలకించగలవు.

కనుక నిజమైన శాంతి నీయందే యున్నది. కాదు. నీలో ఉండుటయేమిటి? నీవే శాంతి. శాంతికై అరణ్యాల నన్వేషించ నవసరంలేదు. ఆశ్రమాలు తిరుగపనిలేదు. నీ హృదయంలో ప్రవేశించి శాంతి సార్వభౌముని కలుసుకో. తరువాత ఆ సింహాసనముపై అధిష్టించియున్నది నీవేనని తెలుసుకుంటావు.

శాంతిని పొందుతావా! అయితే ఒక్కటే మార్గం. కోరికలను శాంతింపచేయి. ఉద్రేకాల్ని శాంతింపచేయి. అంతే నిస్తరంగ జలధివలె నిలిచియున్న శాంతి సాగరంలో మునకవేసి ప్రశాంతిగా మారిపో. అశాంతి హస్తాలనుండి జారిపో. మానవత్వమును అధిగమించి దైవత్వముతో వెలిగిపో. ఆప్తకాముడుగా నిలిచిపో.

12. కర్మత్యాగము (Give up selfish actions entirely) :-

కామ్యకర్మల్ని వెంటనే త్యజించాలి. కోరికచేత కర్మ లాచరిస్తాము. కామము అనగా కోరిక. "కామీ" అనగా కోరువాడు. కోరిక కలుగుటకు కారణమేమి? అజ్ఞానము. ఏమిటా అజ్ఞానము ? తాను ఆత్మనని తెలియక పోవుటయే. ఎప్పుడయితే తన స్వరూపజ్ఞానమును కోల్పోయాడో, దాని స్థానే మిథ్యా జ్ఞానము ఏర్పడి తాను శరీరమనే భ్రాంతి కల్పిస్తుంది. అక్కడనుండి శరీరావసరాలన్నీ తన అవసరాలుగా భావించి శరీరమును, ఇంద్రియాలను, మనసును తృప్తి పరచుటకు కర్మలాచరిస్తుంటాడు. కర్మలాచరించుట వలన ఫలితాలు కల్గుతాయి. అవి వాసనల్ని తయారుచేస్తాయి. వాసనలు మనిషిని ప్రేరేపించి కర్మలాచరింపచేస్తాయి ఇలా కర్మ సముద్రములో పడటం జరిగి, తత్కారణంగా జన్మలు సంప్రాప్తమై జీవునికి అనంత దుఃఖాన్ని కల్గిస్తాయి.

కనుక కర్మలాచరించాలి. అయితే అవి కామ్య కర్మలుగాకుండా చూసుకోవాలి. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణ కొనసాగించాలి. అప్పుడు కామ్య కర్మలు దూరమవుతాయి. ఆనందము కొరకు కర్మలాచరిస్తున్నాము. కర్మచేత ఆనందము లభించదు. ఎందుకనగా కర్మాచరణ చేసేవాని స్వరూపమే ఆనందమై యున్నది. కనుక తన స్వరూపము ఆనందమని తెలుసుకొన్న వానికి కర్మల యందు ఆసక్తి జనించదు. భగవదర్పితముగా కర్మలాచరిస్తాడు. అతని కర్మలు కామ్యమునకు సంబంధించి యుండవు. కనుక కర్మ లతనిని బంధించవు.

కర్మ జడము. మన మనసులో కదిలే భావాన్ని బట్టే కర్మకు రూపురేఖలు దిద్దబడుతున్నాయి. మనో సంకల్పాన్ని కదిలించి, ఆడించే ఒకానొక శక్తి మాయ . మాయా ప్రభావంతో మనసు చిత్ర విచిత్ర పంథాలో నడుస్తుంది.

అందము స్త్రీలో లేదు. ఊహలోవుంది. తియ్యదనము చెరుకులో లేదు. కల్పనలో వుంది. దుఃఖము జీవిలో లేదు. అవగాహనలోవుంది. బలహీనత మనిషిలో లేదు, మతిలోవుంది.

దేవుడనగానే భక్తి కలుగుతుంది. దయ్యమనగానే భయం కలుగుతుంది. ఇదంతా మనసునుండే జరుగుచున్నది. యదార్థానికి నీకు దేవుడూ తెలియదు. దయ్యమూ తెలియదు. దేవుడర్థమయితే దయ్యానికి భయపడవు. అంతా వుండే వాడు దేవుడు. దయ్యమేమిటో ఇప్పుడాలోచించు. వాసనాపూరిత అంతఃకరణ అంతవరకు ఆలోచించదు. ఇదంతా మనోకల్పనయే.

యజమానిని గౌరవిస్తావు. సేవకుడ్ని చులకనగా చూస్తావు. యజమాని విషయంలో నీ మనస్సు కొన్ని భయపూరిత నిర్ణయాలు చేసుకొని యున్నది. సేవకుని విషయంలో చౌకబారు అభిప్రాయాలతో వుంది. సేవకునిలో వాసుదేవుని చూడగలిగితే యజమానిపైనున్న గౌరవము లాంటిదే సేవకునిపై కూడా ఏర్పడగలదని స్వామి శివానంద సరస్వతి ప్రబోధించారు. మనస్సునలా సంస్కరించుకోవాలి. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలాచరించగానే మనసులోని కామ్యములన్నీ దూరమవుతాయి. అంతఃకరణ ప్రశాంతతను పొందుతుంది. ఇలా కామ్య కర్మలను విసర్జించుటచేత శుద్ధిపడిన మనసుతో గురువు నాశ్రయించి, బోధను గ్రహించమని తరువాత సోపానములో తెలియజేయుచున్నారు, శ్రోత్రీయ బ్రహ్మనిష్ఠులైన శ్రీ శంకరులు.

13. సద్గురు సాన్నిధ్యము (Surrender thyself to the Guru) :-

సద్గురువు నాశ్రయించాలి. కర్మలయొక్క అసంపూర్ణతను, కర్మఫలాల యొక్క అనిత్యత్వాన్ని గ్రహించి, కామ్య కర్మలను త్యజించిన ముముక్షువు ఆత్మబోధను గ్రహించుటకు గురుసాన్నిధ్యం చేరాలి. కనుక గురువు నాశ్రయించు శిష్యుడు వైరాగ్యవంతుడై యుండాలి.

"కర్మగోచరాత్ సాధ్యసాధన లక్షణత్వాత్ అనిత్యత్వాత్
విరక్తస్యైవ ఆత్మజ్ఞానే అధికారః"

కార్యకారణ ఫలితాదుల ద్వారా సంప్రాప్తమయ్యే అనిత్య విషయములందు విరక్తి జనించిన వైరాగ్య పురుషులే ఆత్మజ్ఞానమునకు సంబంధించిన సాధన లాచరించుటకు అర్హులు.

సద్గురువు నెందుకు ఆశ్రయించాలి? ఆత్మ జ్ఞానం కొరకు. అన్ని విషయాలు తెలుస్తాయి. ఆత్మ విషయము ప్రత్యేకంగా తెలియడానికి వీలులేదు. అన్నిటిని తెలుసుకొనుటకు మూలకారణమైన ఆత్మను మరొక విధంగా గ్రహించుటకు వీలులేదు.

"ఉపలబ్ధుః అనుపలభ్యత్వాత్"

"తెలుసుకొను తాను తెలియబడు దృశ్యవస్తువు కాలేడని" తైత్తిరీయోపనిషద్భాష్యంలో శ్రీ శంకరులు తెలియజేశారు. కనుక ఆత్మయే తానై యున్నందున ప్రత్యేకించి గ్రహించలేడు. తనను తాను స్వయంగా తెలుసుకొనుటకు మార్గము లేదు. కనుక ఆత్మజ్ఞానమునకు తరుణోపాయ మేమిటి?

"యత్తు స్వతోఽప్రాప్తం తచ్ఛాస్త్రేణ బోధితవ్యం"

"స్వాభావికంగా, ప్రత్యక్షంగా గ్రహించలేని దానిని మరొకరు తెలియజేయుటచేతనే పొందవలయున"ని శంకర భగవత్పాదులు తైత్తిరీయోపనిషద్భాష్యంలో తెలియజేసియున్నారు. కనుక శబ్ద ప్రమాణముద్వారానే సత్యము ఎరుకపడాలి. ఇదియే ఆత్మబోధ. బోధద్వారా బాధను తొలగించువాడే ప్రబోధకుడు. అతడే సద్గురువు.

సద్గురువనగా పుస్తకాలపురుగని భావించరాదు. శ్రోత్రీయ బ్రహ్మనిష్ఠుడే సద్గురువు. శాస్త్రము తెలిసి అనుభవజ్ఞానము గలవాడే సద్గురువు. శిష్యుని అజ్ఞానమును తృటిలో మ్రింగుతాడు. సద్గురువు లభించినచో జీవితము ధన్యమైనదని భావించవచ్చు. జీవన సత్యాల్ని ఎరుకపరచి శిష్యుని మోక్షధామం చేర్చగల సమర్థుడు గురుదేవుడొక్కడే.

పాసా పకడా ప్రేమ్‌కా
సారీ కియా సరీర

సత గురూదావ బతాఇయా
ఖేలై దాస కబీర... ......

"నా శరీరాన్ని తాకట్టుపెట్టి ప్రేమపాచిక లాడాను. జీవనక్రీడలో గెలుపొందుటకు అనువగు నేర్పును నాకు బోధించి సద్గురువు నన్ను ఉద్ధరించాడు" అని కబీరుదాసు తెలియచేస్తారు.

శ్రోత్రీయబ్రహ్మ నిష్ఠుడైన సద్గురువును కేవలం ఆశ్రయించినంతమాత్రాన ఆత్మ జ్ఞానము లభించదు. సద్గురువు నాశ్రయించిన తరువాత ఆచరించవలసిన సాధనను రాబోవు సోపానములో ఆచార్యులు తెలియజేయుచున్నారు.

14. గురుపాదుకా సేవనము (**Worship his sacred sandals everyday**) :-

సద్గురు పాదుకలను నిత్యము సేవించాలి. మనకు ఆత్మజ్ఞానం కావాలి.

"తద్విజ్ఞానార్థం గురుమేవాభి గచ్ఛేత్"

"జ్ఞాన సముపార్జనకు గురు సన్నిధికి చేరమని" ఉపనిషత్ పలికింది. తన నాశ్రయించిన శిష్యుని తనంతటి వానినిగా చేయుటలోనే గురువుయొక్క ఔదార్యం, విశాల హృదయం నిండియున్నవి. అజ్ఞానముతో గురువు నాశ్రయించిన శిష్యునియందలి మనో మాలిన్యమును తొలగించి, మల విక్షేప ఆవరణాదులను ధ్వంసమొనర్చి శిష్యుని చేయిపట్టి నడిపించి భగవంతుని స్థాయికి గొనిపోవు సద్గురువు మహిమ వర్ణనాతీతమైనది.

"దృష్టాంతోనైవ దృష్టః త్రిభువన జఠరే సద్గురోః జ్ఞానదాతుః"

"జ్ఞానప్రదాతయగు సద్గురువునకు సమానమైన వస్తువు త్రిలోకములందును లేదని" శంకరభగవత్పాదులు తెలియజేసియున్నారు.

అవిద్యా హృదయ గ్రంధి ర్బంధ మోక్షో భవేద్యతః
తమేవ గురురిత్యాహు ర్గురు శబ్దార్థ వేదినః

"ఏ పవిత్రాత్మునిచే అవిద్యా హృదయగ్రంథి ఛేదింపబడునో అతడే సద్గురువు" యని వేదము తెలియచేసినది.

మహానుభావుడైన అట్టి సద్గురువును ఆశ్రయించి, నమస్కరించి, అనుకూల సమయమందు ప్రశ్నించి, గురువును సేవించి , జ్ఞానమును పొంది తరించమని భగవద్గీత జ్ఞానయోగములో శ్రీ కృష్ణ పరమాత్మ తెలియ జేసియున్నారు.

సాధనపంచక సౌధములోని పదునాల్గవ సోపానమునందు గురుపాదుకలను సేవించమని శంకరులు తెలియజేయుచున్నారు. ఆధ్యాత్మిక మార్గములో భావగర్భిత అవగాహన లేనివారు శాస్త్ర లోతుల్ని గ్రహించలేరు. గురుపాదుకా సేవనమంటే గురువుగారి పాదుకలను సేవించడమే జ్ఞానమని , గురుపాదములను పూజించడమే మోక్షమని భావించి, ఏ సాధనలాచరించక జీవితమును వృధా చేసుకొనే నివృత్తియోజకులు ఎందరో కలరు. గురు ప్రతిభను మంటగలుపుటలో వీరే అగ్రగణ్యులు.

గురుపాదుకలు గురువు నిలబడుటకు ఆధారముగా యుండునని భావము. ఇది బాహ్యార్థము. గురువు దేనిని ఆధారముగా చేసుకొని మనుగడను కొనసాగించుచున్నాడో అవియే గురుపాదుకలని గ్రహించుట అంతరార్థము. గురువు మనుగడకు సత్యమే ఆధారము. కనుక గురుపాదుకా సేవనమంటే సత్యమును అర్థం చేసుకొని ఆచరించుటయని భావము. గురువుద్వారా గ్రహించిన పరోక్ష జ్ఞానమును శ్రవణమనన నిదిధ్యాసల ద్వారా అపరోక్ష జ్ఞానముగా అనుభూతిని పొంది తరించడమే నిజమైన గురుసేవ. అదియే గురుపాదుకా సేవనము.

సద్గురువు నాశ్రయించి , వారి పవిత్ర పాదుకలను సేవిస్తూ శిష్యుడు ఆచరించవలసిన సాధనను తరువాత సోపానములో తెలియజేయుచున్నారు.

15. ప్రణవోపాసన (Meditate on the mono syllabel AUM, the supreme reality) :-

ఏకాక్షర స్వరూపమైన బ్రహ్మజ్ఞానమునకై ప్రార్థించాలియని తెలియచేయుచున్నారు శ్రీ శంకరులు. ఏకాక్షర స్వరూపమనగా ఓంకార స్వరూపమని భావము. అదియే ప్రణవము. ఓంకారోపాసనద్వారా బ్రహ్మస్థితిని పొంది తరించాలి. ఉపనిషత్తులలో అనేకచోట్ల ఈ ప్రణవోపాసనే ఉత్తమమార్గముగా సూచించడము జరిగినది.

ప్రణవో ధనుః శరో హ్యాత్మా
బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తే న వేద్ధవ్యం
శరవత్ తన్మయో భవేత్.

ప్రణవము ధనస్సు. ఆత్మయే బాణము. బ్రహ్మయే లక్ష్యస్థానము. సంయమనము చేసిన అంతఃకరణతో శరప్రయోగము చేసినచో శరమైన ఆత్మ లక్ష్యస్థానమైన బ్రహ్మముతో ఏకీభూత మగునని ముండకోపనిషత్ తెలియచేయుచున్నది.

లక్ష్యస్థానమును చేరగానే బ్రహ్మము ప్రణవము కన్నా అన్యముకాదని అర్థమవుతుంది.

"ఓమిత్యే కాక్షరం బ్రహ్మ"

ఓంకారమే బ్రహ్మమని వేదము కూడా తెలియజేయు చున్నది.

ప్రణవోపాసనద్వారా బ్రహ్మప్రాప్తిని పొందు విషయమునే ప్రశ్నోపనిషత్ యందలి ఐదవ ప్రశ్న నిర్ణయించు విషయమై యున్నది.

"హరిః ఓం....ఓమిత్యే దక్షరమిదం సర్వం తస్యోపవ్యా
ఖ్యానం భూతం భవద్భవిష్యదితి సర్వ మోంకార ఏవ!
యచ్చాన్యత్త్రికాలా తీతం తదప్యోఙ్కార ఏవ"

"ఓం అను అక్షరమే సర్వమునై యున్నది. ఇక ముందు దీని వ్యాఖ్యానము జరుగును. భూతభవిష్యద్వర్తమానములు "ఓం"కారమేయగుచున్నది.

త్రికాలాతీతమైనది కూడా ఓంకారమే యగుచున్నది” యని మాండూక్యోపనిషత్ తెలియచేయుచున్నది.

ఓంకారమునకు నాలుగు పాదములు కలవు. అకార, ఉకార, మకారమనుని వరుసగా మూడు పాదములు. నాల్గవ పాదము తురీయము. ఈ నాల్గవ పాదమును అమాత్రా ప్రణవమందురు. ఓంకారములోని మాత్రలు జీవి అనుభవించు అవస్థాత్రయమునకు సంబంధించియున్నవని మహర్షులు చేసిన నిర్ణయము.

ఓంకారములోని మొదటి అక్షరము ‘అ’కు అవస్థాత్రయములోని జాగ్రదవస్థాభిమానియైన విశ్వునకు సామ్యముకలదు. ఈ రెండింటిలోని సమాన ధర్మములు ‘ఆది’ ‘ఆప్తి’ యనునవి. ఓంకారములో మొదటి అక్షరము ‘అ’లాగే అవస్థాత్రయములోని వైశ్వానరుడు మొదటివాడు. కనుక రెండింటిలోని ‘ఆది’ సమానధర్మము. రెండవది ఆప్తి, ఓంకారములోని మొదటి అక్షరమైన ‘అ’ వాక్ప్రపంచమునకు మూలవస్తువై భాషయందంతయు వ్యాపించియున్నది. అలాగే వైశ్వానరుడు ప్రపంచమంతయు వ్యాపించియున్నాడు.

ఓంకారములోని రెండవ అక్షరము ‘ఉ’ రెండవ అవస్థయైన స్వప్నావస్థలోని తైజసునితో సమానధర్మము కలిగియున్నది. ‘ఉత్కర్ష’ ఉభయత్వమనునవి సమాన ధర్మములు. ఓంకారము నందు ‘అ’ తరువాత ‘ఉ’ వచ్చుటవలన ‘ఉ’ ఉత్కృష్టమై యున్నది. అలాగే స్వప్నమునందలి తైజసుడు జాగ్రదవస్థ నందలి విశ్వుని తరువాతవాడై యున్నందున ఉత్కృష్టమైయున్నాడు. రెండవ ధర్మము ఉభయత్వము. అకారమునకు, మకారమునకు మధ్య ‘ఉ’ కారముండునటుల విశ్వునకు, ప్రాజ్ఞునకు మధ్య తైజసుడున్నాడు.

ఓంకారములోని మూడవ అక్షరమైన ‘మ’ సుషుప్త్యవస్థాభిమానియైన ప్రాజ్ఞునితో సామ్యమైయున్నది. ‘మితి’ ‘లయ’ యనునవి సమానధర్మములు. ఓంకారోచ్చారణ పదేపదే చేయునపుడు, ‘అ’ కార ‘ఉ’ కారములు, ‘మ’కారము నందు లీనమై, తిరిగి ‘మ’ కారము నుండి ఆవిర్భవించు చున్నవి. ఇక్కడ

‘మ’ కారము మిగత రెండు మాత్రలకు ‘మితి’ (లేక) మానమైయున్నది. అలాగే విశ్వతైజసులు ప్రాజ్ఞునియందు లీనమై తిరిగి ప్రాజ్ఞునినుండి ఆవిర్భవించుట వలన ప్రాజ్ఞుడు మిగత రెండు అవస్థలకు మానమై యున్నాడు. రెండవది లయ. ‘అ’ కార ‘ఉ’కారములు ‘మ’ కారములో లీనమగునటుల విశ్వతైజసులు ప్రాజ్ఞుని యందు లయించు చున్నారు.

నాల్గవది అమాత్ర. కేవల నిశ్శబ్దము. ప్రశాంతత. అదియే తురీయము. ఆనందధామము. జాగ్రదావస్థలోని వైశ్వానరుడు “అ”కారముగను, స్వప్నావస్థలోని తైజసుడు “ఉ”కారమగును, సుషుప్త్యవస్థలోని ప్రాజ్ఞుడు “మ”కారముగా నెరిగి ప్రణవ ధ్యానము చేయువారు తురీయమును పొంది తరింతురు. ఇదియే ఓంకారోపాసన. కనుక సద్గురువు ద్వారా ఉపనిషత్ప్రతిపాదితమైన ఓంకారోపాసనను గ్రహించాలి. గ్రహించడమంటే అనుభవించి తరించడమని భావము. ఉపనిషత్తులలో తెలియజేయబడిన ఓంకారోపాసననుచేసి తరించవలయునని న ఉపనిషత్ సిద్ధాంతాలు వంటబట్టి యుండాలి. ఈ విషయమునే తరువాత సోపానములో శ్రీ శంకరులు తెలియచేయుచున్నారు.

16. వేదాంత శ్రవణము (Listen to the Upanishadic truths) :-

వేదాంత వాక్యాలను శ్రవణం చేయాలి. వేదమునందలి చివరి భాగమును వేదాంతమందురు. అవియే ఉపనిషత్తులు. ఉపనిషత్తులలో బ్రహ్మజ్ఞానము బోధించబడినది. జ్ఞానమార్గము ననుసరించు ముముక్షువు సద్గురు సాన్నిధ్యమును పొంది, వేదాంత వాక్యాలను శ్రవణం చేయాలి. వేదాంత శ్రవణమువలన ఆత్మ ఎరుకపడుతుంది. అవస్థాత్రయమును గ్రహించు ఏకైక చైతన్యము, మనోబుద్ధులను ప్రకాశింపచేయు చిన్మాత్రచైతన్యము. “అహం” వృత్తి కదులుటకు అధిష్ఠానమైనది ఆత్మయేనని, ఆ ఆత్మయే నీవని వేదాంత శ్రవణముద్వారా బోధపడుతుంది.

ఆత్మ అప్రమేయము, అద్వితీయము, అసమానము, అద్భుతము, అనిర్వచనీయము. అందుచే దేహ మనోబుద్ధులు ఆత్మను గ్రహించలేవు. ప్రత్యక్షంగా గ్రహించలేని విషయమును గ్రహించవలయుననిన శబ్దప్రమాణమే మార్గము కనుక వేదాంత శ్రవణమే సూటియైన దారి.

కేవలం శ్రవణము కూడా నిరుపయోగమే. శ్రవణమొక యాంత్రిక ప్రక్రియ కాకూడదు. శ్రవణం చేసిన విషయాన్ని మననం చేయాలి. మననం చేయబడిన విషయమును నిదిధ్యాసయందు స్థిరపరచుకొని అనుభూతి పొందాలి. ఆత్మ విషయంలో అనుభవమే ప్రధానము.

శృతేః శతగుణం విద్యాత్
మననం మనవాదపి
నిధిధ్యాసం లక్షగుణం
అనన్తం నిర్వి కల్పకమ్ ॥

శ్రవణముకన్నా వందరెట్లు మననము శ్రేష్ఠము. మననముకన్నా లక్ష రెట్లు నిధిధ్యాస శ్రేష్ఠము. నిర్వికల్ప సమాధియొక్క శ్రేష్ఠత్వము అనంతము.

నిర్వికల్ప సమాధిని పొందిన జ్ఞానికి అంతయూ బ్రహ్మముగానే గోచరించును. తాను పరిమితుడననే జీవభ్రాంతి నశించి, తానే బ్రహ్మమనే విశిష్ట జ్ఞానము కలుగుతుంది. అట్టి జ్ఞానాగ్నిలో పడి అజ్ఞానము దగ్ధమైపోతుంది.

ఆది చైతన్యమాత్రోహ మఖండైక రసోస్మ్యహం
సర్వత్ర పూర్ణ రూపోహం పరమామృత రసోస్మ్యహం ॥

“ నేను ఆది చైతన్య మాత్రుడను, అమృతరస స్వరూపుడను, సర్వగతమైన వాడను, పూర్ణరూపుడను, బ్రహ్మానంద స్వరూపుడను ” యని జ్ఞానియొక్క అద్వైతానుభూతిని వేదము తెలియచేయుచున్నది.

వాక్యార్థశ్చ విచార్యతాం
శృతిశిరః పక్షః సమా శ్రీయతాం
దుస్తర్కాత్సు విరమ్యతాం
శృతిమత స్తర్కోऽను సంధీయతాం
బ్రహ్మాస్మీతి విభావ్యతాం
అహరహ ర్గర్వః పరిత్యజ్యతాం
దేహాహం మతి ర్ఝుజ్ఝ తాం
బుధజనై ర్వాదః పరిత్యజ్యతాం ॥ 3

తాత్పర్యము :-

17. ఉపనిషత్తులలోని మహావాక్యములపై విచారణ కొనసాగించుము.
18. వేదాంత జ్ఞానము నాశ్రయించుము.
19. అనవసరమైన దుస్తర్కానికి దూరంగా వుండుము.
20. వేదామోదమైన తర్కాన్ని వినియోగించుకొనుము.
21. “నేనే బ్రహ్మమును” అని సదా భావించుము.
22. అహంకారము విడనాడుము.
23. దేహాత్మ భావమును వదలిపెట్టుము.
24. బుధజనులతో వాదన చేయకుము.

వ్యాఖ్య

17. మహావాక్య విచారణ **(Explore the meanings of the Mahavakyas) :-**

ఉపనిషత్తులలోని సారమంతయు నాలుగు వాక్యములలో అందించబడినది. వాటినే మహావాక్యములంటారు. అవి:- 1. ప్రజ్ఞానం బ్రహ్మ 2. తత్త్వమసి 3. అయమాత్మా బ్రహ్మ 4. అహం బ్రహ్మాస్మి.

మన మొక ఇరవై సెంట్ల భూమిలో గులాబి మొక్కలు పెంచుతాము. ఆ మొక్కలలో వచ్చిన పూలన్నీ ఒకచోట వేయగా రెండు సెంట్లభూమి నాక్రమించినవి. ఆ పూలలోని రేకులను మాత్రమే వేరుచేసి ఉంచగా అవి ఒక సెంటు స్థలాన్ని మాత్రమే ఆక్రమించినవి. అందులో వాడిన రేకులను వేరు చేసి వాడని పుష్పరేకులను ఒకచోట వేయగా అవి అర్ధసెంటు స్థలాన్ని ఆక్రమించినవి. వాడని ఆ పూల రేకులను మర్దన చేసి, అందుండి రసము తీయగా రెండు సీసాలకు వచ్చినవి. ఆ రెండు సీసాల నూనెను కాచి వడపోసి శుద్ధిచేయగా ఒక్కసీసా అత్తరు అయినది.

అలాగే ఉపనిషద్వనము నుండి కోసిన వేదాంత వాక్యపుష్పాల నుండి తయారుచేసిన అత్తరే ఈ మహావాక్యములు. ఈ మహావాక్యోపదేశములను తెలుసుకొందాము.

1. ప్రజ్ఞానం బ్రహ్మ **(Consciousness is Brahman) :-**

ఈ మహావాక్యము ఋగ్వేదములోని ఐత్తరీయోపనిషత్తు నందున్నది. ఏ జ్ఞానముచేత సకల జ్ఞానములు తెలియుచున్నవో అదియే ప్రజ్ఞానము. సకల ఉపాధులలో సాక్షియై భాసించు ఆత్మయే బ్రహ్మము. కనుక సకలమును తెలుసుకొను ప్రజ్ఞయే బ్రహ్మయై యున్నందున " ప్రజ్ఞానం బ్రహ్మయని" నిర్వచించడము జరిగినది. ఇట్టి జ్ఞానము వస్తువులకు సంబంధించిన జ్ఞానమని భావించరాదు. ఇది కేవలము వస్తురహిత చైతన్యమేనని గ్రహించాలి. ప్రజ్ఞానమునకు ఉపాధులతో కలిసి చేయు నిర్వచనము వాచ్యార్థమైయుండ, ఉపాధిరహితంగా దర్శించి నిర్ణయము చేయుట లక్ష్యార్థ మనబడుతుంది. కనుక లక్ష్యార్థము ననుసరించి చూడ చైతన్యము జ్ఞాన స్వరూపమే గనుక, బ్రహ్మము చైతన్య స్వరూపుడైనందున ప్రజ్ఞానమే బ్రహ్మయనెడి సత్య పదార్థ నిర్ణయము "ప్రజ్ఞానం బ్రహ్మ " యను మహావాక్యము ద్వారా జరిగినది.

2. తత్త్వమసి **(Thou art that) :-**

ఈ మహావాక్యము సామవేదములోని ఛాందోగ్యోపనిషత్తు నందున్నది. "తత్త్వమసి" మహావాక్యము శిష్యునికి గురువుచేయు ఉపదేశమై యున్నందున

దీనిని ఉపదేశ వాక్యమని పిలుస్తారు. పదభావమును గ్రహించుట వాచ్యార్థమైతే, తద్వారా వాక్యభావాన్ని గ్రహించుట వాక్యార్థమవుతుంది. వాక్యార్థము నందలి నిగూఢమైన అధిష్ఠాన సత్యమును ఎరుకపరచుట లక్ష్యార్థ మవుతుంది.

వాక్యార్థ జ్ఞానమును గ్రహించుటకు పదార్థ జ్ఞానమే ముఖ్యమైయున్నందున మొదట పదార్థ వివరణ జరుగవలసి యున్నది. మరి ఈ "తత్త్వమసి" వాక్యము నందు మూడు పదములున్నవి. 1. "త్వం " పదము 2. "తత్ " పదము 3. "అసి " పదము.

"త్వం" అనగా నీవు. "తత్ " అనగా అది (బ్రహ్మము) "అసి" అనగా అయివున్నావు. త్వంపద తత్పదార్థముల ఐక్యార్థము అసి అయి యున్నది.

"తత్త్వమసి" యనగా నీవే బ్రహ్మవు అని భావము. ఈ అర్థము ఎలా పొసగుతుంది ? నాకు శరీరముంది. బ్రహ్మకు లేదు. నాకు జన్మ వుంది. బ్రహ్మకు లేదు. నాకు మరణముంది. బ్రహ్మకు లేదు. నేను కించిజ్ఞుణ్ణి - బ్రహ్మ సర్వజ్ఞుడు. నాకు మార్పు వుంది. బ్రహ్మకు లేదు. అలాంటప్పుడు నేనే బ్రహ్మమనెడి వాక్యము ఎలా సరిపోతుంది? నిజమే ఇది వాక్యార్థము. సత్యమును వాక్యార్థము ద్వారా గ్రహించుటకు వీలులేని సందర్భాలలో లక్ష్యార్థము ద్వారా గ్రహించాలి.

జగత్తునందలి నామరూపములను తొలగించి చూసినచో ఉన్నదంతయూ చైతన్యమే. అలాగే దేహేంద్రియ మనోబుద్ధుల స్థాయినుండి చూసిన యెడల నేను జీవుడనను భ్రాంతి కలుగుచున్నది. దేహేంద్రియ మనోబుద్ధుల కతీతమై నిలిచినచో నేనే సాక్షిరూపచైతన్యమని తేటతెల్లమవుతుంది. కనుక నేను చైతన్యమే. భగవంతుడు చైతన్యమే. భేదమనునది ఉపాధి స్థాయిలోనే గాని వస్తుతః అభేదమే.

"ఈశ జీవయోర్వేషధీభిదా సత్స్వభావతో వస్తు కేవలం "

"శరీరాది ఉపాధుల వలన జీవేశ్వరులలో భేదము కనుపించి నప్పటికి ఇద్దరు సత్స్వరూపులై యుండుటచే ఒకే వస్తువై యున్నారు." అని భగవాన్ రమణ మహర్షి తన ఉపదేశసార గ్రంథములో తెలియజేసి యున్నారు.

వాచ్యార్థములగు మాయ, సర్వజ్ఞత్వాది గుణంబులును, అవిద్య, కించిజ్ఞత్వాది గుణంబులును త్రోసివేసి లక్ష్యార్థమైన చైతన్యమును దర్శించిన "అసి" పదార్థము అనుభవమునకు అందుతుంది.

ఘటాకాశము అని అందుము. అనగా కుండలోని ఆకాశమని భావము. అలాగే మఠాకాశ మనగా గదిలోని ఆకాశమని అర్థము. ఆకాశము ఇన్ని ముక్కలుగా ఎప్పుడు తయారైంది? కుండస్థాయిలో చూసినపుడు ఘటాకాశమైంది. గృహస్థాయిలో చూసినపుడు మఠాకాశ మయింది. యదార్థాని ఘటమఠాదులలో ఆకాశం ప్రవేశించలేదు. ఘట, మఠాదులనునవి ఆకాశములో తయారయినవి. ఘట,మఠాదుల ఆవరణను తొలగించి చూసినచో అంతయు ఒకే మహాకాశమని బోధపడుతుంది.

అలాగే త్వంపద,తత్పదార్థములను జహలజహల్లక్షణాదులచేవిచారించి ఉపాధులను తొలగించి ఉన్న ఒకే చైతన్యము తానేనని తాను అన్వేషించి బ్రహ్మము తనకన్నా అన్యము కాదని తెలిసికొని తరించడమే "తత్త్వమసి" లక్ష్యార్థమై యున్నది.

3. అయమాత్మా బ్రహ్మ (This Atman is Brahman):-

అయమాత్మా బ్రహ్మ అనగా ఈ ఆత్మయే బ్రహ్మము. ఈ ప్రత్యగాత్మ పరమాత్మ యని భావము. ఈ మహావాక్యము అధర్వణ వేదములో మాండూక్యోపనిషత్తు నందున్నది.

"సర్వం హ్యేత ద్బ్రహ్మయమాత్మా బ్రహ్మ"

సర్వము బ్రహ్మమయమే. ఈ ప్రత్యగాత్మ కూడా బ్రహ్మమే మాండూక్యమునందు తెలియచేయబడింది.

"ప్రజ్ఞానం బ్రహ్మ" యను మహావాక్యము సత్యనిర్దేశమైయుండ "తత్త్వమసి" యను మహావాక్యము గురువు చేయు ఉపదేశవాక్యమై యుండ "అయమాత్మా బ్రహ్మ" అను ఈ మహావాక్యము గురుబోధను గ్రహించి అనుభవమును చాటు అనుభవ వాక్యమైయున్నది.

ఈ వాక్యములో మూడు పదములున్నవి. "అయం ఆత్మా బ్రహ్మ" యని మూడు పదములున్నవి.

బ్రహ్మమనగా సర్వవ్యాపకమైన సత్తాస్వరూపము. "అయం" అనగా ఇది. ఆత్మ యనగా దేహేంద్రియ మనోబుద్ధుల మొదలుకొని అహంకారముతోనూ కలసి నా స్వరూపమే అని తెలుసుకొనెడి చైతన్యమే. ఇదియే జీవచైతన్యము. ఇదియే ప్రత్యగాత్మ. ఈ ప్రత్యగాత్మయే పరమాత్మ అయి వున్నది.

"అయం" అనునది లక్ష్యార్థమును సూచించుటకు నిర్దేశము. "అయం" అనగా ఇది. "ఇది" అనునది సూక్ష్మమై యున్నది. తెలుసుకొనుచున్నంతవరకు తెలియబడేవన్నీ "అది" అని పిలువబడుచున్నది. "ఇది" అనగా తెలుసుకొనునది. అదియే చైతన్యము. ఆత్మ. కనుక "అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యము ద్వారా ఈ ప్రత్యగాత్మయే అనుభవ పూర్వకముగా ధృవీకరించడము జరుగుచున్నది.

4. అహం బ్రహ్మాస్మి (I am Brahman) :-

ఈ మహా వాక్యము శుక్ల యజుర్వేదములోని బృహదారణ్యకోపనిషత్తు నందున్నది. జ్ఞాని యొక్క అనుభూతిని కనుపరుచు పరవశవాక్యమే ఈ "అహం బ్రహ్మాస్మి" మహావాక్యము. "అహం" అనగా నేను "బ్రహ్మ" మనగా సర్వవ్యాపకమైన పరబ్రహ్మము "అస్మి" అనగా అయివున్నాను. "అహం" లో అనగా నాలో జడాత్మకమై భాసిల్లు దేహేంద్రియ మనో బుద్ధ్యహంకారాది వాచ్యార్థములను తొలగించి చూడగా, వీటన్నిటికి అధిష్ఠానమై భాసించు కేవల చైతన్యము లక్ష్యార్థముగా తెలుస్తుంది అలా లక్ష్యార్థమైన "అహం" నేను అనగా ఆత్మ బ్రహ్మ పదార్థమే అయివున్నదని గ్రహించి తెలియ చేయడమై యున్నది. మరి నీవు బ్రహ్మమైనపుడు "నేను బ్రహ్మమునై యున్నాను" అని ఎవరికి చెప్పుచున్నావు? తాను చెప్పుటకు లేదా తాను చెప్పినది వినుటకు రెండవ వ్యక్తి లేరు గనుక అది కేవలం తన పారవశ్య దివ్యోన్మాద స్థితిలో, గాయకుడు తానే పాడి తానే ఆనందించునట్లు మాధుర్య గానంలా ఉప్పొంగిన అనుభూతి తరంగము.

తనలోని ఆత్మయే సర్వత్రా నిండియున్న పరబ్రహ్మమని తెలుసుకున్న వాడు ముక్త పురుషుడు. అతడే జీవన్ముక్తుడు. ఇంతవరకు తన హృదయంలో వ్యాపించియున్న అజ్ఞానము మహావాక్య చతుష్టయ శ్రవణంద్వారా తొలగి, దేహము తాను గానని ఇంద్రియమనోబుద్ధులు తాను గానని, అహంకారము తనకు సంబంధించినది గాదని వీటన్నిటికి కారణమైన అజ్ఞానమును కూడా తాను తెలుసుకొనుచున్నందున అజ్ఞానము కూడా తాను కానని గ్రహించి, ఇవన్నీ నడచుటకు కారణమైన చైతన్యమే తానని గ్రహిస్తాడు. తాను చైతన్య స్వరూపుడని ఎప్పుడైతే గ్రహించాడో అంతటా నిండి నిబిడీకృతమైయున్న పరమాత్మ తత్త్వము తనకన్నా అన్యమైనది కాదని తెలుసుకొని ఉన్నదంతా ఒకేవస్తువని ఆ వస్తువు తానే అయివున్నట్లు అనుభవ సిద్ధంగా గ్రహిస్తాడు. అతడే జ్ఞాని, జీవన్ముక్తుడు.

18. వేదాంతాశ్రయము **(Take refuge in Upanishads) :-**

వేదాంత జ్ఞానము నాశ్రయించమని పదునెనిమిదవ సోపానంలో తెలియజేయుచున్నారు. ఉపనిషత్తులలో తెలియజేయబడిన జ్ఞానము నాశ్రయించి జీవించడ మనగా బ్రహ్మభావంలో సదా రమించడమని భావము.

"సదేవ సౌమ్యే దమగ్ర ఆసీదేక మేవా ద్వితీయం బ్రహ్మ"

సృష్టికి పూర్వము బ్రహ్మ మొక్కటియే యున్నది. అది రెండు కాని ఏకమునై యుండెడిదని వేదము తెలియచేయుచున్నది.

బ్రహ్మము త్రికాలమునందున్నది. అంతేకాదు. కాలాతీతమైయున్నది కూడా. బ్రహ్మము ద్వైతమూ కాదు. అద్వైతమూ కాదు. అద్వైతమనునది కూడా ప్రబోధము కొరకు ప్రాచుర్యము నొందినదేగాని యదార్థానికి బ్రహ్మము ద్వైతాద్వైతముల కతీతము. దృశ్యమున్నంత వరకు చూడటము జరుగుచున్నది గనుక బ్రహ్మను "దృక్" అని నిర్వచించాము. సత్యానుభవములో చూడబడువస్తువు లేనందున బ్రహ్మము "దృక్" కూడా కాదు. జగత్తు ఆధేయమైగోచరించుట వలన "ఏకాంశేన స్థితో జగత్ " అని నిర్వచిస్తూ బ్రహ్మము ఆధారమని నిర్ణయించడము జరిగినది. బ్రహ్మానుభవ స్థితిలో

ఆధేయమైన జగత్తు అదృశ్యమగుచున్నందున బ్రహ్మమును ఆధారమని కూడా చెప్పడానికి వీలులేదు. అక్కడ భాసించునది కేవలం అస్తి.

"బ్రహ్మ విదాప్నోతి పరం బ్రహ్మ విదితి"

బ్రహ్మమును తెలుసుకొనువాడు బ్రహ్మమే కాగలడని వేద ప్రవచనము. అట్టి బ్రహ్మచింతనలో జీవితమునుపండించుకొనుటకు ఉపనిషత్తులలోని జ్ఞానమునే గ్రహించవలయుననియు, అయితే ఉపనిషత్ సత్యాలను గ్రహించుటలో దుస్తర్కమును వీడి వేద ప్రతిపాదిత తర్కము నుపయోగించి సత్యమును గ్రహింపవలయుననియు తరవాత సోపానములో ఆచార్యులు తెలియజేయుచున్నారు.

19 దుస్తర్క పరిత్యాగము **(Avoid vain arguments) :-**

దుస్తర్కానికి దూరంగా వుండమని ఆచార్యులు తెలియజేయుచున్నారు. శాస్త్రలోతుల్ని గ్రహించాలంటే తర్కమెంతో ఉపయోగకరము. తత్త్వశాస్త్రఅవగాహనకే తర్కశాస్త్రం ఆవిర్భవించింది. కనుక తర్కమనేది తత్త్వావగాహన కొరకే గాని తర్కించడానికి మాత్రము కాదు.

శంకరులు తర్కశాస్త్రానికి దూరంగాపోరు. దాటిపోతారు. సత్య బుద్ధిలేని కొందరు తర్కమే సర్వమని భావించి పిడివాదాలు చేస్తుంటారు. షడ్దర్శనాలలో గౌతముని న్యాయశాస్త్రము, కణాదుని వైశేషిక శాస్త్రము రెండును తర్క శాస్త్రములై యున్నాయి. గంగేశమిశ్ర ఉపాధ్యాయ యను పండితుడు తర్క శాస్త్రమును గూర్చి "తత్త్వ చింతామణి" యను గ్రంథమును రచించారు. ఇందు అరవై నాలుగు వాదములు తెలియచేయబడి యున్నవి. ఈ వాదములపై అనేకమంది పండితులు వ్యాఖ్యానము వ్రాసియున్నారు. ఈ వాదములలో ఐదు వాదములను క్షుణ్ణంగా తెలుసుకున్నవాడు తెలివిగలవాడని ప్రతీతి. పదివాదములు తెలుసుకున్నవాడు మేధావి యంటారు. ఆ తరువాత ప్రామాణ్యావాదము వస్తుంది. ప్రామాణ్యావాదము నర్థం చేసుకున్నవాడు సర్వజ్ఞుడని భావిస్తారు.

ఈ ప్రామాణ్యావాదాన్ని నేర్చుకోవాలని ఒక పండితుడు దక్షిణ దేశమునుండి బయలుదేరి నవద్వీపము చేరాడు. నవద్వీపమనునది తర్క పండితు లుండుచోటు. దక్షిణ దేశమునుండి వెళ్ళిన పండితుడు గొప్పకవి. తన కవిత్వము ద్వారా ఎంతో ధనమును తన స్వదేశములో గడించియున్నాడు. ప్రామాణ్య వాదాన్ని నేర్చుకోవాలని నవద్వీపములో తర్కమును అభ్యసించ సాగాడు. ఎంత ప్రయత్నించినను ప్రామాణ్య వాదతర్కము అతని బుర్ర కెక్కలేదు. డబ్బంతా ఖర్చయి పోయింది. అయినా తర్కశాస్త్రము వంటబట్ట లేదు. తనలోని కవితా నైపుణ్యము కూడ క్షీణించింది. అప్పటికి ప్రామాణ్య వాదము అర్థం కాలేదు. ఇంక కొద్దిగా తనలో మిగిలియున్న కవిత్వాన్ని కూడ గట్టుకొని ఒక్క వాక్యం చెప్పాడు.

"నమః ప్రామాణ్య వాదాయ మత్కవితాపహారిణే"

" నా కవిత్వమును పాడుచేసిన ప్రామాణ్య వాదమునకు నమస్కారము" అని చెప్పారు.

జటిలమైన ఇటువంటి ప్రామాణ్య వాదమును మండన మిశ్రుని ఇంటిలోని చిలుకలు చర్చించుచున్నట్లు మాధవీయ శంకర విజయమునందు తెలియచేయబడి యున్నది. ఇక మండన మిశ్రుని తర్కమెలా వుంటుందో మీరు ఊహించుకోవచ్చు. అట్టి మండన మిశ్రుని ఓడించిన శంకరుని తర్కశాస్త్ర మేధాసంపత్తి ఎలాంటిదో వేరుగా చెప్పనవసరంలేదు. కనుక తర్కమును విసర్జించమని, మౌఢ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో చరించమని శంకరులు చెప్పరు. అయితే దుస్తర్కమనునది లక్ష్యమును పాడుచేయునని తెలుపుతున్నారు.

ఆధునిక మానవుడు వేదాంత శాస్త్ర విషయాలను గ్రహించుటలో కూడ అస్తవ్యస్త ధోరణులనే అనుసరిస్తున్నాడు. వాదమను పేరుతో వాదులాడటానికి తయారయ్యాడు. విచారమను విషయమును మరచి పదపోరాటానికి సిద్ధపడ్డాడు. పదముల గారడితో చేయు పిడివాదమును "జల్ప" మని యంటారు. ఎదుట వ్యక్తిచేయు వాదము తప్పని నిర్ణయించుటకు చేయు ప్రయత్నమే "జల్ప

ములో గోచరమవుతుంది. అసలు వాదమనునది సత్య దర్శనమునకై జరగాలి. "జల్పము", "వాదము" గాకుండుట మరొకటున్నది. అదియే వితండము. ఈ వితండవాదము చేయు వ్యక్తి తనకంటూ తనదిగా ఒక అభిప్రాయము లేకనే ఎదుటి వ్యక్తి చేయు నిర్ణయముల నన్నిటినీ అదేపనిగా ఖండిస్తూ వాదిస్తుంటాడు. కనుక ఈ విధమైన దుస్తర్కములన్నీ దురవస్థనే కల్గిస్తాయి. ఈ వాదాలన్నీ భేదాల్ని కల్గించేవే గాని అనాహత నాదమువైపు నడిపించేవి కావు. కనుకనే "వాదోనావలంబ్యః" వాదమును విసర్జించమని పరమ భాగవతోత్తముడైన నారదమహర్షి తన భక్తి సూత్రాలలో తెలియజేశారు.

కనుక దుస్తర్కమును విసర్జించమని చెబుతూ, మరి ఎలాంటి తర్కముతో సత్యాన్వేషణచేయవలయునో తరువాత శ్లోకములో ఆచార్యులు తెలియజేస్తున్నారు.

20. వేదతర్కానుసరణ (Take recourse to the reason approved by the Vedas) :-

వేదామోదమైన తర్కాన్ని వినియోగించికోమని ఆచార్యులు తెలియ చేస్తున్నారు. శాస్త్రయుక్తమైన తర్కము చేయవలెనని భావము. శాస్త్రము వాచ్యార్థమును తెలియచేస్తూ లక్ష్యార్థమును సూచించు నిమిత్తమైయున్నది. కనుక మన ముపయోగించు తర్కము కూడా లక్ష్యార్థమును గ్రహించి అనుభవించుటకు తోడ్పడాలి. అదియే శాస్త్రామోద తర్కము.

"తత్త్వమసి" వాక్యార్థమును గ్రహించుటకు ఆచార్యులవారు "వాక్యవృత్తి" యను యాభై మూడు శ్లోకముల గ్రంథమును రచించారు. "తత్త్వమసి" పదార్థ వివరణ అందు తర్కయుక్తముగా జరిగినది. కనుక వాదమనునది వేదాంతర్గత అభేద జ్ఞానమును పొందుటకేనని గ్రహించి చర్చించాలి.

మహావాక్యములను అర్థం చేసుకొనవలయునని తర్క శాస్త్ర ప్రవేశముండితీరాలి. "తత్త్వమసి" మహావాక్యమును అనుభవమునకు తెచ్చుకొన వలయు నని భగత్యాగ లక్షణము మొదలగు విధానములద్వారా గ్రహించాలి.

"తత్త్వమసి" మహావాక్యమునందే "తత్" అనగా ఈశ్వరుడనునది వాచ్యార్థము. బ్రహ్మమనునది లక్ష్యార్థము. అలాగే "త్వం" అనగా జీవుడనునది వాచ్యార్థము. ఆత్మ లేక కూటస్థుడనునది లక్ష్యార్థము. కనుక అవిద్యోపాధిగల జీవుని యందు అవిద్యను తొలగించి మాయోపాధిగల ఈశ్వరుని యందు మాయను తొలగించి రెండింటిలో సామాన్య ప్రకాశమైన చైతన్యమును గ్రహించి, రెండింటి సామ్యమును ఎరుకపరచి సిద్ధాంతము చేయాలి. ఇదియే భగత్యాగ లక్షణము. ఈ విధముగా శాస్త్ర సమ్మతమైన తర్కముచేసి సత్యమును గ్రహించమని ఆచార్యులు తెలియచేస్తున్నారు. ఇలా శాస్త్రసమ్మతమైన తర్కము నుపయోగించి శాస్త్ర వాక్యసత్యాలను గ్రహించిన తరువాత అనంతరము భగవద్భావనలోనే తరించమని తరువాత సోపానములో తెలియచేయుచున్నారు.

21. నిరంతర బ్రహ్మ చింతన (Constantly Meditate 'I am Brahman') :-

"నేనే బ్రహ్మమును" అని సదా భావించు చుండవలయునని ఆచార్యులు తెలియచేయుచున్నారు. అనగా నాలో జరుగు సమస్తమునకు నేను సాక్షీభూతుడనై యున్నానని భావించి జీవించుట. నేను సూక్ష్మమగు చైతన్యమైనందున పంచ కోశములకు అన్యమైన వాడను. మనసును ప్రకాశింపచేయు చిన్మయుడనైనందున ఈషణత్రయములు నావి కావు. వాసనాత్రయములు నాకు లేవు. గుణాతీతుడనైనందున గుణదోషములు నాకు అంటవు. సాక్షీచైతన్యమైనందున అవస్థాత్రయమున కతీతుడను.

శరీరస్థాయి నధిగమించగానే నేను ఏ వస్తువు చేతను బద్ధుడను కాను. మనో బుద్ధుల నధిగమించగానే కేవల చైతన్యమై భాసించి వికారములకు అందను. అరిషడ్వర్గములకు చిక్కను. అజ్ఞానమును నేను తెలుసుకొను చున్నందున అజ్ఞానము నన్ను అంటదు. ఈ విధమైన విచారణను కొనసాగించినచో దేహ మనోబుద్ధుల యందున్న భ్రాంతి తొలగి, మల విక్షేప ఆవరణాదులు భంగమై, అన్నిటికి అధిష్ఠానమై వెలుగు ఆత్మతత్త్వము అనుభవమునకు అందగలదు. సర్పభ్రాంతి ఎప్పుడయితే తొలగినదో, వెంటనే

రజ్జు జ్ఞానము కలుగునట్లు భ్రాంతి తొలగగానే ఆత్మానుభవము కల్గుతుంది. కనుక "నేనే బ్రహ్మమును" అను భావమును సాధకుడు సదా అనుసంధానం చేయుచుండ వలెను.

నిమషార్థం నతిష్టంతి వృత్తిం బ్రహ్మమయం వినా
యధాతిష్టంతి బ్రహ్మధ్యాసేన కాద్యాశ్శుకాదయః

బ్రహ్మదేవుడును, సనకసనందనాది మహర్షులును, శుకబ్రహ్మ మొదలగు బ్రహ్మవేత్తలు అర్థ నిముషమైనను ఎలాగ బ్రహ్మభావనను విడిచి ఉండరో అలాగే జ్ఞానము కోరు ముముక్షువులు సదా బ్రహ్మ భావననే కొనసాగించుచుండ వలయునని వేదము తెలియచేయుచున్నది.

22. అహంకార నివృత్తి (Give up egosim totally) :-

ఆధ్యాత్మిక సాధకుడు గర్వమును విడనాడవలయునని పూజ్యపాదులు తెలియచేయుచున్నారు. నేను అనెడి అహంకారము నుండి ఆవిర్భవించిన గర్వమే సకల అనర్థములకు మూలము. అరిషడ్వర్గములకు అహంకారమే అధినేతయై యున్నది. ఆధ్యాత్మిక రణరంగమున సాధకుడు ఎదుర్కొనవలసిన శత్రువులే కామ క్రోధాధి అరిషడ్వర్గములు. దీనికి అధినేత అహంకారము. అధినేతను చంపగానే శత్రుసైన్యము మనకు శరణు జొచ్చును. అలాగే అహంకారము నంత మొందించినచో సమస్త దుర్గుణములు మనకు లొంగిపోవును.

అహంకారమును అర్థం చేసుకొనుట దుస్సాధ్యము. అహంకారము సాధకునికి చిరకాల మిత్రుడు. అనుకూల శత్రువు. అహంకార మనునది సర్వ అనర్థములకు మూలము. అదొక శ్వేతకుష్ఠువు. చికిత్స లేని వ్యాధి. ఇది ఎవరిని వదలి పెట్టదు. ఉద్యోగ నిర్వహణయందు ముఖ్యంగా ఎక్కువ మంది అధికారులలో ప్రస్ఫుటంగా తెలుస్తుంది. అందుచేతనే అధికార రోగపూరిత బధిరాంధక శవాలని సుమతి శతక కర్త ముచ్చటగా పిలుచుకున్నాడు. వయస్సు మళ్ళి కుర్చీదిగితే చాలు. కృష్ణ కృష్ణ ! కుక్క గొడుగులే. మూడునాళ్ళ వైభోగానికి మూతిలో ఎన్ని ముడతలో.

సర్వసంగ పరిత్యాగులైన ఎందరో సన్యాసులను కూడా అహంకారము వదలదు. వారిని గౌరవించుటలో "లేదా" నమస్కరించుటలో పొరపాటున ఆలశ్యం జరిగిందో –రామ రామ– ఇక ఎన్ని విసుర్లో? ఎంత విసుగో ? ఇదంతా అహంకారము వేసే ముసుగే.

ఈ అహంకారము మూడు విధములుగా వుంటుంది. 1. సాత్త్వికాహంకారము 2. రాజసికాహంకారము 3. తామసికాహంకారము. సాత్త్వికాహంకారము బంధహేతువు కాదు. పైగా మోక్ష హేతువు. నా విజ్ఞానము భగవత్ప్రసాదితము. భగవంతుని కరుణచేతనే నేను పండితునిగా పరిగణింపబడుచున్నాను. రూపము, ధనము, విద్య, యవ్వనము అన్నియూ భగవంతుడను గ్రహించినవే. నేను కేవలం నిమిత్తమాత్రుడను, పరికరాన్ని అని భావించడము సాత్త్వికాహంకారము. దీనివలన జీవికి హానిలేదు.

రెండవదియైన రాజసికాహంకారముగల వ్యక్తి తానే గొప్ప వాడని, తనకు మించిన వారు లేరని,తానే ఏ పనినైన నిర్వహించగలనని, తానే విద్యావంతుడనని గర్వంతో జీవిస్తుంటాడు.

మూడవదియైన తామసికాహంకారముగల వ్యక్తితాను అధముడనని, నీచుడనని, తనకేమి తెలియదని నిరంతరము నిందించుకుంటూ జీవిస్తుంటాడు.

రాజసిక తామసికాహంకారములను వెంటనే తొలగించుకోవాలి. సాత్త్వికాహంకారము కాయపెరుగుతుంటే పూలరేకులు రాలునట్లు జ్ఞానము విరబూయగానే తనంతటదే రాలిపోతుంది. అహంకారము నిర్మూలించబడగానే వ్యక్తి ఆత్మ విదుడై ప్రకాశిస్తాడు.

"అహంకార గ్రహోన్ముక్తః స్వరూప ముపపద్యతే
చంద్ర వద్విమలః పూర్ణః సదానందః స్వయంప్రభః

"అహంకార విముక్తులైన జీవులు గ్రహణ విముక్తుడైన చంద్రునివలె విమలమై, పూర్ణమై, నిత్యానందమై, స్వయం ప్రకాశమై వెల్గొందుదురని" శ్రీ శంకరాచార్యులవారు వివేక చూడామణిలో తెలియజేశారు.

23. దేహభావ విస్మృతి (Give up your identification with the body) :-

దేహాత్మ భావాన్ని వదలి పెట్టమని ఆచార్యులు తెలియ జేయు చున్నారు. వేదాంత విషయాల్ని బహుజాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దేహాత్మ భావనను వదలమన్నాడేగాని దేహాన్ని వదలమని చెప్పలేదు. ఈ సత్యాన్ని గ్రహించలేక కొందరు దేహము అనిత్యమని ఆహారపానీయములు, నిద్రా విశ్రాంతులు లేక శరీరమును శుష్కింపచేసి, తద్వారా రోగగ్రస్తులై చింతిస్తుంటారు కనుక దేహాత్మ భావాన్ని విడనాడాలి.

"దేహాది భావం పరిమార్జయన్తః "

"దేహాది భావమును త్యజించినవారే భాగ్యవంతులని" ఆదిశంకరులు కౌపీన పంచకములో తెలియజేసియున్నారు.

శరీరమనునది విషయ భోగానుభవమునకై వచ్చిందికాదు. ఆత్మానుభవమును పొందుటకు శరీరమే సాధన పరికరము. కనుక దేహమును సాధన పరికరముగా ఉపయోగించుకోవాలి. భోగసాధన మనుకుంటే అది రోగసాధనమై శోకము నందిస్తుంది. దేహస్థితి అర్థంకానందువలననే దానిపై మోహం జనించుచున్నది. తల్లి భుజించిన ఆహార సారముతో గర్భంలో శిశువు పెరిగింది. తల్లి పాలతో శైశవములోను, ఆహారపదార్థములతో బాల్యములోను పెరిగింది. మరణానంతరము ఈ దేహము పురుగులకో, జంతువులకో, పక్షులకో ఆహారము. మట్టిలో కలిసిపోయే మృణ్మయ శరీరాన్ని ప్రేమించి, సాధించేదేముంది? మృణ్మయ శరీరాన్ని చిన్మయ శరీరంగా మార్చడానికి యత్నించాలి.

వ్యాఘ్రీవ తిష్ఠతి జరా పరితర్జయన్తీ
రోగాశ్చ శత్రవ ఇవ ప్రహరన్తి దేహమ్
ఆయుః పరిస్రవతి భిన్న ఘటాది వామ్భో
లోక స్తథా ప్యహిత మాచరతీతి చిత్రమ్।

"ముసలితనము పెద్దపులివలె గాండ్రించుచు పైబడ నున్నది. రోగములు శత్రువులవలె దేహమున ప్రవేశించుచున్నవి. ఓటికుండ లోని నీరువలె ఆయువు కారిపోవుచున్నది. ఇల్లున్నను లోకము చెడుమార్గమును వీడకున్నది కదా !" యని భర్తృహరి మహాశయుడు వైరాగ్య శతకంలో తెలియచేస్తాడు.

శరీరమును భోగజీవన పరికరమని భ్రాంతి చెందక యోగజీవన సాధనముగా భావించి ఉపయోగించుకోవాలి. మలమూత్రాదులతో నిండిన దేహముపై వ్యామోహము సముచితమైనది కాదు. ఏమున్నది శరీరంలో భ్రాంతి చెందడానికి? మలమూత్ర, రక్త మాంసాదులతో నింపబడి చర్మముతో నగిషీ చేయబడిన దుర్గంధ పూరిత ఎముకల గూడు. ఒకనాటికి మృత్యువాత పడి అదృశ్యమయ్యే ఓటికుండ. కనుక ఆధ్యాత్మిక సాధకుడు దేహాధ్యాసను మనసు నుండి దూరం చేయాలి.

"మోహ ఏవ మహామృత్యుర్మము క్షోర్వపురాదిషు
మోహహా వివిర్జితో యేవ సముక్తి పదమర్హతి ॥

"మోక్షమునకై ప్రయత్నించు సాధకునికి శరీర వ్యామోహమొక మహా మృత్యువు లాంటిది. ఈ దేహధ్యాసను జయించిన వాడే మోక్షధామం చేరుటకు అర్హుడు" అని ఆదిశంకరులు వివేక చూడామణి గ్రంథంలో తెలియ జేశారు.

24. విజ్ఞ విధేయత (Do not enter into argument with the wise) :-

బుధజనులతో వాదనకు దిగవద్దని శ్రీ శంకరులు ప్రబోధిస్తున్నారు. అజ్ఞానం తొలగాలంటే విజ్ఞుల నాశ్రయించాలి. బాధలు దూరం కావాలంటే బుధజనులకు దగ్గర కావాలి. అజ్ఞానము భయంకర వ్యాధి. ఆత్మవిచారమే ఔషధము. విజ్ఞులే వైద్యులు. సాక్షాత్కారమే ఆరోగ్యము. భౌతిక రోగమును చికిత్సచేయు వైద్యులే నారాయణ స్వరూపమని శాస్త్రము ప్రవచించినపుడు ఇక భవరోగ వైద్యులైన గురువులు ఎలాంటివారో ఊహించుకోవచ్చు.

అట్టి మహాత్ముల సాన్నిధ్యంలో చేరి జ్ఞానము సముపార్జించాలి. మహాత్ములనేవారు నిరంతరము తమ హృదయము లందరి భగవానునితో ఐక్యమై జీవిస్తుంటారు. వారి మాటలు వేదవాక్కులు. అనుభవభూమిక నుండి వెలువడే అమృత వచనములు.

మహాత్ముల సహచర్యం వలన మనలో ఆత్మజ్ఞానము విరబూస్తుంది. ప్రాపంచిక విషయ విరక్తి మనసులో ఏర్పడుతుంది. పరమాత్మ చింతనాభిలాష అంతఃకరణను ఆవరిస్తుంది.

బుధజనుల సదా బ్రహ్మ భావనలోనే యుంటారు. ప్రపంచము సత్యమని స్వప్నంలో కూడా విశ్వసించరు. పిల్లలవలె నిష్కల్మష చిత్తులై అగుపిస్తారు. బేధభావము లేనివారు, ఉదార స్వభావము గలవారు, త్రికరణ శుద్ధితో జీవిస్తారు. ప్రేమతో బ్రతుకుతుంటారు.

ధర్మేరతాః సత్పురుషైః సమేతాః తేజస్వినో దానగుణ ప్రధానాః
అహింసకా వీతమలాశ్చలోకే భవన్తి పూజ్యామునయః ప్రధానాః

"మహాత్ములైన మహర్షులు ధర్మరతులై, సత్పురుష సమేతులై, దానగుణ ప్రధానులై, కరుణాహృదయులై, నిష్కళంక చరితులై యున్నందున లోకపూజితులై యుందురని" వాల్మీకి మహర్షి శ్రీ మద్రామాయణంలో అయోధ్యకాండయందు తెలిపి యున్నారు.

దయా స్వరూపులైన అట్టి మహాత్ముని సన్నిధికి వెళ్ళగానే మన హృదయములను తెరచి యుంచడము అలవరచుకోవాలి. తలుపులు తెరచియుంచినచో భాస్కర తేజము గృహములోని కరుదెంచునటుల, హృదయ కవాటములు తెరచి యుంచినచో బుధజనుల కరుణా తేజము మన హృదయములలో ప్రవేశించును.

మహాత్ములతో వాదులాడ కూడదు. సత్యాన్వేషకులమై మనము విజ్ఞుల నాశ్రయించాము. సత్యము మాటలకందదు. అది కేవలము అనుభవ గ్రాహ్యము.

గురుకృపచే లభ్యమగు ఆనందము. అనిర్వచనీయమైన ఆనందము పొంది తరించాలని గురువుల నాశ్రయించాము. అనవసర వాదోపవాదాలతో అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకోకూడదు.

సందేహాలు రావచ్చు. వాటిని తప్పక నివృత్తి చేసుకోవాలి. అనుకూల సమయమందు ప్రశ్నించాలి. నమ్రతతో అడగాలి. విజ్ఞుల హృదయాలను నొప్పించ గూడదు. నీ ప్రవర్తన చేత విజ్ఞుల హృదయాలు నొప్పిపెడతాయని కాదు. నీవు వారిని బాధించలేవు. వారు ద్వంద్వాలకు అతీతులు. కానీ నీ దుష్ట ప్రవర్తన నిన్నే క్రుంగదీస్తుంది. మహాత్ముల చెంత అధిక ప్రసంగముచేయకు. నీవు తక్కువగా మాట్లాడు. వారినుండి కదిలే అమృత వాక్కులకై ఎదురు చూస్తూవుండు. వారు ఏమి చెప్పకున్నను వారి సాన్నిధ్యంలో అలుముకున్న శాంతి ననుభవించడానికి ప్రయత్నిస్తూవుండు. మహాత్ముల చెంత ప్రాపంచిక విషయ ప్రస్తావన లేవదీయకు. మహాత్ములు ప్రేమపాత్రులు. అందుచేత నిన్ను నొప్పించలేక నీమాటలు వింటున్నట్లే నటిస్తారు. నీవు బుధజనుల చెంతకు వెళ్ళింది ఎందుకో ఆలోచించుకో. నీ అస్తవ్యస్త ధోరణులతో వారి కాలాన్ని వృధాచేయకు. పరిసరాలను కల్మషపరచకు.

మహాత్ములు మధురాత్ములు. "పంచదారయందు తియ్యదనమువలె నాయందు పాండురంగడున్నాడ"ని సంత్ తుకారాం మహాశయుడు తెలియజేస్తాడు. కనుక మహాత్ముల దివ్యచరణాల చెంత బ్రతుకును పండించుకోవాలి. వాదమును వీడి విచారమును కొనసాగించి తరించాలి.

క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం
ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం
స్వాద్వన్నం నతుయాచ్యతాం
విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతాం
శీతోష్ణాది విషహ్యతాం
నతువృధా వాక్యం సముచ్చార్యతాం
ఔదాసీన్య మభీప్స్యతాం
జనాకృపా నైష్ఠుర్య ముత్సృజ్యతాం. 4

తాత్పర్యము :

25. ఆకలి వ్యాధికి చికిత్సనొందుము.

26. నిత్యమును భిక్షమును ఔషధముగా భుజించుము.

27. రుచికరమైన ఆహారమును కోరకుము.

28. ప్రారబ్ధవశాత్తు లభించినదానితో తృప్తి చెందుము.

29. శీతోష్ణాది ద్వంద్వములను సహించుము.

30. వృధా ప్రసంగాలు మానుము.

31. ఉదాసీనుడవై మెలగుము.

32. ఇతరుల కరుణను, క్రౌర్యమును రెండింటిని ఉపేక్షించుము.

వ్యాఖ్య

25. క్షుద్రోగ నివారణ (Find a remedy to the disease of hunger):

ఆకలివ్యాధికి చికిత్సనొందుమని పూజ్యపాదులు తెలియజేస్తున్నారు. శరీరమునకు వచ్చు ఇతరవ్యాధులవలె ఆకలి కూడా ఒక వ్యాధిగా ఆచార్యులు

వర్ణిస్తున్నారు. ఇతర వ్యాధులు ఏదో ఒక కాలములో రావచ్చు. కానీ ఆకలి రోగమలాంటిది కాదు. నిత్యము ఎన్నిసార్లు వస్తుందో చెప్పలేము. అదృశ్యమైనంత కాలముండదు తిరిగి దర్శనమివ్వడానికి. ఈ రోగనివారణకై ఔషధ సంపాదనార్థమై మానవుడు చేయరాని పనులుండవు. పడరాని పాట్లుండవు. జానెడు పొట్టను సంతృప్తిపరచే కార్యక్రమంలో కొన్ని జన్మలే వృథా అయిపోయాయి.

ఆకలి ఒక విచిత్రమైన వ్యాధి. దీనికి తాత్కాలిక చికిత్సేగాని శాశ్వత చికిత్సలేదు. ఉపశమనమేగాని సంపూర్ణముగా నయంకాదు. ఆకలి కనుపించగానే చికిత్సపొంది జీవించాలి. ఆహారమును భుజించుటయే చికిత్స. ఆహారమే ఔషధము ఔషధమును తగుపాళ్ళలో వాడినపుడే ఆరోగ్యం కుదుటపడుతుంది. మితిమీరి సేవిస్తే చితిజేరి నిద్రించాల్సి వస్తుంది.

ఆహారమును ఔషధంలాగా స్వీకరించాలి. ఎలా స్వీకరించాలి? ఎంత స్వీకరించాలి? ఒక్కసారికి ఎంత మోతాదులో తీసుకోవాలి.

"యుక్తాహార విహారస్య"

మితమైన ఆహార విహారాదులు కల్గియుండమని భగవద్గీత ఆత్మసంయమ యోగములో తెలియజేయబడింది. మితమైన ఆహారము అనగా ఏమిటి? దీని వివరణను వేదము తెలియచేయుచున్నది.

"ఆత్మా సమ్మిత మన్నింతదవతి. తన్నహినస్తి
యద్భూయోహినస్తి తద్యత్క నీయోనత దవతి"

"శరీరమును కాపాడుకొనుటకు అవసరమైన అన్నమును భుజించినచో సాధకునికి క్షేమకరము. దానివలన చెడుపు వుండదు. ఎక్కువ భుజించినను, తక్కువ భుజించినను అనర్థము వాటిల్లును" అని వేదము తెలియచేయుచున్నది.

ఎక్కువ భుజించినను, తక్కువ భుజించినను దానివలన కీడే జరుగుతుంది. యోగ నిష్ఠకుదరదు. అల్పభోజన ఫలిత నీరసము రెండూ

అవాంఛనీయమే. ఈ ఆహారభేదాలు నిద్రాభేదాలు తెచ్చిపెడుతున్నాయి. తద్వారా రజోగుణ తమోగుణాలు వృద్ధి చెందుతాయి. రజోగుణ తమోగుణాలు వృద్ధి చెందడమువలన సత్త్వగుణము క్షీణిస్తుంది. కానీ సాధకులు సత్త్వగుణ ప్రధానులై యుండాలి. సత్త్వగుణము లోపించగానే మనసు కలత చెందుతుంది. సాధన కుంటుపడుతుంది. కనుక ఆహార విషయంలో సాధకులు జాగరూకులై వర్తించాలి. ఆహారమును ఔషధంలాగా సేవించాలి.

"పూరయే దశనే నార్థమ్ తృతీయ ముదకేనతు
వాయోస్సంచారణార్థాయ చతుర్థ మవశేషయేత్ ॥"

సగము పొట్టను అన్నముతో నింపాలి. మిగత సగములో ఒక భాగమును నీటితో నింపాలి. మిగిలిన నాల్గవ భాగమును గాలి సంచారమునకై వదలి పెట్టాలని శాస్త్రనిర్ణయము.

క్షుద్రోగానికి ఆహార ఔషధమును సేవించాలని తెలుసుకున్నాము. మరి ఔషధము సేవించునపుడు అనుపానముగా పథ్యము వుండాలి కదా? ఆకలి రోగానికి ఆహార ఔషధమును సేవిస్తూ అనుసరించవలసిన పథ్యమేమిటి? ఉపవాసమే పథ్యము.

అప్పుడప్పుడు ఉపవాసము చేస్తుండాలి. అదియే పథ్యము జీర్ణాశయము కూడా ఒక యంత్రము లాంటిది. దానికి విశ్రాంతి అవసరము ఉపవాసముండుట ద్వారా జీర్ణాశయానికి విశ్రాంతి కల్గిస్తుండాలి. ఉపవాసము మనిషికి ఆరోగ్యమును కల్గిస్తుంది. మనసుకు ఉత్తేజమును అందిస్తుంది.

కొందరికి ఉపవాసమంటే మృత్యుముఖంలో ప్రవేశించినట్లే వుంటుంది. అలాంటి భీమసేన వంశీయులు ఉపవాసము అనారోగ్యహేతువని, ఆహార మార్పులు చేసుకుంటూ, యుక్తమైన జీవనాన్ని సాగించడమే తమ కలవాటని ప్రగల్భాలు పలుకుతుంటారు. మనమెంత దీక్షతో యున్నను యుక్తమైన

జీవనాన్ని కొనసాగించలేము. అందుచేత అప్పుడప్పుడు ఉపవాస ముండుటయే శ్రేయోదాయకము.

ఆధ్యాత్మిక సాధకుల ఆరోగ్య సుస్థిరతకు ఉపవాస మనునది ఒక దివ్యాస్త్రము. ఈ విషయంలో అన్ని మతాలు ఏకీభవించాయి. ఏసుక్రీస్తు నలభైరోజులు ఉపవాసమున్నట్లు తెలుస్తున్నది. మహమ్మదు తన అనుయాయులను ఉపవాసము చేయమని ఉపదేశించాడు. బుద్ధభగవానుడు చాలాకాలం ఉపవాసము చేసి నడవను కూడా నశక్తుడై బలహీనమైనట్లు ఆయన జీవిత కథ వివరించుచున్నది. సరే ఇక మన విషయము చెప్పనవసరంలేదు. ఏకాదశి ఉద్యోగ నిర్వహణ ఉపవాసమే.

కనుక యుక్తాహార ఔషధ సేవనము ద్వారా ఆకలి వ్యాధిని పోగొట్టుకోవాలి. మరి ఔషధమును ఎలా సంపాదించాలి? అనే విషయాన్ని రాబోవు సోపానములో తెలియచేయుచున్నారు.

26. భిక్షౌషధ సేవనం (Take the medicine of Aims daily) :-

ప్రతిదినము భిక్షౌషధ సేవనము ద్వారా క్షుద్రోగమును నివారింపచేసుకొనుమని ఆచార్యుల వారు తెలియచేయుచున్నారు. ఆకలి వ్యాధికి ఆహారమే ఔషధమని గడచిన సోపానము ద్వారా గ్రహించాము. అట్టి ఆహారమును భిక్షాటన ద్వారా గ్రహించమని ఆచార్యులు తెలియచేయుచున్నారు.

సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులు ఐదు ఇండ్లకు మాత్రమే భిక్షకు వెళ్లి తద్వారా లభించిన ఆహారమును భుజించి మననశీలురై యుండవలయునని నిర్దేశము. భిక్షాన్నముపై ఆధారపడి జీవిస్తున్నందున వారికి బాధ్యతలు మిగలవు. అంటే సన్యాసి బాధ్యతారహిత జీవనమును కొనసాగిస్తాడని దాని భావం కాదు. ప్రాపంచికమైన బాధ్యతలన్నీ త్యజించి సదా భగవచ్చింతనయందు మనసును లగ్నంచేసి యుంటాడు. అందుచేతనే అతని త్యాగపూరిత పవిత్ర కర్తవ్యమును గ్రహించిన గృహస్థులు సన్యాసులకు భిక్షనిచ్చి గౌరవిస్తుంటారు.

మరి ఈ సన్యాసి ఆత్మానుభూతిని పొందియున్నాడా? లేక పొందడానికి తీవ్రకృషి సల్పుతున్నాడా? ఎంతవరకు ప్రగతిని సాధించాడు? అది గృహస్థులకు అనవసరం. అది అతనికి భగవంతునికి సంబంధించిన విషయం. ఆంతరంగికానుభూతికి సంబంధించిన విషయం. మధ్యలో ఎవ్వరూ ప్రవేశించడానికి వీలు లేదు. ప్రభుత్వమువారు ఒక శాస్త్రజ్ఞుడు చేయు ప్రయోగాన్ని గుర్తించి అతనిపై పెట్టుబడి పెడుతారు. శాస్త్రజ్ఞుడు ప్రయోగశాలలో పని చేస్తుంటాడు. ప్రయోగము ఫలించేసరికి కొంతకాలం పడుతుంది. చివరలో ప్రయోగము ఫలించవచ్చు. లేదా నిష్ఫలం కావచ్చు. ఫలించినచో శాస్త్రజ్ఞుని ప్రభుత్వం సన్మానించవచ్చు. ఒకవేళ నిష్ఫలమైనచో ఫలించలేదని అతనిని అవమానించి కారాగారంలో ఉంచరు. ప్రయోగము ప్రయోగమే. అలాగే శాస్త్రజ్ఞుడు బాహ్య ప్రయోగశాలలో ప్రయత్నించినట్లు, సన్యాసి ఆంతర్య ప్రయోగశాలలో పనిచేస్తుంటాడు. శాస్త్రజ్ఞుణ్ణి వదలినట్లే తత్త్వవేత్తను వదలిపెట్టాలి. ప్రయోగము చేయు సందర్భాలలో శాస్త్రజ్ఞుని పలకరించి ప్రయోగ ఫలితాలడగడము ఎంత అనుచితమో, సన్యాసి విషయంలో కూడా అంతే. ఫలితాలు లభించగానే తోటి ప్రాణుల సుఖమును వాంఛించి శాస్త్రజ్ఞుడు తెలియజేయునట్లు, అనుభూతిని పొందగానే సన్యాసి కూడా జీవకారుణ్య బుద్ధితో సమాజానికి సేవచేస్తాడు. అంతవరకు సమాజమతనికి భిక్షపెడుతూ పోషిస్తుంది. అది మన సనాతన ధర్మ జీవనంలో త్యాగనిరతి.

"భిక్షాన్న మాత్రేణ చ తుష్టి మన్తః"

"భిక్షాన్నము చేత తృప్తిచెంది జీవించువాడే నిజమైన భాగ్యవంతు"డని శ్రీ శంకరులు యతి పంచకములో తెలియచేశారు.

అయితే ప్రతిదినము భిక్షాన్న ఔషధ సేవనముచే ఆకలి వ్యాధిని పోగొట్టుకొనుమని చెప్పుట కేవలము సన్యాసి నుద్దేశించి వెలిబుచ్చిన అభిప్రాయమే గాని గృహస్థులకు సంబంధించినది కాదని భావించకూడదు.

సన్యాసికి గృహస్థుల నుండి భిక్ష లభిస్తుంది. గృహస్థులకు భగవంతుడే భిక్ష నందించువాడు. తాము భుజించు ఆహారము భగవంతుడిచ్చిన భిక్షయేనని

గ్రహించి ప్రసాద బుద్ధితో ఆహారాన్ని స్వీకరించాలి. అలా చేసినచో ఆకలి వ్యాధిని పోగొట్టుకొనుటయే గాక, ప్రసాద మనస్తత్త్వముతో మానసిక ప్రశాంతతను పొందే అవకాశము కూడా గృహస్థులకు కలదు.

అయితే సన్యాసి భిక్షాన్నమును ఔషధంగా సేవిస్తాడు. ఔషధము రోగమును నయం చేసేందుకే గాని రుచికి కాదు. కనుక ఆహారమును ఔషధంలా సేవించే సన్యాసి రుచిని వాంఛించ కూడదు. అలాగే గృహస్థుడు భిక్షాన్నమును ప్రసాదంలా స్వీకరిస్తున్నందున, ప్రసాదమును ప్రసాదముగా స్వీకరించాలేగాని, రుచిని కోరకూడదు. ఈ విషయాన్ని రాబోవు సోపానములో శ్రీ శంకరులు తెలియజేస్తున్నారు.

27. స్వాద్వన్న అనాసక్తి; (Beg not for delicious dish) :-

రుచికరమైన ఆహారమును కోరవలదని శ్రీ శంకరులు తెలియజేయుచున్నారు. రుచిగాని, అరుచిగాని జిహ్వకు సంబంధించినవి కావు. రుచి చూసేందుకు నాలుకగాని, రుచిని వాంఛించేది నాలుక కాదు. రుచులు, అభిరుచులు అన్నీ మనసుకు సంబంధించినవే. మనస్సులో నిండియున్న వాసనలే అభిరుచుల రూపంలో సంకల్పాలుగా చెలరేగుతుంటాయి. అందమైన రూపాలను చూడాలని, శ్రావ్యమైన శబ్దాలను వినాలని, పరిమళ భరితమైన పుష్పసుగంధాలను ఆఘ్రాణించాలని, సున్నితమైన స్పర్శ ననుభవించాలని, రుచికరమైన పదార్థములను చవిచూడాలని మనస్సు ఉబలాటపడుతుంటుంది. మనసులో నిండియున్న వాసనల కనుగుణ్యమైన పదార్థాలే జిహ్వకు రుచికరంగా ఉంటాయి.

రుచికరమైన ఆహారమును కోరవలదని ఆచార్యులు ప్రబోధిస్తున్నారు. పదార్థములపై మనకున్న అభీష్టము రుచిని అందిస్తే అయిష్టము అరుచిని చిందిస్తున్నది. ప్రతిపదార్థము రుచికరముగా నున్నట్లే భావించి భుజించినచో మనసులోని వాసనలు నిర్వీర్యమవుతాయి. వాసనలు నశించగానే రాగద్వేషాలు అంతరించిపోతాయి. భేధభావము సమసిపోతుంది.

ఆహారమును భోగానుభవము కొరకు గాక ఔషధంగా సేవించి యోగ సాధన కుపకరించే విధంగా స్వీకరించడం అలవాటు చేసుకోవాలి. రుచిని వాంఛించకుండా భుజించుట వలన మనసులో శుచి ఏర్పడుతుంది. మనసు ఎప్పుడయితే శుభ్రపడిందో సాత్త్విక సంకల్పాలు కదులుతాయి. ఆత్మ విచారము మొదలవుతుంది. కనుక మనము గడించే అనుభవములలో ప్రతి విషయంలోనూ జాగ్రత్త వహించగలిగినచో అది ఆత్మానుభవమునకే దారి తీయగలదు. సదాచార జీవనము అలవడనిదే సర్వాత్మ భావము కలుగదు.

రుచికరమైన ఆహారమును కోరవలదని తెలియజేస్తూ మరి ఎలాంటి ఆహారమును భుజించి జీవించాలో తరువాత సోపానములో ప్రబోధిస్తున్నారు.

28. సంతుష్ట జీవనము (Be content with what thou obtainest by chance):-

ప్రారబ్ధవశాత్తు లభించిన దానితో తృప్తిచెందమని పూజ్యపాదులు బోధిస్తున్నారు. కర్మలు నాలుగు విధాలుగా వుంటాయి. అవి (1) సంచిత కర్మలు (2) ప్రారబ్ధకర్మ (3) క్రియామానకర్మ (4) ఆగామి కర్మలు

గత జన్మలలో మన మాచరించిన కర్మలకు సంబంధించిన పాప పుణ్యాలు సూక్ష్మమైన వాసనల రూపంలో ఉంటాయి. అవే సంచిత కర్మలు. గత జన్మలోని పాపపుణ్యాల జాబితా ననుసరించి ఈ జన్మలో ఫలితాలు అందుతుంటాయి. అదియే ప్రారబ్ధకర్మ. ఈ ప్రారబ్ధకర్మ ననుభవిస్తూ ఈ జన్మలో నూతనంగా మరికొన్ని కర్మలాచరిస్తాము. అవి క్రియమాన కర్మలు. ఈ క్రియమాన కర్మలయొక్క ఫలితాలు రాబోవు గతికి అనుభవ విషయాలైయుంటాయి. ఇదియే ఆగామికర్మ.

ఈ జన్మలో మానవుడనుభవించు సుఖదుఃఖాలన్నీ ప్రారబ్ధాధీనమై యున్నవి. ప్రారబ్ధమును ఎవ్వరూ దాటలేరు. ప్రారబ్ధాన్ని జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ అనుభవించాల్సిందే. అజ్ఞాని దేహాత్మభావంతో జీవిస్తుంటాడు. కనుక ప్రారబ్ధసుడిగాలికి నిలువలేక సుఖదుఃఖాల మధ్య పండుటాకువలె

కదులుతుంటాడు. జ్ఞాని ఆత్మవిదుడై యున్నందున ప్రారబ్దము ననుభించవలసింది, దేహేంద్రియ మనోబుద్ధులేగాని తానుకాదని భావించి ప్రశాంతంగా జీవిస్తుంటాడు. కర్మచేసినవాడే ఫలితాల ననుభవించాలి. ఆత్మయైన తాను నిష్క్రియుడు గనుక తనకు కర్మాచరణ సాధ్యపడదు. కర్మ తాను ఆచరించలేదు గనుక ఫలితానుభవము కూడా తనది కాదు. అహంకారమే కర్మ నాచరించింది. అహంకారమే ఫలితాన్ననుభవిస్తుంది. కర్తృత్వ భోక్తృత్వా భిమానాలు రెండూ నాకు లేవు యని జ్ఞాని స్థిమితంగా యుంటాడు.

మరి సాధకుడెలా జీవిస్తాడు? జ్ఞానిలా తటస్థంగా ఉండలేడు. అజ్ఞానిలా కర్మఫలాలయందు రమించలేడు. మరి అతడేమి చేయాలి? ఆ విషయాన్నే ప్రస్తుతము ఆచార్యులు తెలియజేయుచున్నారు. సాధన పంచకము సాధకుని కొరకే రచించడము జరిగింది. సాధన నెరుకపరచే సాధన పంచకము సిద్ధత్వము నొందిన జ్ఞానికి అవసరములేదు. అజ్ఞాని సాధన నాచరించడు. కనుక అతనికీ అవసరము లేదు. కనుక సాధకుని కొరకే ప్రత్యేకంగా రచించబడిన ఈ సాధన పంచకములో సాధకునికి పూజ్యపాదులు మార్గం తెలియచేస్తున్నారు.

ప్రారబ్దవశాత్తు లభించిన దానితో సంతృప్తి చెంది జీవించమని భగవత్పాదులు ప్రబోధిస్తున్నారు. మనము అనుభవించు మంచి చెడులకు ప్రారబ్ధమే కారణము. ప్రారబ్ధము ననుసరించియే మనకు శుభాశుభములు ప్రాప్తిస్తాయి. అవియే కర్మఫలాలు. కర్మఫలాలను ఎవ్వరూ తప్పించుకోలేరు. కర్మఫలాల నిచ్చువాడు భగవంతుడు. భగవానుని అమృత హస్తములు అందించే కర్మఫలాలను ప్రసాదబుద్ధితో స్వీకరిస్తూ, ప్రారబ్ధమును అవగాహనతో ప్రశాంతంగా అనుభవిస్తూ జీవించమని బోధిస్తున్నారు. అలా జీవించడము వలన ప్రారబ్ధము కరిగిపోతుంది. ప్రారబ్ధ సంబంధిత వాసనలు క్షాళన మవుతాయి. అంతఃకరణ శుద్ధిపొందుతుంది. ఆసక్తిలేని భోక్తృత్వము నూతన వాసనలను తయారుచేయదు. కనుక ఆగామి కర్మ తయారుకాదు. రుచికరమైన పదార్థములను కోరవద్దని తెలియజేస్తూ, అనగా మనోప్రేరిత వాంఛలకు

దూరంగా వుండమని బోధిస్తూ అలా జీవించుటకు ప్రధానమార్గము ప్రారబ్ధవశాత్తు నాకీ శుభాశుభములు కలుగుతున్నవని భావిస్తూ, అనుభవిస్తూ ప్రశాంతంగా జీవించడమేనని పూజ్యపాదులు తెలియజేస్తూ, మనోజనిత రుచుల్ని జయించినట్లే శరీర జనిత శీతోష్ణాదులను కూడా అవగాహనతో జయించమని తరువాత సోపానములో తెలియజేస్తున్నారు.

29. ద్వంద్వసహనము (Endure the pairs of opposites such as hot and cold) :- శీతోష్ణాది ద్వంద్వములయందు సహనశీలివై యుండమని బభగవత్పాదులు తెలియజేస్తున్నారు. శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానావమానములు, జయాపజయములు ద్వంద్వములని పిలువబడుతాయి. శీతోష్ణములు శారీరక స్థాయిలో అగుపిస్తాయి. సుఖదుఃఖాలు మనోస్థాయిలో గోచరిస్తాయి. మానావ మానాలు బుద్ధిస్థాయిలో కనుపిస్తాయి. శారీరక మనోబుద్ధుల ద్వారా మానవుడు నిత్యము శీతోష్ణాది ద్వంద్వముల ననుభవిస్తూ విషాదానందాల మధ్య నలిగిపోతుంటాడు.

ద్వంద్వాలకు సంగత్వమే మూలము. దేహ సంగత్వమువలన "దేహమే నేను" అను భ్రాంతి ఏర్పడింది. సర్వానర్థములకు ఈ దేహాత్మభావమే మూలమైంది. దానికి అహంకార జలమును పోయడముచేత అజ్ఞాన వృక్షము శాఖోపశాఖలై విస్తరించింది. దేహము నేనని భావించుటయే అజ్ఞానము. ఎప్పుడయితే నేను శరీరమనే భావన కలిగిందో తత్ఫలితంగా వెంటనే దేహ సంబంధమైన శీతోష్ణాది ద్వంద్వములను అనుభవించాల్సిన అగత్యమేర్పడింది. కనుక అహంకారమును తుదముట్టించినచో అజ్ఞానం అంతం కాగలదు. అజ్ఞాన వృక్షానికి అహంకార జలము పోయడము వలన వృక్షము శాఖోపశాఖలై పెరిగింది. అలాగాక ఆత్మ జ్ఞానమనే నత్రికామ్లమును కొన్ని చుక్కలు చెట్టు మొదట్లో వేసినచో వృక్షమే నశించిపోతుంది. నశించిన వృక్షము ఫల పుష్పఛాయాదులను అందించే ప్రసక్తిలేదు. ఆలాగే ఆత్మజ్ఞానమువలన నశించిన అజ్ఞానవృక్షము శీతోష్ణాది ఫల పుష్పఛాయాదులను అందించే

సమస్యే వుండదు. కనుక ఆత్మజ్ఞానము చేతనే ద్వంద్వాతీతుడవు కావాలి. సాధకుడు సదా ఆత్మానుసంధానము చేయుటచేత ఆత్మవిదుడు కాగలడు.

ఆత్మస్థాయిలో ద్వైతములేదు. సుఖదుఃఖాలు ఏర్పడవు. మానావమానాలు చెలరేగవు. శీతోష్ణాలు చిగురించవు. "అహమే వేదగ్ం సర్వం" సర్వము తన రూపముగానే దర్శించుటకు యత్నించే సాధకునికి భేదభావము పొడసూపదు. అందరిని సమముగానే వీక్షిస్తాడు. తనకు నీళ్ళుపోసి పెంచిన వానిని ప్రేమించి తన కొమ్మలను నరికిన వానిని చెట్టు ద్వేషించదు. ఫలపుష్పాదులను అందరికీ అందిస్తుంది. నిజమైన సాధకుడు వృక్షముకన్నా ఉత్తమ సహనము కల్గి యుంటాడు. జడమైన వృక్షసహనములో బాధ బహు తక్కువ. కానీ సాధకుడు చైతన్యము. అయినను వృక్షముకన్నా అనేక రెట్లు మిన్నగా సహనమును కల్గియుంటాడు. ద్వంద్వములను సమంగా వీక్షించు సాధకుడు త్వరలో ఆత్మవిదుడవుతాడు.

ఆత్మానుభవమును వాంఛించు సాధకుడు సదా ఆత్మను గురించి చింతిస్తూ వుండాలి. వృథా ప్రసంగాలు చేయకూడదు. ఈ విషయాన్నే రాబోవు సోపానములో తెలియచేస్తున్నారు.

30 వ్యర్థ ప్రసంగ విరమణ **(Indulge not in Idle gossiping) :-**

సాధకుడు వృథా ప్రసంగములు చేయరాదని శ్రీ శంకరులు సూచిస్తున్నారు. సాధకుడు అనవసర ప్రసంగముల జోలికి పోకూడదు. ప్రాపంచిక విషయ వాసనా ప్రభావం వ్యక్తిపై పడుతుంది. "ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తే షూపజాయతే" "విషయ చింతనద్వారా సంగత్వము ఏర్పడి, తద్వారా కామ క్రోధాలు జనించి తానే నశించే స్థితికి దారితీయు"నని శ్రీ కృష్ణ పరమాత్మ స్థితప్రజ్ఞ లక్షణాలలో తెలియజేసి యున్నారు.

ఆసక్తితో మనము చేయు ప్రసంగాలు మనస్సులో అభిరుచుల్ని కల్గించి కర్మాచరణకు పురికొల్పుతాయి. కనుక సాధకుడు ఆధ్యాత్మిక విషయాలే చర్చించాలి. విషయ చింతన చేయకూడదు.

విశ్రాంతి సమయాలలో వృథా చింతన ద్వారా కాలాన్ని హరింప చేసుకోకూడదు. పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం బాగా మనపై పడుటచేత ఈనాడు చాలామంది చదువుకున్న అజ్ఞానులు కాలాన్ని చంపుతున్నామని పలుకుతుంటారు. కాలాన్ని నీవు చంపడం వలన కలిగే పరిణామమేమిటి? మనం కాలగర్భంలో కలిసిపోవుటయే. కనుక కాలాన్ని చంపకూడదు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అందుచేతనే మనం కాలక్షేపమని భావగర్భితంగా పలుకుతూంటాము. సద్విషయ చింతనలో కాలమును సద్వినియోగం చేసుకోవాలి.

సత్పురుషుల సాంగత్యములోనో, సద్గ్రంథ పఠనములోనో, జపధ్యానాదులయందునో కాలం గడుపుతుండాలి. సాధకుడు కుళ్ళిపోయిన రాజకీయాలవైపు దృష్టి మరల్చి ప్రసంగించకూడదు. అశ్లీల భాషణము చేయరాదు. వినరాదు కూడా.

"స్త్రీ, ధన, నాస్తిక వైరి చరిత్రం న శ్రవణీయం"

స్త్రీలయొక్కయు, ధనము యొక్కయు, నాస్తికులయొక్కయు, శత్రువుల యొక్క విషయాలు సాధకుడు వినకూడదు. మాట్లాడకూడదని నారద భక్తి సూత్రాలలో తెలియచేయబడింది.

"భక్తి శాస్త్రాణి మననీయాని తదుద్బోధక కర్మాణి కరణీయాని"

భగవత్సంబంధమైన గ్రంథాలను పఠించి, అందు తెలియచేసిన విషయాలను మననం చేసి ఆచరించాలి.

గురువులతో సంభాషణలు చేయాలి. అక్కడ కూడా నీవు అధిక ప్రసంగివి కాకూడదు. అవసరమైన విషయాలే గురువులవద్ద చర్చించాలి. అవి కూడా ఆధ్యాత్మికమైన విషయాలుగానే యుండాలి. నీ కుటుంబ విషయాలన్నీ గురువులవద్ద చర్చించి వారి బుర్రలో నీ వాక సమస్యగా మిగలకు. నీ వ్యక్తిగత విషయాలన్నీ దీర్ఘ ఉత్తరాలలో నింపి దూరంగా నున్న మహాత్ములకు పంపకు.

ఇవన్నీకూడా అధికప్రసంగం క్రిందికే వస్తాయి. నీ నుండి పొంగి పొరలివచ్చే మాటలు నిన్ను మూగవాణ్ణి చేస్తాయన్న సుందర మందారాలలోని సూక్తిని మరచిపోకు.

నీకు విశ్రాంతి ఎక్కువగా వుంటే దానిని సద్వినియోగం చేసుకో. సేవా కార్యక్రమాలు చేపట్టు. అయితే ఒక్క విషయంలో జాగ్రత్తగా వుండు. నీవు చేసే సేవలో నీ మనసు నీతోనే యుంటుంది. ఏ క్షణాన్నయినా నిన్ను దారి మళ్ళిస్తుంది. పదవుల పోరాటంలో పడదోస్తుంది. ఆ తరువాత ఆధ్యాత్మికంగా నామరూపాలు లేకుండా పోతావు. కీర్తి ప్రతిష్ఠల కొరకు బోర్డులు తగిలించుకొని గుడ్డలుమాయకుండా సంఘసేవయంటూ పత్రికల్లో హెూదాలు ప్రకటించుకొనే సంస్థల స్థాయికి నీవు ఎదగాల్సిన అవసరం లేదు. అవన్నీ అహంకార ప్రదర్శనలు. పరస్పర గౌరవాభివందన సూచకాలు. అవి సంఘాలు కావు. సేవపేరుతో అహంకారాన్ని బహిరంగంగా సిగ్గువిడచి ప్రదర్శించుకునే దుర్యోధన ఆస్థానాలు. పేపర్లో పడితేగాని పైసా దానం చేయరు. ఫొటో తీస్తేగాని ఎండకు కాలిపోతున్న పేదవాడి శరీరంమీద నాలుగు మూరలగుడ్డ కప్పరు. సన్మానం చేస్తేగాని పేదపిల్లలకు పాలు పోయరు. ఈ సంఘాలు ఆకాశానికెదగనీ, మనకు బాధలేదు. ఈ సంఘ సేవకుల్ని విమానాల్లో తిరగనీ, మనకు ద్వేషం లేదు. మన విషయ మనం ఆలోచించుకుందాం. నీవు సేవకుడివి. అట్టి భావమున్నపుడే సాధకుడవుతావు. పేరు ప్రఖ్యాతులు మన కవసరంలేదు. పది కట్టెలు మోసే వాడి తలనుండి రెండుకట్టెలు దించగలవేమో ఆలోచించు. ఏమి చేశావని భగవంతుడు అడగడు. ఎలా చేశావని ప్రశ్నిస్తాడు. త్యాగంతో కర్మలుఆచరించు. మాటలు మూగబోనీ, చేష్టలు మాటలాడనీ. తోటి మనిషిని దైవంగా భావించి సేవచేయి. నీ జీవన సౌరభమే భగవంతుని నీ వద్దకు తీసుకొని వస్తుంది.

ఇవన్నీ జరగాలంటే నీవు వ్యర్థ ప్రసంగం మానాలి. ఆధ్యాత్మిక భాషణే అలవరచుకో. మాట్లాడటానికి మాటలే అవసరంలేదు. మౌనము మాటలకన్నా గంభీరంగా మాట్లాడగలదు. స్వేచ్ఛగా సంచరించే పక్షులతో భాషించడం

నేర్చుకో. అమాయకంగా నిలబడియున్న మేకపిల్ల నిర్మలదృష్టిలో పాఠాలు చదవడం అలవరచుకో. నీటిలో కదిలే చేపపిల్లను చూచి నవ్వడమెలాగో అభ్యాసము చేసి చూడు. మేఘావృతమైన ఆకాశములోని గంభీరతయేమిటో ప్రశ్నించి మరీ తెలుసుకో. నిర్మల ఆకాశంలో నిండియున్న శాంతికి నీకు ఏమన్నా చుట్టరికముందేమో అడుగు.

మనసును సరిచేసుకుంటే జీవితాన్ని నందనోద్యానంగా తీర్చి దిద్దుకో గలవు. ఆలోచనలను సక్రమమార్గంలో నడిపిస్తే ఆనందపుష్పాలను అందుకోగలవు. మరి వ్యర్థ ప్రసంగముతో బ్రతుకును వమ్ము చేసుకోవడ మెందుకు? మాటలు మూగబోనీ చేష్టలు మాటలాడనీ.

ఇక్కడ మనకొక సందేహమొస్తుంది. మనము ప్రాపంచిక వ్యక్తులతో వృధాకాలయాపన చేయము. వ్యర్థ ప్రసంగాలు సాగించము. మరి మనం సంఘంలో ఉన్నాము కదా! ఇతరులనుండే మనకు సమస్యలు తయారుకావచ్చు. అప్పుడు ఏం చేయాలి? ఈ సమస్యకు తరువాత సోపానములో ఆచార్యులు పరిష్కారము నందించుచున్నారు.

31. ఉదాసీన వైఖరి (Be indifferent) :-

ఉదాసీనుడవై మెలగమని భగవత్పాదులు బోధిస్తున్నారు. ఈ ప్రపంచమొక విచిత్రమైనది. పరిసరాలు అంతకన్నా విచిత్రమైనవి. మనకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడినచో ప్రశాంతంగా జీవించగలము. కానీ పరిస్థితులలా వుండవు. నిరంతరము పరిణామం చెందుతుంటాయి. పరిస్థితులు బాగులేవని ఏకరువు పెడితే ఉపయోగములేదు. మనము ఎక్కడికెళ్ళినా వ్యతిరేకపరిస్థితులు కొద్దోగొప్పో వుండనే వుంటాయి. వాటిమధ్య చాకచక్యంతో జీవించడం అలవరచుకోవాలి. ప్రశాంతతను పోగొట్టుకోకుండా జీవించడం అలవాటు కావాలి. ఆశ్రమాల కెళ్ళినా అక్కడకూడా కొన్ని శ్రమలు మనకొరకు ఎదురుచూస్తూనే వుంటాయి. కనుక నీకు కావలసిన రీతుల్లో ప్రపంచముండదు. నీకు అవసరమైన ప్రపంచాన్ని మానసికంగా

తయారుచేసుకోవడమే దానికి మార్గము. ప్రతికూల వాతావరణంలో బాహ్య ప్రపంచానికి ఉదాసీనుడవై, మనోప్రపంచాన్ని తయారు చేసుకొని సాధకుడు అనుభవించి ఆనందించగలగాలి.

మనస్సులో ఉదాసీన్యం ఏర్పడాలి. మనస్సులోని సంకల్పాలను మనం చూస్తున్నాము. కనుక మనము మనస్సుకన్నా భిన్నమైన వారము. మనసులో కలిగే సంకల్పాలను, ఉద్రేకాలను సాక్షిగా వీక్షించడముచేత ఉదాసీనత ఏర్పడుతుంది. సాక్షిగా వీక్షించడము చేత ప్రాపంచిక విషయ వాసనా రాహిత్యం జరుగుతుంది.

సుఖదుఃఖాలు కలిగినపుడు సాధకుడు ఉదాసీనుడై మెలగాలి. సుఖాలు గాని దుఃఖాలుగాని, వచ్చినవి వచ్చినట్లే వుండవు. వస్తూపోతూ వుంటాయి. సుఖం తరువాత దుఃఖము, దుఃఖము తరువాత సుఖము చక్రభ్రమణంలా తిరుగుతూనే వుంటాయి. వర్షాకాలంలో ఆకాశాన మేఘాలు క్షణంలో కనుపించి క్షణంలో మాయమగునట్లు, మనో గగనంలో సుఖ దుఃఖ మేఘాలు అలా కనిపిస్తుంటాయి. కనుమరుగవుతుంటాయి. కనుక సాధకుడు సుఖానుభూతిలో పొంగిపోకుండా, దుఃఖానుభూతిలో క్రుంగిపోకుండా ఉదాసీనంగా ఉండటము అలవరచుకోవాలి. శారీరకస్థాయిలో జనించు జరావ్యాధులకు మనోస్థాయిలో జనించు సంకల్ప వికల్పాదులకు బుద్ధిస్థాయిలో జరుగు నిర్ణయాలకు, పరిసర ప్రమాదాలకు, పరిస్థితుల ప్రభావాలకు సాక్షిగానుండి వీక్షించడమే ఉదాసీనత్వము.

శారీరక మనోబుద్ధులతో తాదాత్మ్యం చెందియున్నంతకాలము సాధకుడు ఉదాసీన జీవనం గడుపలేడు. వాటికి సాక్షిలా యున్నపుడే ఉదాసీనంగా వుండగలడు. న్యాయస్థానంలో వాదించే న్యాయవాదికి ఆలకించే న్యాయాధికారికి ఎంతో తేడావుంది. న్యాయవాదిలో ఉద్రేకాలు ఆందోళనలు వుంటాయి. నిందితునితో తాను ఏర్పరచుకున్న సంబంధమే ఆ యావేదనకు కారణము. న్యాయాధికారిలో ప్రశాంతత, ఆలోచన చోటుచేసుకొని యుంటుంది.

న్యాయాధికారికి అక్కడ జరుగు వ్యాజ్యములో యున్న ఉదాసీనతయే అతని నిర్మలత్వానికి కారణము.

సాధకుడు ఉదాసీనుడై యుండాలి. మనసులో నడిచే సంకల్పాలకు ఉదాసీనంగా ఉండుట యనగా ఆధ్యాత్మిక సత్యావలోకనకు కూడా దూరంగాయుండుటయా యనే శంక కొందరిలో తలెత్తే అవకాశము లేకపోలేదు. అట్టి సందేహములను నివారించుటకై

"తస్మిన్ అనన్యతా తద్విరోధిషు ఉదాసీనతా చ"

భగవంతునియందు అనన్య భక్తికలిగి, తద్విరోధ విషయములయందు ఉదాసీనవైఖరి నవలంబించ వలయునని నారద భక్తిసూత్రాలలో తెలియ జేయబడింది. భగవద్గీత –12వ అధ్యాయము భక్తి యోగములో శ్రీకృష్ణ పరమాత్మ తెలియజేసిన భక్తుని ముప్పదియారు లక్షణాలలో ఉదాసీన వైఖరిని కూడా తెలియజేసియున్నారు. కనుక సాధకుడు నిరంతరము బ్రహ్మ చింతనయందే కాలం గడుపుచూ అన్య విషయముల యందు ఉదాసీనుడై జీవించాలి.

32. శుభాశుభ పరిత్యాగము (Rise above people's favour or scorn)

ఇతరుల కరుణను, క్రౌర్యమును రెండింటిని ఉపేక్షించమని ఆచార్యులు తెలియజేయుచున్నారు. సమాజంతో సంబంధము లేనిదే మానవుని మనుగడ కొనసాగదు. సంఘములోని వ్యక్తులు విభిన్న మనస్తత్వాలతో, అభిరుచులతో యుంటారు. మన ప్రవర్తన, మనభావాలు కొందరికి నచ్చుతాయి. వారు మనలను మెచ్చుకుంటూ మనపై కరుణను చిందిస్తారు. మరికొందరికి మన భావాలు నచ్చవు. వారు మనలను అసహ్యించుకుంటూ క్రౌర్యమును చూపుతారు. ఈ రెండింటికి సాధకుడు చెదరకుండా వుండాలి. అనగా రెండింటిని ఉపేక్షించాలి.

మనలను ఇతరులు మెచ్చడమనేది వారి మనోభిప్రాయాలపై ఆధారపడి ఉండునపుడు, వారు మనలను ఇష్టపడటమువలన కలిగే సంతృప్తి శాశ్వతముగా

యుంటుందని చెప్పలేము. వారి మనసు మారుతూ యుంటుంది. దానితో పాటు వారి అభిప్రాయలు కూడా మారుతుంటాయి. వారి అభిరుచులకు భిన్నంగా మనం గోచరించినపుడు తెగపొగిడిన నోర్లే తెగ విమర్శిస్తాయి. ఆధ్యాత్మిక రంగములో ఇది మెండుగ కన్పిస్తుంది. ఆధ్యాత్మిక సాధకుడు ఆంతరంగిక పరిణామంతో జీవిస్తుంటాడు. అతని ప్రతిభ లౌకికుల కర్థము కాదు. ప్రక్కన చేరుతారు. నీయంతటి వాడు లేడని పొగిడేస్తారు. కొంతకాల మయ్యేసరికి చనువు ఏర్పడుతుంది. అక్కడనుండి తమ సంకల్ప సంగీతానికి అనువుగా నృత్యం చేయమంటారు. సాధకుడలా దిగజారలేడు. అంతే ఇంకేముంది? అతడు స్వామికాదు. దుర్మార్గుడని లోకమంతా చాటేస్తారు. పరమహంస విలువ పశువుకేమి తెలుస్తుంది?

ఇతరులు మన్పై జూపు కరుణ సానుభూతి మతాబుల కాంతివంటిది. స్థిరంగా నిలువదు. ఒకవేళ స్థిరంగా నిలవాలంటే వారికనుగుణ్యంగా ప్రవర్తించి అధర్మంగా చరించాలి. కనుక జనస్తుతిని ఉపేక్షించినచో సాధకుడు ప్రశాంతతతో ధర్మయుతంగా జీవించగలడు.

జనకృపనెలా ఉపేక్షించాడో, అలాగే జన క్రౌర్యమును గూడా ఉపేక్షించమని ఆచార్యులు ప్రబోధిస్తున్నారు. సాధకుడు ఎవరిని కష్టపెట్టడు. అందరినీ సమదృష్టితోనే వీక్షిస్తాడు. అయినను ఒక్కొక్కసారి ప్రజలు అతనిని ఏవగించుకుంటూ క్రౌర్యమును ప్రదర్శించడము కూడా జరుగుతుంది. కృప ఎలా వారి వ్యక్తిగత మనోభావ జనితమో క్రౌర్యమూ అలాగే వస్తుంది.

తమకు సాధకుని వలన హాని జరుగుచున్నట్లు భ్రాంతి చెంది క్రూరంగా ప్రవర్తించవచ్చు. అదా అతని వైఖరి ప్రజలకు నచ్చకపోవచ్చు. లేదా అతని ఔన్నత్యమును గాంచి ప్రజలలో ఈర్ష్య జనించవచ్చు. ఇక అక్కడ నుండి అంతా అసత్యపు పుకార్లు, అసహ్యపు నిందారోపణలు, భ్రష్టత్వం పొందిన మనసులు అంతకన్నా బాగుగా ఆలోచించేదేముంటుంది? ఈ సమాజమొక గచ్చపొద. విషవలయం. కృపాక్రౌర్యాలనే బొమ్మ

బొరుసులతో గూడిన అభిప్రాయమనే నాణెమును సమాజము ఎప్పుడెలా త్రిప్పుతుందో ఎవ్వరూ ఊహించలేరు.

ఈ విషయమును సాధకుడు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని నిందా స్తుతులయందు ఉదాసీన వైఖరి నవలంబించుచు, జనకృపా క్రౌర్యములను ఉపేక్షించి మనుగడను సాగించాలి.

ప్రశాంత చిత్తముగలవారే జనకృపా క్రౌర్యములను ఉపేక్షించి ఉదాసీనులై జీవించగలరు. ప్రశాంత చిత్తము కలుగవలయుననిన ధ్యాన జీవనమునకు మనము అలవాటు పడియుండాలి. ధ్యాన జీవనమునకు అలవాటు పడవలయు ననిన ఏకాంత జీవనము కొంతకాలము కొనసాగించాలి. ఈ విషయమునే రాబోవు సోపానములో ఆచార్యులు చర్చిస్తున్నారు.

ఏకాంతే సుఖమాస్యతాం
　　పరతరే చేతస్సమాధీయతాం
పూర్ణాత్మాసు సమీక్ష్యతాం
　　జగదదిం తద్ బాదితం దృశ్యతాం
ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం
　　చితి బలాన్నా ప్యుత్తరైః శ్లిష్యతాం
ప్రారబ్ధం త్విహ భుజ్యతాం
　　అథ పరబ్రహ్మాత్మనా స్థీయతాం ॥ 5

తాత్పర్యము :–

33. ఏకాంతంలో సుఖంగా జీవించాలి.
34. బ్రహ్మభావనలో చిత్తమును స్థిరపరచాలి.
35. సర్వత్ర పూర్ణాత్మను దర్శించాలి.
36. ప్రపంచము మాయయని గ్రహించాలి.

37. సంచిత కర్మలనుండి విముక్తి పొందాలి.
38. జ్ఞానశక్తిచే ఆగామి కర్మలనుండి విడిపడాలి.
39. ప్రారబ్ధకర్మ ననుభవించాలి.
40. అనంతరము బ్రహ్మ భావనలో చరించాలి.

వ్యాఖ్య

33. ఏకాంతజీవనము (Enjoy the bliss of solitude) :-

సాధకుడు ఏకాంతజీవనములో సుఖించాలి అని ఆచార్యులు బోధిస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రగతికి ఏకాంత జీవనమే పునాది. ఏకత్వము నుపాసించు సాధకుడు ఏకాంతమునే అభిలషిస్తుండాలి. మనస్సు మదించిన గజమువలె విషయప్రపంచ ఘోరారణ్యంలో విహరించే స్వభావము గల్గియుంటుంది. సాంగత్య దోషముచేత అది మరీభయంకరంగా తయారవుతుంది. మనో నిగ్రహమను అంకుశముచే దానిని లోబరచుకోవాలి. విషయాల మధ్య, వ్యక్తుల మధ్య వుంటూ మనసును నిగ్రహించడమనేది పిల్లవానిముందు బొమ్మలుంచి ముట్టుకోవద్దని చెప్పడమే అవుతుంది. కనుక విషయ ప్రపంచానికి దూరమై ఏకాంత జీవనం గడపాలి.

"ఏకాకీచింతయే నిత్యం వివక్తే హితమాత్మనః
ఏకాకీ చింతయా నోమి పరంశ్రేయోఽధి గచ్ఛతి"

"సదా ఏకాంత ప్రదేశమున నివసిస్తూ ఆత్మ హితమును గూర్చి చింతించాలి. ఇలా ఏకాంతములో మననము చేయు పురుషుడు మోక్షమును బొందును" అని శాస్త్ర ప్రవచనము.

అయితే ఇక్కడ ఒక్క విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆచార్యులు ఏకాంతమన్నారేగాని ఒంటరితనమని చెప్పలేదు. ఏకాంతము వేరు. ఒంటరి తనము వేరు. ఏకాంత వాసనమునకై గ్రామాలు వదలి అరణ్యాల కేతెంచవలసిన పనిలేదు. ఒంటరితనానికి స్థలమార్పు జరుగవలసిందేగాని, ఏకాంతవాసమునకు స్థలమొక ప్రతిబంధకము కానేరదు.

ఆధ్యాత్మిక చింతనకు ఏకాంతవాసము కావాలి. ఏకాంతమనునది అరణ్యములో ఉన్నట్లయితే, అక్కడ సంచరిస్తున్న వ్యాఘ్రములు, జింకలు, పక్షులు, అన్నీ ఏకాంత జీవనము కలిగియున్నట్లే కదా! అదే నిజమైతే పులి క్రౌర్యంలో మార్పు వచ్చిందా? లేడి చూపులు స్థిమితము నొందినవా! లేదు. కనుక మనోనిగ్రహం లేనపుడు ఒంటరితనము ప్రశాంతత నిస్తుందని చెప్పలేము. మనో నిగ్రహము గల్గినపుడు ఒంటరిగా యుండవలసిన అవసరం కూడా లేదు.

కనుక ఒంటరితనమనునది శారీరక కట్టుబాటు. ఏకాంతమనునది మానసిక శిక్షణ. మనసులో సంకల్పాల సుడులు తిరగకుండా చిత్తమును సదా ఆత్మ యందుంచుటే ఏకాంతము. తనలో తాను ప్రశాంతత ననుభవించుటయే ఏకాంతము.

అందరూ అలా ఏకాంతములో జీవించలేరు. కనుక ప్రారంభకులైన సాధకులు కనీసము ఒంటరితనమునైనా అలవరచుకుంటే, ఆతరువాత ఏకాంతములో జీవించడము అలవడుతుంది.

"నాసో బహునాం కలహో భవేద్వార్తా దయోరపి"

అనేకులు వసించుటచేత కలహము, ఇద్దరు వసించుటచే భాషణము అని భాగవతము తెలియచేయుటచేత ఒక్కరుగా నుండుట ఆధ్యాత్మిక సాధకులకు భూషణము అని గ్రహించవచ్చు.

"జనసంగ పరిత్యాగాత్"

వ్యక్తులతో సంగత్యమును విడచిపెట్టమని హఠయోగము నందు తెలియజేయబడింది.

కనుక ప్రారంభమునందు ఒంటరితనము శ్రేష్ఠమైనను అదియే ఏకాంతమని భ్రమచెందకుండా, ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించి తనలో తానుండే ఏకాంత వాసాన్ని అలవరచుకోవాలి. ఏకాంత జీవనము గలవాడు తనచుట్టు ఎంతగోల జరుగుచున్నను తాను మాత్రము గోవింద నామస్మరణంలో

ప్రశాంతంగా యుంటాడు. ఒకవైపు సంత అరుపులు, ఒకవైపు పిల్లల శబ్దాలు, ఒకవైపు ఫ్యాక్టరీ ధ్వనులు, ఇంకొకవైపు శునకాల జగడాలు ఇన్ని చుట్టుముట్టి గోల చేయుచున్నను ఏకాంతవాసి ప్రశాంతంగానే యుంటాడు. ఇవేవీ జొరబడటానికి వీలులేని ఇనుప కుడ్యాల్ని తనచుట్టు ఏకాంత జీవనము ఏర్పాటు చేస్తుంది.

అట్టి ఏకాంత జీవనము లభించవలయునన్న బహిర్ముఖమయ్యే మనస్సును దారి మరల్చి నిరంతరము బ్రహ్మభావనయందే స్థిరపరచడము అభ్యాసము చేయాలి. ఆ విషయాన్ని రాబోవు సూచనలో తెలియజేయుచున్నారు.

34. బ్రహ్మ భావము **(Let the mind always meditate on the Supreme consciousness)** :- బ్రహ్మభావనలో చిత్తమును స్థిరపరచమని ఆచార్యులు తెలియచేయు చున్నారు. బ్రహ్మానందానుభూతియే సకల సాధనల లక్ష్యమై యున్నది.

"సర్వేషాంహి బ్రహ్మవిద్యా పురుషార్థాయ ఉపదిశ్యతే"

సర్వులు పొందదగిన "పరమ పురుషార్థము బ్రహ్మవిద్యయే యగు"నని శ్రీ శంకర భగవత్పాదులు బృహదారణ్యకోపనిషద్భాష్యంలో తెలియజేయు చున్నారు.

బహిర్ముఖమయ్యే మనస్సు ఆత్మానందమును పొందలేదు. అంతర్ముఖమైన మనస్సు బాహ్యవస్తు పరిస్థితులయందు రమించలేదు. ఈ మనస్సను రేడియోలో రెండు కేంద్రములున్నవి. ఒకటి జగత్కేంద్రము. రెండవది ఆత్మకేంద్రము. మనోరేడియోను జగత్కేంద్రానికి మేళవించినచో ఆలోచనలు, అలజడులు, దుఃఖము, అజ్ఞానము ధ్వనిస్తాయి. ఆత్మకేంద్రానికి మేళవించినచో ప్రశాంతత, ఆనందము, జ్ఞానము స్ఫురిస్తాయి. కనుక మేళవించడమనే ఈ సంకల్పచలనాన్ని శోకమయమైన జగత్కేంద్రానికి గాకుండా, ఆనందప్రదమైన ఆత్మకేంద్రమునకు మేళవించాలి.

సంకల్పమనునది అద్భుతమైన చలనాత్మక శక్తి తరంగము. శక్తి సమన్వితమైన ఈ మనోసంకల్పాలను ప్రపంచమువైపు నడిపించి నిర్వీర్యం చేయకుండా, ఆత్మవైపు నడిపించి శక్తివంతం చేయాలి. దివ్యభావాలే

మనస్సులో కదిలేటట్లు చూచుకోవాలి. నీ మనస్సులో నడిచే భావాలే నీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. సంకల్పము శక్తి సమన్వితమైనది. మనస్సులో నడచు సంకల్పాలను జాగ్రత్తగా పరిశీలిస్తుండాలి.

పదునెనిమిది సంవత్సరాల క్రితం నేను రైలులో ప్రయాణం చేస్తున్నాను. అప్పుడు నావయస్సు పదునేడు సంవత్సరాలు. నాచేతిలో ఒక ఆధ్యాత్మిక మాసపత్రిక యున్నది. అది నేను చదువుతూయుండుట నా ప్రక్కనున్న ఒక వ్యక్తిచూశాడు. నన్ను పలుకరించాడు. ఆ పుస్తకాన్ని తీసుకొని ఐదునిమిషాలు చదివాడు. ఆతరువాత వేదాంత విషయాలు నాతో చర్చించసాగాడు. ఈ విధంగానే మేమిద్దరము ఒక గంటసేపు ఆనందంగా సత్సంగము జరుపుకున్నాము: మా ప్రక్కనే ఒక సన్యాసి కూర్చునియున్నాడు. మా సంభాషణలో అతడు కలిశాడు. మృదుమధుర భాషణంతో, శాస్త్రావగాహనతో, చక్కటి ఆంగ్లభాషలో చర్చజరిపి మా ఇద్దరికి ఏమీరాదని ఐదునిమిషాల్లో చెప్పకనే చెప్పేశాడు. అతడి పాండిత్యానికి నాకు ఆశ్చర్యంవేసింది. అతడి నిరాడంబరత నన్ను అమాంతంగా ఆకర్షించింది. అతని మాటల్లో చిందించబడే ప్రేమ ముందు నేను పిచ్చివాడనయ్యాను. మేమిరువురము నోటిలో తడి ఆరిపోగా తదేకంగా అతనివైపే చూస్తూన్నాము. "శాస్త్రాన్ని బాగాచదివి, మననం చేయండి. అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి."అని చెప్పాడా మహాత్ముడు. ఆయనకు తెలుగు బాగారాదట. ఇంగ్లీషులో ప్రసంగించాడు. నా స్టేషన్ దగ్గరవుతున్నది. నా మనస్సు ఆ మహాత్ముని నుండి వెనుకకు మరలి రావడంలేదు. మహాత్మా! నాస్టేషన్‌వచ్చేస్తున్నది. నన్ను ఆశీర్వదించండి. నేను ఆచరించి తరించేందుకు ఏదైనా ఒక్క వాక్యం చెప్పండి" అని అడిగాను. అంతే ఆయన నవ్వుతూ నా వైపు తదేకంగా చూసి **"Your thought makes you a saint or a sinner"** "నీనుండి కదిలే సంకల్పమే నిన్ను మహాత్ముడిగానో లేదా మహాపాపిగానో చేస్తుంది" అన్నారు. నేను నమస్కరించి దిగేశాను. ఆ వాక్యం నా స్మృతి పథమునుండి ఈనాటికీ తొలగిపోలేదు. ఆ మహాత్ముడనిన ఆ ఒక్కమాటే ఈనాటి నా జీవితాన్ని ఒకనాడు మలుపుత్రిప్పినది. ఈనాటికీ త్రిప్పుతున్నది.

ఒక మంచి ఆలోచన ఒక మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. అలాగే ఒక దుష్టసంకల్పము జీవితాన్నే పాడుచేయవచ్చు. కనుక నిరంతరము బ్రహ్మ చింతనలోనే జీవిస్తుండాలి. ఆ తరువాత ఆ సంకల్పాలుకూడా అదృశ్యమై నీవే చైతన్యమని గ్రహించి తరిస్తావు.

సంకల్పాలు అదృశ్యము కావడమే మనోనాశము. ఈ మనోనాశము రెండువిధాలుగా జరుగుతుంది. 1. ఏకవస్తు చింతనముద్వారా జరుగుతుంది. 2. లేక ఏ వస్తువును చింతించకుండా ఉండటమువలన జరుగుతుంది. మొదటి ఏకవస్తుచింతన సాధనలో రెండవ విషయమువైపు సంకల్పము నడువకుండా చూసుకోవాలి. రెండవ సాధనయైన చింతనా రాహిత్యంలో నిద్ర, జడత్వాది అచేతన స్థితులలోనికి జారకుండా జాగ్రత్త పడాలి.

సాధన స్థితియందు అలాగే బ్రహ్మభావముతో జీవించగలము. కాలమంతయు ధ్యానములోనే గడుపలేము కదా? బాహ్య ప్రపంచములో జీవించవలసి వస్తుంది కదా? అలాంటి సమయాల్లో సాధకుడెలా ప్రవర్తించాలి? ఈ సందేహమును రాబోవు ఉపదేశములో శ్రీ శంకరులు నివృత్తిచేయుచున్నారు.

35. ఏకత్వానుభూతి **(Behold the infinite Brahman everywhere):-**

సర్వత్రా పూర్ణాత్మను దర్శించమంటున్నారు శ్రీ శంకరులు. చూచెడి ద్రష్టయైన తాను ఆత్మయేనని ఇంతవరకు తెలుసుకున్నాము. తాను చూచువాడు గనుక తనయందు తెలియబడునదంతయు కూడా తానే అయియున్నాడు. స్వప్నానుభవమును పొందువానికి తనలో గోచరించు వస్తువులన్నియు తనకన్నా అన్యముగానట్లు జాగ్రదావస్థయందలి తన వ్యాపకత్వమును గ్రహించినచో తానూ జాగ్రదావస్థయూ రెండు కాదని తెలిసి అంతయూ తనయందే జరుగుచున్నదని గ్రహించుటచే అభేద దర్శనము జరుగను. అదియే సర్వత్ర పూర్ణాత్మను దర్శించుట.

"దృశ్యతే శ్రూయతే యద్యత్ బ్రహ్మణోన్యత్ నత ద్భవేత్"

"ఏదయితే చూడబడుచున్నదో, వినబడుచున్నదో అది బ్రహ్మము కంటెను వేరుకాదు" యని శ్రీ శంకరులు ఆత్మబోధయందు తెలియజేశారు.

సత్యము త్రికాలములయందును పరిణామ రహితమైనది. ఈ సత్యమును గ్రహించిన వ్యక్తి జగద్వ్యామోహము నుండి విముక్తుడవుతాడు. జగత్తు పరిణామ శీలము గనుక మాయా స్వరూపము. బ్రహ్మము కాలాతీతము. జగత్తునకు అధిష్ఠానము. కల్పిత వస్తువు నశించినను అధిష్ఠానవస్తువు నశించదు. అది అవినాశి. ఆధేయము నశించినా ఆధారము క్షీణించదు. జగత్తునకు బ్రహ్మము ఆధారమై యుండుటవలన జగత్తులో గోచరించు వికారములు బ్రహ్మము నంటవు. ఈ సత్యము ఎప్పుడయితే సాధకునకు ఎరుకపడినదో ఇంతవరకు తనను పిచ్చివాడ్ని చేసిన వస్తు ప్రపంచగారడి క్షణంలో అదృశ్యమై దానిస్థానే నిత్య,శుద్ధ,బుద్ధ, ముక్త స్వరూపమైన బ్రహ్మము అనుభవమునకు అందును.

సర్పము రజ్జువునందు ఎప్పుడూ లేదు. మూడు కాలములయంధు నున్నది రజ్జువేగాని సర్పము కాదు. దర్శన కాలమునందు కూడా సర్పము లేదు. కానీ సర్పభ్రాంతికి కూడ రజ్జువు కారణమైయున్నను, భ్రాంతి సమయంలో గూడా రజ్జువే సత్యపదార్థమై యున్నది. మిథ్యావస్తువుయైన సర్పముయొక్క లక్షణములు అజ్ఞానముచే రజ్జువునంధు ఆరోపించబడినవి. సత్య దర్శనం జరగాలి. జగత్తు యొక్క అనిత్యత్వం అనుభవానికి అందాలి. సర్పము కల్పితమనియు, రజ్జువుకన్నా అన్యముగాదనియు గ్రహించుటచేత, సర్పదర్శనం వలన కలిగెడి బాధలు నివారింవబడినట్లు జగత్తు మాయాజనితమనియు, బ్రహ్మముకన్నా అన్యముగాదనియు గ్రహించుటచేత, జగత్తును దర్శించుటవలన కలిగెడి దుఃఖాలు తొలగింపబడుతాయి. మరి జగత్తును మిథ్యయని గ్రహించు టెట్లు? ఈ విషయమును ఆచార్యులవారు రాబోవు సోపానములో తెలియ జేయుచున్నారు.

36. జగన్మిథ్య(Comprehend the illusory nature of the world):-

ప్రపంచమును మాయయని ఆచార్యులు గ్రహించమంటున్నారు. మిథ్యా జగత్తుయొక్క అనిత్యత్వాన్ని గుర్తించి గ్రహించమని ప్రబోధిస్తున్నారు. మిథ్య లేక మాయ యను పదములు అనిత్యానికి చిహ్నములు.

"ఆది మధ్యావ స్థానేషు యామాసామాయ"

ఆది మధ్యాంతములందు ఏదయితే లేదో అది మాయ. మరి మాయ లేనిదే అయినపుడు దానిని గూర్చి ప్రస్తావించాల్సిన అవసరం మాత్రం ఏముంది? ఎందుకొచ్చింది? లేకనే ఉన్నట్లు గోచరించడమే మాయ. మాయ అనునది అజ్ఞానజనిత భ్రాంతిమయ దృశ్యము. శుక్తికా రజిత భ్రాంతిలాంటిది. ముత్యపు చిప్పయందు వెండిలేదు. అయినను భ్రాంతి ఆవరించిన ఒక కాలములో వెండి యని భావించడము జరిగినది. యదార్థానికి ఆదియందును ముత్యపు చిప్పలో వెండిలేదు. సత్యము గ్రహించిన తరువాత వుండదు. ఆద్యంతములయందు ఏదయితే లేదో ఆది మధ్యలో యున్నను లేనిదేయని గ్రహించాలి. లేనిదే ఉన్నట్లు గోచరించడమే మిథ్య లేక మాయ **(Illusion).**

"యద్నాస్తి తదల్పం" ఏదయితే లేదో అది అల్పము. నామరూపాలు అనిత్యము. ఆత్మనిత్యము. ఒకకాలములో భ్రాంతిమయ స్థితిలో గోచరించునది మాయ. త్రికాలములయందును వుండి, కాలాతీతమై భాసించు ఆత్మ నిత్యము. సత్యము. సత్యమైన ఆత్మ అనిత్యమైన మాయకు అధిష్ఠానము. ఆలంబనము.

రజ్జువే లేనిచో సర్పభ్రాంతి కలుగడానికే ఆస్కారము లేదు. కలిగినను అక్కడున్నది రజ్జువే కాని సర్పముకాదు. రజ్జుస్థితిలో ఎలాంటి మార్పులేదు. తాను ఏవిధమైన మార్పుకు లోను గాకుండానే సర్పమునకు ఆలంబనమై యున్నది. సర్పమునందు గోచరించు వికారములు మనోజనిత వికారములే

గాని అవి ఏవి రజ్జువునందు లేవు. కనుక సర్పము భ్రాంతి. కనుపించే సర్పమును భ్రాంతి అని ఎలా భావించగలము? అవును. సర్ప... గోచరమవుతున్నది. కనుక సర్పము సర్పముగా మిథ్య. సర్పము రజ్జువుగా సత్యము. అలాగే కనుపించు ఈ నామరూపాత్మక ప్రపంచము కూడా మిథ్యయే. అయితే ప్రపంచము ప్రపంచముగా మిథ్య. ప్రపంచము పరమాత్మగా సత్యము.

మరి భగవంతుడే ఈ ప్రపంచముగా పరిణామము చెందినాడా? భగవంతుడు పాలు వెన్నగా మారినట్లు, పరిణామం చెందేవాడు కాడు. భ్రాంతిలో పడిన మనస్సుకు మోడులా మనిషి కనుపించాడు. యదార్థానికి అక్కడున్నది మోడేగాని మనిషి కాదు. మనిషి కనిపించినను మోడు మనిషిగా మారలేదు. తాను మారకనే మార్పుకు కారణంలా కనుపించుచున్నది.

భగవంతుడు కూడా అలాగే పరిణామం చెందలేదు. జగత్తు తనలో ఆరోపించబడినది.మనిషి మోడులో లేడు. కనుక మోడు మనిషికన్నా విలక్షణమని గ్రహించాలి. ఇదొక స్థాయినుండి జరిగిన నిర్వచనము. మరిఈ జగత్తుదేని నాధారము చేసుకొని గోచరించుచున్నది? ఉన్నది బ్రహ్మమేగాని రెండవ వస్తువు లేదు. అలాంటప్పుడు బ్రహ్మకన్యముగా ఏమీలేదు. ఉన్నదంతా బ్రహ్మమే. బ్రహ్మకన్నా భిన్నంగా మరేదీలేనందున బ్రహ్మమును విలక్షణమని భావించడానికి కూడా వీలులేదు. ఇది మరొకస్థాయి నుండి దర్శించగా అందిన నిర్వచనము. కనుక బ్రహ్మకన్నా వేరుగా మరేదైనా గోచరించినచో దానిని మిథ్యగా గ్రహించాలి.

"బ్రహ్మాన్యద్భాతి చేన్మిథ్యా యథామరుమరీచికా"

"బ్రహ్మకన్నా అన్యముగా ఏ వస్తువైనా గోచరించినచో అది ఎండ మావులలోని నీటివలె, అసత్యమైనదని గ్రహించాలి"అని పూజ్యపాదుల ప్రబోధము.

"హరి మయముగాని సర్వము పరమాణువులేదు వంశ పావనవింటే" అని భాగవతంలో పోతన మహాకవి ధృవీకరించాడు.

మాయయనునది లేకనే గోచరించునది గనుక దానిని ఇలాయని నిర్వచించుటకు వీలులేదు. నిర్వచించుటకు ప్రయత్నించువాడు కూడా మాయయందే నిలిచి ప్రసంగించడానికి ప్రారంభించడమే ఈ అశక్తతకు కారణము. మాయను నిర్వచించుట బహుకష్టము. బ్రహ్మానుభవముచే అదృశ్య మగుటచేత దానిని సత్తని చెప్పుటకు వీలులేదు. ఒక కాలములో అనుభవమునకు అందుటచేత అసత్తనుటయు భావ్యంకాదు. విరుద్ధభావ ప్రకటన చేయగూడదు గాన సదసత్తని కూడా నిర్వచించకూడదు.

నిత్యమైన ఆత్మ ఎప్పుడూ యుంటుంది. మిథ్యయైన జగత్తు ఒక్కకాలంలోనే గోచరిస్తుంది. మాయను దర్శించేది మనస్సు. ఆత్మ మాయాతీతమైనది. ఆత్మానుభవములో మాయలేదు. కనుక మనోవ్యాపారములు నడుచుచున్నంత వరకే మాయా ప్రభావము మనిషిపై యున్నది. మనస్సునే నశింపజేసినచో మాయ అంతరించిపోతుంది. అదొక్కటియే సూటియైన మార్గం.

జ్ఞానస్ఫూర్తితోనే మనస్సు నశించాలి. మరి మనస్సు నశిస్తే కర్మ వలయమునుండి ఎలా బయటపడాలి? జ్ఞానాగ్నిచేత మనస్సుతోపాటు కర్మలు కూడా దగ్ధమైపోతాయి. అలా జ్ఞానమును పొంది కర్మత్రయ సముద్రమునుండి బయటపడమని రాబోవు మూడు సోపానాలలో తెలియజేస్తున్నారు.

37. **సంచిత కర్మవిముక్తి (Liberate thyself from accumulated works) :-** సంచిత కర్మలనుండి విముక్తి నొందమని ఆచార్యులు ప్రబోధిస్తున్నారు.

"అనంతకోటి జన్మానాంబీజభూతం సత్ యత్కర్మ జాతం
పూర్వార్జితం సంచిత జ్ఞేయమ్"

"రాబోవు అనంతకోటి జన్మలకు కారణములైన, బీజరూపములో నున్న, గత కోటిజన్మలలోని కర్మఫలితాలను సంచితకర్మలందురు." యని ఆదిశంకరులు తత్త్వబోధలో తెలియజేసియున్నారు.

గత జన్మలలో మనమాచరించిన కర్మల ఫలితాలే ఈ జన్మలోని సుఖదుఃఖాలకు కారణమైనవి. నేడు మనమనుభవించు ఫలాలకు అవి కారణములై యున్నవి. అవియే సంచిత కర్మలు. సంచిత కర్మలవలన ఏర్పడు ఫలితాలనుండి బయటపడవలెననిన జ్ఞానమొక్కటియే మార్గం. మూయబడిన ఒక గదిలో కొన్ని సంవత్సరములు చీకటియుండినను వెలుతురు రాగానే చీకటి మటుమాయమైనట్లు మన గతకర్మల ఫలితంగా ఏర్పడియున్న సంచిత కర్మలన్నియు జ్ఞానాగ్నిచేత దగ్ధమగును.

గత కర్మసంబంధిత వాసనలన్నియు జ్ఞానము కలుగగానే ఎలా నమసిపోతాయి? మేలుకున్న తరువాత కలలోని కర్మఫలితాలనుండి ఎలాగైతే బయటపడుతున్నామో అలాగే ఆత్మానుభవ దివ్యతేజస్సులో గత కర్మలవలన ఏర్పడిన ఫలితాలన్నీ మాయతో పాటే నశిస్తాయి.

"భిద్యతే హృదయగ్రంధిః ఛిద్యన్తే సర్వసంశయాః
క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్దృష్టే పరావరే"

అజ్ఞానము నశించగానే సంశయాలన్నీ నశిస్తాయి. ఆత్మ దర్శనంతో జ్ఞానికర్మ వలయమునుండి బయటపడుతాడని ముండకోపనిషత్ తెలియజేయుచున్నది.

జ్ఞానము కలిగిన తరువాత కర్మలు నశిస్తాయి. అయితే జ్ఞానము కలుగునంతవరకు కర్మయోగ రహస్యము నెరిగి కర్మలాచరిస్తూనే యుండాలి.కర్మలను త్యజింపకూడదు. వదలవలసింది కామాన్నేగాని కర్మనుగాదు.

"ప్రాగాత్మ జ్ఞానాత్ ప్రవృత్త్యుపపత్తేః"

"ఆత్మజ్ఞానము కలుగుటకు ముందు కర్మాచరణ సముచితమై స్వాభావికమై యున్నదని" శ్రీ శంకరాచార్యులవారు బృహదారణ్యకోపనిషద్భాష్యంలో తెలియజేసి యున్నారు.

అయితే ఇక్కడ కొందరికి ఒక సందేహం కలుగవచ్చు. కర్మ అజ్ఞాన తిమిరంలో పడదోస్తుందేగాని మోక్షప్రాప్తికెలా అవుతుంది ?

చెరువునిండా నీళ్ళున్నాయి. ఈతరానివాడు అందులో పడితే మరణించడం ఖాయం. కనుక నీటితో నిండియున్న చెరువు మరణ ప్రాప్తి స్థానమై యున్నది. అదే చెరువులో ఈత తెలిసిన వ్యక్తి దిగుతాడు. చక్కగా ఈది, స్నానంచేసి పరిశుభ్రంగా గట్టుమీదికి వస్తాడు. అతని విషయంలో చెరువు మరణప్రాప్తి స్థానంకాదు. కనుక కర్మకూడా అజ్ఞానిని బంధిస్తుంది. కర్మరహస్యం తెలిసిన వ్యక్తి కర్మలాచరిస్తూనే కర్మవలయమునుండి బయటపడతాడు. శ్రవణ మనన నిధిధ్యాసలద్వారా ఆత్మానుభూతిని పొందుతాడు. మేలుకున్నవాడు స్వప్నబాధలనుండి బయటపడినట్లు జ్ఞాని సంచిత కర్మలనుండి విముక్తిని పొందుతాడు.

జ్ఞాని ఆత్మానుభూతిని పొందుటచే సంచిత కర్మలు దగ్ధమయ్యాయి. మరి ప్రస్తుతము కూడ కర్మలాచరిస్తూనే యున్నాడు. వాటి ఫలితాలు రాబోవు జన్మలకు పునాదులవుతాయిగదా! వాటివిషయంలో సాధకుడెలా ప్రవర్తించాలి? ఈ విషయాన్ని రాబోవు సోపానములో ఆచార్యులవారు చర్చిస్తున్నారు.

38. ఆగామి కర్మ నివృత్తి **(Let theyself be freed from current works) :-** జ్ఞానశక్తిచే ఆగామి కర్మలనుండి విముక్తి నొందమని ఆచార్యులు ప్రబోధిస్తున్నారు. గత జన్మలో ఆచరించిన కర్మలయొక్క ఫలితాలు సూక్ష్మ రూపంలో వాసనలుగా యున్నవని అవియే సంచిత కర్మలని గ్రహించాము. సంచిత కర్మానుసారము ఈ జన్మలో అందుతున్న ఫలితాలను అనుభవిస్తున్నాము. అదియే ప్రారబ్ధకర్మ. ఈ ప్రారబ్ధకర్మము ననుభవిస్తూ, ఈ జన్మలో ప్రత్యేకంగా కొన్ని కర్మలాచరిస్తాము. వాటి ఫలితాలు రాబోవు జన్మలకు కారణమవుతాయి. అదియే ఆగామికర్మ. అనగా రాబోవు జన్మలకు సంబంధించినది. ఈ ఆగామికర్మ విషయంలో కూడా సాధకుడు జాకరూకుడై వర్తించి, ఆగామి కర్మ నుండి ముక్తుడు కావలయునని ఆచార్యులు హెచ్చరిస్తున్నారు.

కర్మలన్నీ మనలను బంధించవు. ఆసక్తితో ఆచరించినపుడే కర్మ మనలను బంధిస్తుంది. సాధకుడు ఏ ఆసక్తిలేక నిమిత్తమాత్రుడై కర్మలాచరిస్తాడు. అహంకారము అతని కర్మలలో కనుపించదు. అహంకార రహితకర్మ బంధహేతువు కాదు. కనుక ఆగామి కర్మ తయారుకాదు.

అదియునుగాక ప్రారబ్ధము ననుభవించు సమయములో కూడాఆగామి తయారయ్యే అవకాశముంది. ఉ॥ మన సంచితకర్మానుసారము వ్యాధి ప్రాప్తించినదనుకుందాం. ఆ వ్యాధి ననుభవించడము ప్రారబ్ధమైతే ప్రారబ్ధమును ఒకవైపు అనుభవిస్తూ, మరియొకవైపు రోగపీడిత బాధచే ఇతరులను నిందించి, కష్టపెట్టి, దుఃఖమునకు గురిచేస్తాము. ఇక్కడ ఆగామి తయారవుతున్నదని భావము. కనుక సాధకుడు ప్రారబ్ధ ఫలములను ఈశ్వర ప్రసాదంగా భావించి అనుభవిస్తూ, అహంకార రహితంగా, అనాసక్తితో కర్మలాచరించుటచేత సంచిత ప్రారబ్ధములు రెండును నశించిపోతాయి.

సంచిత కర్మలందించు ఫలితాలను ఈశ్వర ప్రసాదంగా భావించి అనుభవిస్తూ, ప్రస్తుతము అహంకార రహితంగా కర్మలాచరించి జీవిస్తూ, సంచిత ఆగామికర్మలనుండి విముక్తిని పొందుతాము. మరి ప్రస్తుతము ఈ శారీరక మనోబుద్ధులద్వారా అనుభవించవలసిన ప్రారబ్ధముయొక్క విషయ మేమిటి? ఈ విషయాన్ని రాబోవు సోపానములో చర్చిస్తున్నారు.

39. ప్రారబ్ధ కర్మానుభవము **(Enjoy the prarabdha fruitifying works) :-** ప్రారబ్ధకర్మను ప్రశాంతంగా అనుభవించమని ఆచార్యులు తెలియ జేయుచున్నారు. ప్రారబ్ధకర్మ యనగానేమి?

"ఇదం శరీరముత్పాద్య ఇహలోకే ఏవం సుఖదుఃఖాది ప్రదం యత్కర్మ తత్ప్రారబ్ధం భోగేన నష్టం భవతి ప్రారబ్ధకర్మాణాం భోగాదేవ క్షయ ఇతి

"ఈ శరీరము ప్రాప్తించుటకు ఏదికారణమై యున్నదో, ఈ ప్రపంచములో ఏ కర్మ సుఖదుఃఖముల రూపములో ఫలితము నందిస్తున్నదో, అనుభవించగానే ఏదయితే నశిస్తుందో అదియే ప్రారబ్ధకర్మ. ఫలితాల ననుభవించుట ద్వారా ప్రారబ్ధకర్మ నశిస్తుంది" యని భగవత్పాదులు తత్త్వబోధ యను గ్రంథంలో తెలియజేసియున్నారు.

మన జీవితములో సుఖదుఃఖాలు ఏర్పడుచున్నచో ప్రారబ్ధము పని చేయుచున్నదని భావము. ప్రారబ్ధము నెవ్వరూ దాటలేరు. ప్రారబ్ధము

మహాత్ములను గూడా వదలిపెట్టదు. రామకృష్ణ పరమహంసకు కాన్సర్ వచ్చింది. వివేకానందుకు ఉబ్బసము వ్యాధి వచ్చింది. రమణమహర్షికి సర్కోమా వచ్చింది. ప్రారబ్ధవశాత్తు మనకు శరీరాలు ప్రాప్తిస్తాయి. కనుక శరీరము ప్రారబ్ధానికి సంబంధించినది. కనుక ప్రారబ్ధంవలన జనించు సుఖదుఃఖాలు శరీరానివేగాని తనవి కాదని జ్ఞాని భావిస్తాడు. అంతా మన ఆస్తియేనన్నట్లు మనము తాదాత్మ్యం చెంది సుఖదుఃఖాల ననుభవిస్తుంటాము.

ప్రారబ్ధ మనునది శారీరక మనోబద్ధులకు సంబంధించిన దగుటచేత ప్రారబ్ధానుభవము కూడా స్థూలసూక్ష్మకారణ శరీరాదులకు సంబంధించినదేగాని ఆత్మకు సంబంధించినదికాదు. తాను ఆత్మయేగాని దేహేంద్రియ మనో బుద్ధులు కాదు గనుక తత్సంబంధిత సుఖదుఃఖాలు తనవికావు. ఇలా భావించి జీవించుటచేత ప్రారబ్ధమునుండి విముక్తి పొందవచ్చు.

గతములో మన మాచరించిన కర్మలయొక్క ఫలితాలే ప్రారబ్ధరూపంలో వస్తున్నాయని గ్రహించాము. మరి ఈ ప్రారబ్ధ ఫలమును అందించు వారెవరు? కర్మఫలదాతయైన భగవంతుడు. కర్మఫలాలు భగవానుని అమృతహస్తముల నుండి వచ్చుటచేత అవి ప్రసాదమని భావించాలి. కర్మఫలాలను ఎప్పుడయితే ప్రసాదంగా భావిస్తామో వాటి సాన్నిధ్యం మనకు దుఃఖాన్ని కల్గించదు. పైగా ప్రశాంతత నందిస్తుంది. ఈ విధంగా సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలనుండి విడిపడి తరించాలి.

సరే కర్మవలయంనుండి సాధకుడు అవగాహనతో మోక్షతీరం చేరుటకు ప్రయత్నిస్తున్నాడు. ప్రారబ్ధమును ప్రశాంతంగా అనుభవిస్తున్నాడు. కోరికలతో జీవించి ఆగామికర్మను తయారుచేసుకోవడం ఇష్టం లేదు గనుక అనాసక్తితో కర్మలాచరిస్తున్నాడు. కనుక అట్టి సాధకుని మనస్సు ఖాళీగాయుంటుంది. ఖాళీగాయున్న మనస్సు కర్మవలయంలో తగుల్కొవచ్చు. కనుక మనస్సును అట్లే ఖాళీగా ఉంచగూడదు. మరి ఏం చేయాలి? ఆ విషయాన్ని రాబోవు సోపానములో చర్చిస్తున్నారు.

40. బ్రాహ్మీస్థితి (Afterwards Abide thyself in the Absolute) :-

అనంతరము బ్రహ్మభావంలో చరించమని ఆచార్యులు చివరి సోపానాన్ని తెలియజేస్తూ ఈ సాధనపంచక ఆలయ నిర్మాణానికి కలశ ప్రతిష్ఠచేయు చున్నారు.

సాధకుడు ఈ స్థితిలో సమస్తమును వీడి అంతర్ముఖుడవుతున్నాడు. సర్వాన్ని మరచి ఆత్మకి దగ్గరగా ఆసీనుడగుచున్నాడు. ఆత్మకు దగ్గరగా ఆసీనుడగుట యనగా ఆత్మయే తానగుచున్నాడని భావము. నిరంతర బ్రహ్మభావనయందే మనసును రమింపచేయుచున్నాడు. మనోబుద్ధులలో కదిలే వికారములేవీ తనవిగావని తటస్థంగా యున్నాడు.

అవిద్యా చ స్వానుభవేన రూప్యతే
మూఢోఽహం అవివిక్తం మమవిజ్ఞానమ్ ఇతి

"నేను అజ్ఞానిని. ఆలోచించి తెలుసుకొను జ్ఞానము నాకులేదు యనునపుడు ఆ యజ్ఞానము తెలుసుకొను బుద్ధిదేయని నిర్ణయమగుచున్నది కదా? తన బుద్ధికి జ్ఞానము లేదు యనెడి విషయమును ఏజ్ఞానముచేత తెలుసుకొను చున్నాడో అదియే ఆత్మ" యని తైత్తిరీయము తెలియజేయుచున్నది.

"ఏ భూతం బ్రహ్మ విజ్ఞాసితవ్యం నిత్యత్వాత్ న పురుష
వ్యాపారతంత్రమ్"

"బ్రహ్మమేయున్నది. బ్రహ్మమును తెలుసుకొను కోర్కెయే యుండాలి. బ్రహ్మనిత్యవస్తువు. బ్రహ్మము నీ వాచరించు కర్మముపై ఆధారపడిలేదు యని ఆచార్యులు బ్రహ్మసూత్ర భాష్యంలో ప్రథమ అధ్యాయంలోని ప్రథమ పాదము నందలి ప్రథమ సూత్రముపై వ్యాఖ్యానము చేశారు.

కనుక మనసునుండి కదిలే ప్రతిసంకల్పము అంతర్ముఖమై ఆత్మవైపు నడవాలి. "బ్రహ్మవిద్ బ్రహ్మైభవతి" బ్రహ్మమును తెలియగోరువాడు బ్రహ్మమే కాగలడని ఉపనిషద్వాక్యము. బ్రహ్మభావంలో చరించు సాధకుడు అన్ని సంకల్పాలను అవలంకునెట్టి ఒక్క బ్రహ్మభావన వే చింతనచేయుచూ బ్రహ్మాకార

వృత్తిని బడయాలి. ధ్యానముచేయు సాధకుని మనస్సు స్ఫటికమువలె స్వచ్ఛంగా యుండాలి. పుష్పములముందు స్ఫటికము నుంచితే స్ఫటికము పూలతో తాదాత్మ్యం చెందుతుంది. పుష్పము నీలివర్ణమయితే స్ఫటికము నీలివర్ణముతో భాసిస్తుంది. పుష్పము ఎరుపురంగు అయినచో స్ఫటికము కూడా ఎరుపుగానే గోచరిస్తుంది. స్ఫటికము పూలతో తాదాత్మ్యం చెందియున్నట్లు సాధకుని మనస్సు ఆత్మైక్యం చెందాలి.

నిరస్త విషయాసంగం సన్నిరుద్ధం మనోహృది
యదాయా త్యాత్మనోభావం తదాతత్పరమం పదం"

"విషయ సంగత్వమునుండి విడిపడిన మనస్సు హృదయ స్థానమందలి ఆత్మయందు ఏకం చేయబడినచో, అప్పుడు పరమమైన మోక్షపదమును బొందునని అమృత బిన్దూపనిషత్ తెలియచేయుచున్నది.

ఇట్టి పరమోత్కృష్ట స్థితినే సదా సాధకుడు కాంక్షించాలి. జ్ఞానగమ్యమైన ఈ సచ్చిదానంద ప్రాప్తికే సాధకుని మనస్సు ఉరకలు వేయాలి. ఈ అభీష్టమునే విద్యారణ్యస్వామి చక్కగా వెలిబుచ్చారు.

"లయ విక్షేపకషాయ రసాస్వాదేభ్యో రక్షితం మే
చిత్త మవిఘ్నేన బ్రహ్మణ్యవస్థితం భూయాత్"

లయ, విక్షేప, కషాయ, రసాస్వాదములనుండి రక్షింపబడిన నా మనస్సు నిరాటంకముగా బ్రహ్మమునందు నెలకొనుగాక యని శ్రీ విద్యారణ్యస్వాముల వారు "బ్రహ్మవిదాశీర్వాదపద్ధతి" యను గ్రంథములో ఆశయమును కనపరుస్తూ ఆశీర్వాదమును చేశారు.

అనగా ప్రతిబంధ రహితమైన నిర్వికల్పనిర్బీజసమాధిని కాంక్షిస్తున్నారు. 1. 'లయ' మనగా నిద్రచేతగాని, ఆలసత్వముచేత గాని కలుగు సంకల్పరహిత స్థితి. 2. 'విక్షేప' మనగా మనస్సు బహిర్ముఖమగుట 3. 'కషాయ' మనగా రాగద్వేషాదులచే, అస్తవ్యస్తమైన సంస్కారము ప్రపంచవలలో తగుల్కొనుట. 4. 'రసాస్వాదము' యనగా సమాధియందు కలిగెడి విక్షేపమును, తత్సంబంధిత దుఃఖమును తొలగించుకొని తిరిగి ఆనందధామం చేరుట. ఈ నాల్గు

ప్రతిబంధములనుండి విడిపడిన చిత్తము నిరాటంకముగా బ్రాహ్మీ స్థితియందు నిలిచిపోవునట్లు ఆశీర్వదించమని భగవంతుని ప్రార్థిస్తూ, తన్ను తానే ఆశీర్వదించుకుంటున్నారు.

ఆధ్యాత్మిక సోదరీ సోదరులారా! అర్థమయిందా! మననిజరూప మెలాంటిదో గ్రహించారా! "నీవే బ్రహ్మవు!" యని సింహ గర్జనచేసే మన సనాతన ధర్మసౌందర్యాన్ని గుర్తించారా? ఎట్టి పవిత్ర సంస్కృతికి మనం వారసులమో తెలుసుకున్నారా? ఇకలేవండి....తమస్సును దూరం చేయండి. అజ్ఞానాన్ని పారద్రోలండి. జ్ఞానజ్యోతులై వెలగండి.

నిస్సార, నిర్వీర్య నీరస వ్యక్తులుగా మనం ఈ ప్రపంచాన్ని నిర్మించకూడదు. ఆనంద శిఖరాలనందుకుని ఆప్తకాములై, భాసించిన మహర్షుల సంతానమైన మనలో పిరికితనం చోటు చేసుకోకూడదు.

"శివోహం.........సదా శివోహం"

యని గర్జించండి.

"పూర్ణబోధోహం – సదానంద పూర్ణ బ్రహ్మోహం
ప్రత్యగాత్మాహం – ప్రవితత సత్య ఘనోహం
శృత్యంత శతకోటి ప్రకటిత బ్రహ్మోహం
నిత్యోహ మభయోహం అద్భుతాత్మాహం

"నేను పరిశుద్ధ జ్ఞాన స్వరూపుడను. సదానంద స్వరూపమైన జ్ఞాన స్వరూపుడను. నేనే అంతరాత్మను. సర్వవ్యాపకమైన సత్తాస్వరూపమును నేనే. శతకోటి పర్యాయములు ఉపనిషత్తులలో ప్రబోధించబడిన బ్రహ్మమును నేనే. నేను నిత్యుడను. భయరహితుడను. అద్భుతాత్ముడను. జ్ఞాన స్వరూపుడను" యని గర్జించిన అపర శివావతారమూర్తియైన సదాశివ బ్రహ్మేంద్ర స్వాములవారి అమృతనాదంలో మనమూ శృతి కలిపి, మతినిలిపి, గతితెలిసి యతి జీవన సౌందర్యముతో భగవదనుగ్రహించే ప్రకాశించెదము గాక!

ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత
(తత్త్వమసి)

ఫలశ్రుతి

యశ్శ్లోక పంచక మిదం పఠతే మనుష్యః
సంచిన్త యత్యనుదినం స్థిరతాముపేత్య
తస్యాశు సంసృతి దవానల తీవ్ర ఘోర
తాపః ప్రశాన్తి ముపయాతి చితిప్రభావాత్ ॥

తాత్పర్యము :–

ఎవ్వరయితే ఈ సాధన పంచకమును మానసిక ప్రశాంతతతో మననము చేయుచూ అనుదినము పఠింతురో అట్టివారు జ్ఞాన ప్రదీపులై సంసార దావాగ్ని యనెడి భయంకర తాపము నుండి విముక్తి నొందెదరు.

వ్యాఖ్య

ముంజేతి కంకణానికి అద్దము అవసరము లేనట్లు సాధన పంచకవైభవమును తెలియచేయుటకు ప్రత్యేకంగా ఫలశ్రుతిని తెలియజేయు నవసరము లేదు. కారణం అది స్వయంప్రకాశమై అలరారుటయే. అయినప్పటికి ఆచార్యుల వారు సాధన పంచకమునకు ఫలశ్రుతి తెలియచేయుటలో దాని ప్రత్యేక ప్రాశస్త్యమును నొక్కి వక్కాణించుటయే ప్రధానమై యున్నది.

సంసార దావాగ్ని యనెడి భయంకర తాపమునుండి విముక్తి పొందుమార్గమును ఈ ఫలశ్రుతి ద్వారా ఆచార్యులు తెలియచేయుచున్నారు. అజ్ఞాన జనితమైన సంసారమునందలి భ్రాంతి తొలగినపుడే జీవునికి శాశ్వతానందము లభించగలదు. సంసారము అజ్ఞాన జనితము గనుక అది జ్ఞానముతోనే అదృశ్యం కావాలి.

తమేవ విదిత్వాఽ మృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽ యనాయ"

"జ్ఞానముచే మృత్యువును అతిక్రమించునని" శ్వేతాశ్వతరోపనిషత్ తెలియచేయుచున్నది.

కనుక సంసార దుఃఖములనుండి బయటపడవలయుననిన జ్ఞానప్రదీపులై మెలగాలి. అట్టి జ్ఞానము సాధన పంచకమును పఠించుటచే లభ్యము కాగలదని ఆచార్యులు తెలియచేయుచున్నారు. జ్ఞానాగ్నిచే సంసారమను క్షీరమును కాచినచో సంసారమను నీరు ఆవిరియై జ్ఞానమను పాలు మిగులును.

కనుక సాధన పంచకమును నిత్యము పఠించాలి. చదివి వదలడము కాదు. అనుష్ఠానంలో స్థిరపడి తృప్తిచెందాలి. అందులకు మననమే మార్గము. అలజడులతో నిండిన మనస్సుతో మననం చేసినను ఉపయోగముండదు. మనస్సులో ప్రశాంతతను నింపుకొని మరీ మననం చేయవలెనని ఆచార్యులు తెలియజేస్తున్నారు. జ్ఞానమను తీగ అల్లుకొనుటకు మననమను పందిరి అవసరము.

ఈ సాధన పంచకములోని నలభై సోపానాలపై ప్రయాణము సాగించే ముముక్షువులు శాంతి ధామము జేరి తరించెదరని ఆచార్యులు తెలియచేస్తూ, ఆశీర్వదిస్తున్నారు.

ఓం నమో భగవతే వాసుదేవాయ

Adi Sankara's

Sadhana Panchakam

Forty instructions to seekers

1. **Study the Vedas daily**
2. **Carry out the injunctions of the Vedas**
3. **Offer the fruits of actions to the Almighty**
4. **Abandon the band of desires in to-to**
5. **Wash off all sins**
6. **Reflect over the evil of Samsara**
7. **Do Atmic enquiry**
8. **Free yourself from the trammels of birth and death**
9. **Seek the company of the wise**
10. **Develop unflinching devotion to the Lord**
11. **Cultivate virtues such as serenity, tranquility etc**
12. **Giveup selfish actions entirely**
13. **Surrender thyself to the Guru**
14. **Worship his sacred sandals everyday**
15. **Meditate on the mono-syllable AUM, the supreme reality**
16. **Listen to the upanishadic truths**
17. **Explore the meanings of the Mahavakyas**
18. **Take refuge in upanishads**
19. **Avoid vain arguments**
20. **Take recourse to the reason approved by the Vedas**
21. **Constantly Meditate : " I am Bramhan."**
22. **Give up egoism totally**
23. **Give up your identification with the body**
24. **Do not enter into argument with the wise**

25. **Find a remedy to the disease of hunger**
26. **Take the Medicine of Alms daily**
27. **Beg not for delicious dish**
28. **Be contented with what thou obtainest by chance**
29. **Endure the pairs of opposites such as heat and cold**
30. **Indulge not in idle gossiping**
31. **Be indifferent**
32. **Rise above people's favour or scorn**
33. **Enjoy the bliss of solitude**
34. **Let the mind always meditate on the supreme consciousness**
35. **Behold the infinite Bramhan every where**
36. **Comprehend the illusory nature of the world**
37. **Liberate thyself from accumulated works**
38. **Let thyself b[illegible] works**
39. **Enjoy the prarabdha (fructifying works)**
40. **Afterwards Abide thyself in the absolute.**

Merit :- **Those who recite this Sadhana Panchakam daily, with a calm Mind reflecting over its meaning, will soon be freed from the dreadful heat of the Samsaric wild fire.**